


# విశ్వంవాయిస్

అవినీతిపై- అక్షరసమరం...

తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY




SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT, CERCULATED AT IN WEST GODAVARI, VISAKHAPATNAM, SRIKAKULAM, VIJAYANAGARAM, VIJAYAWADA, HYDERABAD, BANGLORE, CHENNAI, DELHI, MUMBAI, TIRUPATHI, ANANTAPUR, GUNTUR, KADAPA, KHAMMAM, KARIMNAGAR, KURNOOL, NELLORE, NIZAMABAD, ONGOLE

సంపుటి : 07 సంచిక : 329 అమలాపురం ఎడిటర్ :కె. సునీల్‌కుమార్ గురువారం 18 జూలై 2024 పేజీలు : 12 వెల : 2/-

# ప్రజలకు మన కష్టం తెలియాలి

- సమస్యలన్నీ పోవాలనే ఆత్రుత ఉంటుంది
- కానీ, రాష్ట్రంలో ఏ శాఖలోనూ పైసా లేదు
- పిల్లల పరీక్షలకు విద్యా శాఖ వద్ద ఉండే
- నిధులు సైతం ఊడ్చేసిన గత సర్కారు
- కొత్త అప్పులకు ఏ దారినీ వదిలిపెట్టలేదు
- కేంద్ర పథకాలన్నీ నాడు దుర్వినియోగం
- దీంతో ఆ పథకాలను వాడుకోలేని పరిస్థితి
- అయినా ఏదీ ఆగకుండా చూస్తున్నాం
- ఇవన్నీ ప్రజల దగ్గరకు తీసుకువెళ్లండి
- టీడీపీ ఎంపీలకు చంద్రబాబు నిర్దేశం



**అమరావతి, విశ్వంవాయిస్ న్యూస్ :** ఆర్థికంగా తీవ్రమైన క్లిష్ట పరిస్థితులు ఉన్నా వాటిని ఎదుర్కొంటూ ఎంత కష్టపడుతున్నామో ప్రజలకు తెలియాలని ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యాఖ్యానించారు. ఢిల్లీ పర్యటన సందర్భంగా బుధవారం ఆయన కొందరు టీడీపీ ఎంపీలతో వివిధ అంశాలపై మాట్లాడినట్లు సమాచారం. "రాష్ట్రంలో ఏ శాఖలోనూ పైసా కూడా నిధులు లేవు. వైసీపీ దిగిపోతూ ప్రభుత్వాన్ని దివాలా తీయించింది. అత్యవసర ఖర్చుల కోసం శాఖల వద్ద అంతర్గతంగా ఉంచుకొనే డబ్బును కూడా ఊడ్చేశారు. పదోతరగతి పిల్లల నుంచి పరీక్షల కోసం చెల్లించే ఫీజులను విద్యా శాఖ వద్ద ఉంచి పరీక్షల ఖర్చుల కోసం వాడతాం. చివరకు ఆ డబ్బులు కూడా ఉంచకుండా వేరే పనుల కోసం వాడేశారు. చిన్న చిన్న పనులకు కూడా డబ్బులు లేవు. అయినా ఏదో రకంగా నెట్టుకువస్తున్నాం. ఏదీ ఆగకుండా చూసుకొంటున్నాం" అని ఆయన వారికి వివరించారు. కేంద్ర హోంమంత్రి అమిత్‌షా పిలుపు మేరకే తాను ఢిల్లీ వచ్చినట్లు ఆయన తెలిపారు. కేంద్ర బడ్జెట్ ప్రవేశపెట్టే ముందు మిత్రపక్షాలతో ఒకసారి మాట్లాడే నిమిత్తం పిలిచారని, మన అవసరాలు చెప్పామని ఆయన వారికి వివరించారు. "బడ్జెట్‌లో కేంద్రం మన రాష్ట్రానికి భారీగా నిధులు ఇస్తుందని ఆశలు పెట్టుకోవద్దు. అలా చేయలేరు. ఒక రాష్ట్రానికి ఇస్తే అన్ని రాష్ట్రాలు వాళ్ల మీద పడతాయి. మిగిలిన రాష్ట్రాలతో పోలిస్తే మన రాష్ట్రం పరిస్థితి ఎంత దిగజారిపోయిఉందో చెప్పాను. వాళ్లకూ అర్థం అయింది. కానీ కొన్ని పరిమితులు ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వ ప?థకాల నుంచి ఎంతవరకూ తీసుకోగలమో చూసుకొని వాటిని రాబట్టుకోవాలి. గతంలో మన ప్రభుత్వం ఉన్నప్పుడు ఉపాధి హామీ ప?థకం నిధులు కేంద్రం నుంచి బాగా తీసుకోగలిగాం. ఇప్పుడు కూడా కేంద్ర పథకాల్లో అలా వాడుకోగలిగినవి వాడుకోవాలని మిగతా 2లో..

## జనసేన సంగతేంటి ?



**అమరావతి, విశ్వంవాయిస్ న్యూస్ :** గత ఆరు నెలలుగా చూస్తే ఎన్నికల ముందూ తరువాత కూడా చేరికలు అన్నీ టీడీపీలోకి ఎక్కువగా సాగుతున్నాయి. ఎన్నికల ముందు టీడీపీలో పది మంది చేరితే జనసేనలో ఒకరిద్దరు చేరేవారు. ఎన్నికలు అయి కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. కూటమి ప్రభుత్వంలో మూడు పార్టీలూ ఉన్నాయి. ఏపీలో టీడీపీ ఆల్ రెడీ బలమైన పార్టీ. ఆ పార్టీకి నాయకులు క్యాడర్ పుష్కలంగా ఉంది. అయితే చంద్రబాబు 2029 ఎన్నికల గురించి ఆలోచిస్తూ ఎక్కువ మంది నేతలను చేర్చుకుంటున్నారు అని అంటున్నారు. రానున్న కాలంలో మరో యాభై సీట్లు పెరిగితే సమర్థులైన నేతలు అవసరం కాబట్టి అన్న ముందు చూపుతో బాబు చేరికలను ప్రోత్సహిస్తున్నారు అని అంటున్నారు. రానున్న రోజులలో మిగతా 2లో..

## పొత్తే బీజేపీ కొంప ముంచింది



**ముంబై:** లోక్‌సభ ఎన్నికల్లో మహారాష్ట్ర నుంచి బీజేపీ సీట్లు దారుణంగా పడిపోవడానికి అజిత్ పవార్ ఎన్సీపీతో కమలనాథులు పొత్తు పెట్టుకుని ఎన్నికలకు వెళ్లడమే కారణమా?. అవునని రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ అనుబంధ మరాఠీ వీక్లీ 'వివేక్' ఒక రిపోర్ట్‌లో తెలిపింది. ఎన్సీపీ అజిత్ పవార్ వర్గంతో బీజేపీ పొత్తు పెట్టుకోవడంపై రాష్ట్ర బీజేపీ నేతల్లో తీవ్ర అసంతృప్తి ఉందని పేర్కొంది. ముంబై, కొంకణ్, వెస్టర్న్ మహారాష్ట్రలో సుమారు 200 మందిని 'వివేక్' వీక్లే సర్వే చేసింది. మహారాష్ట్రలోని 48 లోక్‌సభ స్థానాలకు 2019లో జరిగిన ఎన్నికల్లో బీజేపీ 23 స్థానాలు గెలుచుకోగా, 2024 ఎన్నికల్లో ఆ సంఖ్య 9కి పడిపోయింది. కొద్దికాలం క్రితం శరద్ పవార్ ఎన్సీపీలో చీలిక తెచ్చి బీజేపీలో చేరిన అజిత్ పవార్ ఎన్సీపీతో బీజేపీ పొత్తు మిగతా 2లో..

## పరిశ్రమలు మూత పడుతున్నాయి



**అమరావతి:** ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడుకు కాంగ్రెస్ ఏపీ వ్యవహారాల ఇన్‌చార్జి మేయప్పన్ లేఖ రాశారు. సిలికా శాండ్ సరఫరా నిలిచి పోవడంతో ఫౌండ్రి పరిశ్రమలు మూత పడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. వేలాది కార్మికులు జీవనోపాధి కోల్పోతున్నారని లేఖలో మేయప్పన్ పేర్కొన్నారు. జూన్‌లో రాష్ట్రంలో రాజకీయ పరిణామాల మిగతా 2లో..

## ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్



**ఛత్తీస్‌గఢ్ :** పోలీసులు– మావోయిస్టుల మధ్య మహారాష్ట్రలో భీకర ఎన్‌కౌంటర్ జరిగింది. గడ్చిరోలి వందొలి గ్రామంలో 15 మంది మావోయిస్టులు ఉన్నారని పోలీసులకు సమాచారం వచ్చింది. వందొలి గ్రామం ఛత్తీస్ గఢ్ సరిహద్దులకు దగ్గరగా ఉంటుంది. ఇక్కడ మావోయిస్టులు తలదాచుకున్నారనే పక్కా మిగతా 2లో..

## మా రాష్ట్రానికి రండి

**మంత్రి లోకేశ్ ఆహ్వానం**

అమరావతి, : ప్రైవేట్ సంస్థల్లో 75శాతం ఉద్యోగాలు స్థానికులకే ఇవ్వాలని కర్ణాటక కేబినెట్‌లో తీర్మానించిన నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్‌కు రావాలని నేషనల్ అసోసియేషన్ ఆఫ్ సాఫ్ట్‌వేర్ అండ్ సర్వీస్ కంపెనీస్ (నాస్కామ్)కు ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ ఆహ్వానం పలికారు. కేబినెట్ నిర్ణయంపై నాస్కామ్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. కొత్త ఆంక్షల వల్ల ఐటీ కంపెనీలు వేరే ప్రాంతాలకు మార్చుకోవాల్సిన పరిస్థితి తలెత్తుతుందని, ఇది స్థానిక ప్రతిభావంతులను ఇబ్బంది పెడుతుందని ఓ ట్వీట్‌లో ఆందోళన వ్యక్తం చేసింది. దీనిపై స్పందించిన మంత్రి లోకేశ్... 'మీ అసంతృప్తిని అర్థం చేసుకుంటున్నాం. మీ కంపెనీలను విస్తరించాలన్నా, మార్చుకోవాలనుకున్నా (రీలొకేట్) మా విశాఖపట్నంలోని ఐటీ, మిగతా 2లో..





## సర్వం భూకబ్జాలే !

**అమరావతి :** "ఐదేళ్ల పాలనలో వైసీపీ నేతలు లాండ్, శాండ్, మైన్, వైన్, గంజాయిలతో దోచుకోవడం, దాచుకోవడం తప్ప చేసిందేమీ లేదు. ఎక్కడ చూసినా నాడు వారు సాగించిన భూ దందాలు, గంజాయి గొడవలే కనిపిస్తున్నాయి. నాకు అందిన ఫిర్యాదులన్నీ అవే." అని బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్. సవిత అన్నారు. ఆమె బుధవారం తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయనికి వచ్చారు. ప్రజలు, పార్టీ కార్యకర్తల నుంచి వినతులు స్వీకరించారు. వాటిపై తక్షణ స్పందన చూపించారు. వినతుల స్వీకరణ కోసం ఆమె పార్టీ కార్యాలయంలో 4గంటలపాటు కూర్చున్నారు. అప్పటికప్పుడు అధికారులతో మాట్లాడారు. అనంతపురం జిల్లా పెనుగొండ నియోజకవర్గం నుంచి మొదటిసారి ఎమ్మెల్యేగా గెలిచిన సవిత వెంటనే మంత్రి పదవి కూడా పొందారు. ఎమ్మెల్యేగా, మంత్రిగా తొలిసారే అయినా ఆమె వినతుల స్వీకరణలో పరిణితిని, వేగాన్ని ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ఆమెకు మొత్తం నూటా ఏభై రెండు వినతులు అందాయి. కొందరు మిగతా 2లో..

## పేరు మారినా ముద్రగడ.. ముద్రగడే



**కాకినాడ, విశ్వంవాయిస్ న్యూస్ :** ముద్రగడ పద్మనాభ రెడ్డిగా పేరు మారినా.. ముద్రగడ ముద్రగడేనని మాజీ మంత్రి అంబటి రాంబాబు స్పష్టం చేశారు. బుధవారం ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని కిర్లంపూడిలో ముద్రగడ పద్మనాభరెడ్డి నివాసంలో ఆయనతో మాజీ మంత్రి అంబటి రాంబాబు భేటీ అయ్యారు. అనంతరం అంబటి రాంబాబు మాట్లాడుతూ.. ముద్రగడ లాంటి నాయకులు రాజకీయాల్లో అరుదుగా ఉంటారన్నారు. కాపుల కోసం.. కాపు రిజర్వేషన్ల కోసం ఉద్యమాన్ని నడిపి వ్యక్తి ముద్రగడ పద్మనాభమని గుర్తు చేశారు. రాజకీయాల్లో నష్టపోయినా.. ఏనాడు కులాన్ని మాత్రం ఉపయోగించుకోలేదని పేర్కొన్నారు. ప్రత్యర్థుల సవాల్‌ను స్వీకరించి తన పేరు మార్చుకున్న వ్యక్తి మిగతా 2లో..

## లోటస్ పాండ్‌కి జగన్ దూరం ?



**తాడేపల్లి :** జగన్ రాజకీయానికి అచ్చి వచ్చింది లోటస్ పాండ్. జగన్ వైఎస్సార్ మరణానంతరం రాజకీయం నెరిపింది పార్టీ పెట్టి గెలిచింది కాంగ్రెస్ మీద తొడ కొట్టింది ఏపీలో బలమైన నేత ఎదిగింది అన్నీ లోటస్ పాండ్ నుంచే. జగన్ కేరాఫ్ లోటస్ పాండ్ అన్నట్లుగా 2019 దాకా పాలిటిక్స్ సాగింది. ఇక జగన్ 2019 ఎన్నికలకు ముందు గుంటూరు జిల్లా తాడేపల్లిలో ఒక ప్యాలెస్ ని కట్టించుకుని అందులోకి తన మకాం మార్చారు. ఏపీ సీఎం గా అయిదేళ్ల పాటు ఆయన అక్కడే ఉన్నారు. ఆ మధ్యలో ఆయన లోటస్‌పాండ్‌కి వెళ్ళింది లేదు. అయితే జగన్ సీఎం కాబట్టి ఎవరూ పెద్దగా పట్టించుకున్నది లేదు. జగన్ సైతం ఏపీ గడప దాటి పోకుండా అంతా చేసుకుని వచ్చారు. ఇక మిగతా 2లో..

## ఎర్రమట్టి దిబ్బల్లో తవ్వకాలకు బ్రేక్

**విశాఖపట్నం, విశ్వంవాయిస్ న్యూస్** భీమిలి బీచ్‌రోడ్డులోని భౌగోళిక వారసత్వ సంపదైన ఎర్రమట్టి దిబ్బలను తవ్వేయడంపై 'ఎర్రమట్టి దిబ్బలకు ఎసరు'శీర్షికన బుధవారం 'ఆంధ్రజ్యోతి' ప్రచురించిన కథనంపై ముఖ్యమంత్రి కార్యాలయం స్పందించింది. తక్షణమే ఆ ప్రాంతాన్ని సందర్శించి, పర్యావరణానికి విఘాతం కలిగించే పనులు ఆపించాలని అధికారులను ఆదేశించింది. ఈ వ్యవహారంపై పూర్తిస్థాయి నివేదిక పంపాలని కోరింది. దీంతో జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ భీమిలి వెళ్లి ఎర్రమట్టి దిబ్బలలో తవ్వకాలు జరుగుతున్న ప్రాంతాలను పరిశీలించారు. పనులు ఆపించారు. ఇద్దరికి నోటీసులు ఇచ్చి, ఒకరి సస్పెన్షన్‌కు అక్కడికక్కడే ఆదేశాలు జారీచేశారు. అక్కడికి వచ్చిన భీమిలి తహసీల్దార్, జీవీఎంసీ జోనల్ కమిషనర్లపై మయూర్ అశోక్ ప్రశ్నల వర్షం కురిపించారు. వంద ఎకరాలకుపైగా విస్తీర్ణంలో మట్టి కొండలను తవ్వేస్తుంటే ఎందుకు సమాచారం ఇవ్వలేదని నిలదీశారు. ఈ భూమి తమదిగా చెప్పుకొంటున్న భీమిలి కో-ఆపరేటివ్ బిల్డింగ్ సొసైటీకి మట్టి తవ్వకాల మిగతా 2లో..



(మొదటిపేజీ తరువాయి)

## ప్రజలకు మన కష్టం తెలియాలి

చెబుతున్నారు. కేంద్ర పథకాల్లో కొన్నింటిని వాడుకోవడానికి మనం నలభై శాతం వాటా భరించాలి. అప్పుడు కేంద్రం వాటా కింద అరవై శాతం వస్తాయి. ఆ నలభై శాతం భరించాలన్నా మన ఆర్థిక పరిస్థితి భారంగానే ఉంది. అయినా ఏం చేయగలమో చూద్దాం. బడ్జెట్‌లో పోలవరం, అమరావతికి కొంత మేర కేటాయింపులు ఉండే అవకాశం ఉంది. ఏ ప?థకం కింద నిధులు అడిగినా గతంలో (వైసీపీ ప్రభుత్వం) ఇచ్చిన నిధుల ఖర్చు వివరాలను కేంద్రంలోని అధికారులు అడుగుతున్నారు. వైసీపీ ప్రభుత్వం కేంద్రం ఇచ్చిన నిధులను ఇష్టానుసారం దారి మళ్లించి ఖర్చు చేసింది. దారి మళ్లింపునకు కేంద్రం నిబంధనలు అంగీకరించవు. దీనివల్ల అనేక ప?థకాలకు కొత్తగా నిధులు వచ్చే అవకాశం లేకుండా పోయింది. రుణాలు తీసుకోవడానికి అవకాశం ఉన్నంత మేరా నాడు వైసీపీ ప్రభుత్వం చేసేసింది. వాటిని ఏం చేశారో కూడా అర్థం కావడం లేదు. కొత్తగా రుణాలు తీసుకోవడానికి నిబంధనలు సడలించాలని కోరాం. సడలింపు లభిస్తుందని ఆశిస్తున్నాం" అని ఆయన వారికి చెప్పారు. ఏ కేంద్ర మంత్రిత్వ శాఖలోని ప?థకాల నుంచి రాష్ట్రానికి అధిక నిధులు రాబట్టవచ్చో ఎంపీలు కొంత కసరత్తు చేయాలని చంద్రబాబు సూచించారు. కొద్దిరోజుల్లో రాష్ట్రంలో మంత్రులు, శాఖల ముఖ్య కార్యదర్శులు, ఎంపీలతో ఒక సంయుక్త సమావేశాన్ని నిర్వహిస్తానని, కేంద్రంలో ఉన్న ప?థకాల పరిధిలో నిధులు రాబట్టుకోవడానికి ఎక్కడ అవకాశం ఉందో విపులంగా చర్చిస్తామని వారికి చెప్పారు. బిహార్‌కు ప్రత్యేక ప్యాకేజిని కేంద్రం ఇవ్వబోతోందన్న ప్రచారాన్ని ఆయన తోసిపుచ్చారు. 'అటువంటి అవకాశాలు లేవు. ఏ రాష్ట్రానికీ ప్రత్యేకంగా ప్యాకేజిని ఇవ్వరు. గతంలో కొన్ని ఈశాన్య రాష్ట్రాలకు ఇచ్చేవారు. ఇప్పుడు అది కూడా నిలిపివేశారు. విభజన చట్టం కింద ఇచ్చిన హామీల పరిధిలో మనకు కొంత అదనంగా రావడానికి అవకాశం ఉంది. దానికోసమే ప్రయత్నం చేస్తున్నాం" అని వారితో చంద్రబాబు అన్నారు. "కొత్త ప్రభుత్వం రాగానే కొన్ని సమస్యలు పరిష్కారం కావాలని ప్రజలు ఆత్రుత పడతారు. మనం ఎన్ని సమస్యల్లో కూరుకుపోయి ఉన్నామో వారికి తెలిస్తే మన కష్టం విలువ తెలుస్తుంది. అవసరం అయిన చోట మనం ఉన్న పరిస్థితిని ప్రజలకు వివరించండి. దానిని మార్చడానికి ఎంత ప్రయత్నిస్తున్నామో కూడా చెప్పండి"

టీడీపీ ఎంపీలతో చంద్రబాబు

ఏజెంట్ల చేతిలో మోసపోయి గల్ఫ్‌లో చిక్కుకున్న తెలుగు కార్మికుడు శివ చివరకు మంత్రి లోకేశ్ చొరవతో స్వస్థలానికి చేరుకున్నారు. సోషల్ మీడియాలో వచ్చిన వీడియోను చూసి స్పందించిన లోకేశ్‌పై ఈ సందర్భంగా నెటిజన్లు ప్రశంసల జల్లు కురిపిస్తున్నారు. లోకేశ్ పనితీరును నేటి తరం నాయకులు ఆదర్శంగా తీసుకోవాలని ఓ నెటిజన్ అభిప్రాయపడ్డారు. 'కష్టాల్లో ఉన్న ప్రజల కోసం ఎంతవరకైనా వెళ్లి ఆపన్నహస్తం అందించే మీ కమిట్‌మెంట్‌కు హ్యాట్సాఫ్' అంటూ బాలాజీ గుప్తా అనే నెటిజన్ లోకేశ్‌ను అభినందించారు.

## జనసేన సంగతేంటి ?

రాజ్యసభ ఎంపీల నుంచి ఎమ్మెల్సీల నుంచి కీలక నేతల దాకా వైసీపీ నుంచి టీడీపీలో చేరుతారు అని అంటున్నారు. టీడీపీ వరకూ ఇది బాగానే ఉంది. టీడీపీ ఒక రాజకీయ పార్టీ కాబట్టి చేరికలను ఎవరూ తప్పుపట్టరు. అధికారంలో ఉన్నపుడు బలోపేతం కావాల్సిందే. మరి జనసేన బీజేపీల సంగతేంటి అన్న ప్రశ్నలు వస్తున్నాయి. పవన్ కళ్యాణ్ ఉప ముఖ్యమంత్రిగా ఉన్నారు 21 అసెంబ్లీ సీట్లు రెండు ఎంపీ సీట్లు గెలుచుకున్నారు. ఆయా చోట్ల జనసేనకు కొత్త నాయకత్వం అక్కరలేదు. అదే విధంగా పార్టీ గోదావరి జిల్లాలతో పాటు ఉత్తరాంధ్రాలో కొన్ని చోట్ల బలంగా ఉంది. అయితే వీక్ గా ఉన్న చోట పటిష్టం కావాల్సిందే. మరి ఆ పార్టీ దీనికి ఏమి చేస్తుంది అన్న ప్రశ్నలు వస్తున్నాయి.

## వైసీపీ అక్రమాలు తెలిపేందుకే శ్వేతపత్రాలు

అరసవల్లి: గత వైసీపీ పాలనలో జరిగిన అక్రమాలు ప్రజలకు తెలియ జేసేందుకే ముఖ్యమంత్రి చంద్రాబాబు శ్వేతపత్రాలు విడుదల చేస్తున్నారని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. బుధవారం విశాఖ-ఏ కాలనీలోని తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో దాదాపు 1.75 లక్షల ఎకరాల భూ ఆక్రమణలు జరిగాయని, దోపిడీలు నిత్యకృత్యంగా మారా యన్నారు. ఇంతటి ప్రమాదకరమైన పరిపాలనను దేశం ఎప్పుడూ చవిచూడ లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో జరిగిన అక్రమాలు, దోపిడీలపై ప్రజలకు వాస్తవాలు తెలియజెప్పాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉన్నం దునే ఆధారాలతో సహా శ్వేతపత్రాలు విడుదల చేస్తున్నామని తెలిపారు. వైసీపీ కార్యాలయాల కోసం రూ.300 కోట్ల విలువైన భూములను నామమాత్రపు రుసుం తో 33 ఏళ్లు లీజుకు కేటాయించడం దారుణమన్నారు.

ప్రతీ ఎకరాకు సాగునీరందిస్తాం

శ్రీకాకుళం రూరల్/గార: నియోజకవర్గం లో ప్రతీఎకరాకు సాగునీరందిం చడమే లక్ష్యంగా పని చేస్తున్నా మని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. రూరల్, గార మండలాల్లో అయ్యావారిపేట నుం చి శ్రీకూర్మం, దల్లం వరకు వంశధార కాలువల్లో చేపట్టిన పనులను శంకర్ బుధ వారం పరిశీలించారు. శివారు భూములకు సైతం సాగునీరు అందించడమే ప్రభు త్వ లక్ష్యమన్నారు. అలాగే గొంటి పంచాయితీ లంకపేటలో శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించా రు. అనంతరం పీఠాధిపతి వరసిద్ధి ప్రసాద్ గురూజీ ఆశీర్వాదం తీసుకున్నారు.

విద్యార్థుల అభ్యున్నతికి కృషి చేయండి

ఆమదాలవలస: నియోజకవర్గంలోని వెనుకబడిన తరగతుల వసతిగృహాల్లో ఉంటున్న విద్యార్థులు అభ్యున్నతికి వార్డెన్లు అంకితభావంతో కృషి చేయాలని ఎ మ్మెల్యే కూన రవికుమార్ సూచించారు. బుధవారం శ్రీకాకుళంలో ఆమదాలవలస నియోజకవర్గంలోని బీసీ హాస్టల్స్ వార్డెన్లతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా వసతిగృహాల్లో ఉన్న విద్యార్థుల వివరాలు, ప్రస్తుతం చేరుతున్న విద్యార్థుల వివ రాలు అడిగి తెలుసుకున్నారు. ఆమదాలవలస రెండు, పొందూరు రెండు, కింతలి, లోలుగు, బూర్జ మండలం తోటవాడ గ్రామాల్లో ఉన్న వెనుకబడిన తరగతుల వస తిగృహ అడ్మిషన్లపై సమగ్ర నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. వసతిగృహ భవనా లు, వసతులపై ఆరా తీశారు. హాస్టల్స్‌లో పూర్తి స్థాయి వసతుల కల్పనకు విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

వైసీపీ దోపిడీ ప్రజలంతా తెలుసుకోవాలి

కవిటి: గత వైసీపీ పాల కుల దోపిడీని ప్రతీ ఒక్కరూ తెలుసుకోవా లని ఇచ్ఛా పురం ఎమ్మెల్యే బెందాళం అశోక్ కోరారు. రామయ్యపుట్టుగలోని తన స్వగృహం వ ద్ద బుధవారం విలేకరులతో మాట్లాడారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్రం లో సహజవనరుల దోపిడీ ఎలా జరిగిం దో వివరించారు. ప్రస్తుత కూటమి ప్రభు త్వం శ్వేతపత్రాలు విడుదల చేసి గత పాలకుల దోపిడీని బయట పెడుతున్నట్టు తెలిపారు. భూ అక్రమణలు, ఇసుక దందా, ఇళ్లపట్టాలు పేరిట భారీగా దోచుకు న్నారని దుయ్యబట్టారు. పేదలకు ఇళ్ల స్థలాల పేరుతో భారీగా దోచుకున్నారని ఆరోపించారు. అలాగే రామయ్యపుట్టుగ లోని తన స్వగృహం వద్ద బుధవారం నియోజకవర్గ వార్డెన్లతో సమావేశాన్ని నిర్వ హించారు. కూటమి ప్రభుత్వం వసతి గృహాలపై ప్రత్యేక శ్రద్ధ చూపిస్తుందన్నారు. ఏబీసీ రఘు, వార్డెన్లు పాల్గొన్నారు.

రైల్వేశాఖ నుంచి భూములు కాపాడాలి

సోంపేట: కొర్లాం పంచాయతీ పరిధిలో రైల్వేస్టేషన్ పరిధిలో ఉన్న రైతుల భూములను కాపాడాలంటూ ఎమ్మెల్యే బెందాళం అశోక్‌కు ఆ గ్రామ రైతులు బుధవారం వినతి పత్రం అందించారు. స్థానిక రైల్వేస్టేషన్ సమీపంలో ప్రహరీ ని ర్మాణంతో తమ భూములు కోల్పోతున్నామని ఎమ్మెల్యేకి వివరించారు. సంబంధిత అధికారులతో మాట్లాడి తమ భూములను కాపాడాలని కోరారు. రాంబుడ్డి గణపతి, రాంబుడ్డి జానకిరావు, చందుకు తదితరులు ఉన్నారు.

జనసేన రాయలసీమ తో పాటు క్రిష్ణా గుంటూరు ప్రాంతాలలో మరింతగా బలోపేతం కావాల్సి ఉంది. అయితే వైసీపీ నేతలు అంతా టీడీపీ వైపు చూస్తున్నారు అని వార్తలు వస్తున్నాయి తప్ప జనసేన వైపు ఎవరూ వెళ్ళడం లేదు. మరి వద్దు అని జనసేన అనుకుంటోందా లేక వారే టీడీపీ బెస్ట్ అని అటు వైపు వెళ్తున్నారా అన్న చర్చ వస్తోంది. జనసేనకు నిజంగా ఇదే బెటర్ టైం అని అంటున్నారు. పార్టీ అధికారంలో ఉంది. మంత్రి పదవులు దక్కాయి. ఇపుడు కనుక రాష్ట్రవ్యాప్తంగా గట్టిగా ఫోకస్ పెట్టి బలపడితే 2029 నాటికి పొత్తులు ఎలా ఉన్నా జనసేనకు రాజకీయంగా సొంత నిర్ణయాలు తీసుకోవడానికి అవకాశం ఉంటుంది అని అంటున్నారు. మరో వైపు చూస్తే 2014లో పార్టీని స్థాపించినా కూడా గత పదేళ్ళుగా పార్టీని పవన్ పెద్దగా పటిష్టం చేసినది లేదు అని అంటారు. అయితే ఆనాడు జనసేన విపక్షంలో ఉంది కాబట్టి అవకాశం కుదరలేదు అని అనుకోవచ్చు. కానీ ఇపుడు అధికారంలో ఉన్నారు కాబట్టి చేయవచ్చు కదా అని అంటున్నారు. జనసేన సంస్థాగత నిర్మాణం మీద దృష్టి పెట్టినట్లుగా ఉంది. సభ్యత్వ నమోదు చేయిస్తోంది. అయితే బలమైన నాయకులు మచ్చ లేని వారు ఇతర పార్టీల నుంచి వస్తే వారిని చేర్చుకోవడంలో తప్పు లేదు అని అంటున్నారు. ముఖ్యంగా రాయలసీమలో వైసీపీ నేతలు చాలా మంది రాజకీయంగా ఆల్టర్నేషన్ కోసం చూస్తున్నారు. వారికి టీడీపీలోకి వెళ్ళడం అంటే ఇబ్బందే. అలాంటపుడు వారిని తమ వైపు తిప్పుకుంటే అక్కడ పార్టీకి సీమలో దూసుకుని పోయేందుకు అవకాశం ఉంటుందని అంటున్నారు. బలిజలు ఎటూ పెద్ద సంఖ్యలో అక్కడ ఉన్నారు కాబట్టి జనసేన రాజకీయానికి అనుకూలిస్తుంది అని అంటున్నారు. అయితే ఏపీలో మాత్రం కండువాలు కప్పేందుకు టీడీపీయే సిద్ధంగా ఉంది. ఎవరు చేరినా టీడీపీలోకే అంటున్నారు. మరి జనసేన బీజేపీ ఈ విషయంలో తొందర పడాల్సి ఉంది అని అంటున్నారు. రాజకీయాల్లో టైమింగ్ చాలా ముఖ్యమని అది కనుక లేకపోతే చిక్కుల్లో పడడం ఖాయమని అంటున్నారు.

## కొంప ముంచింది

పెట్టుకుంది. తమదే నిజమైన ఎన్‌సీపీగా అజిత్ పవార్ వర్గం క్లెయిమ్ చేయడంతో గత ఫిబ్రవరిలో ఎన్నికల కమిషన్ కూడా అజిత్ వర్గానిదే నిజమైన ఎన్‌సీపీగా గుర్తించింది. అనంతరం వచ్చిన లోక్‌సభ ఎన్నికల్లో ఎన్సీపీ, ఏక్‌నాథ్ షిండే సారథ్యంలోని శివసేనతో బీజేపీ పొత్తు పెట్టుకుంది. ఎన్‌సీపీ కేవలం ఒకే సీటు గెలుచుకోగా, షిండే శివసేన 7 సీట్లు దక్కించుకుంది. విపక్ష మహా వికాస్ అఘాడి (ఎంవీఏ) 30 సీట్లతో అధిపత్యం చాటుకుంది. కూటమిలోని కాంగ్రెస్ 13, శివసేన (యూబీటీ) తొమ్మిది, ఎన్‌సీపీ (ఎస్‌పీ) 7 సీట్లు గెలుచుకున్నాయి. కాగా, ఎన్సీపీతో బీజేపీ పొత్తు పెట్టుకోవడంతో బీజేపీకి వ్యతిరేకంగా సెంటిమెంట్ బలపడిందని, ఎన్సీపీ కారణంగా రాజకీయ లెక్కలు తలకిందులైతే బీజేపీ పరిస్థితి ఏమిటనే ప్రశ్న తలెత్తిందని 'వివేక్' వీక్లీ విశ్లేషించింది. ఇతర పార్టీల నేతను చేర్చుకోవడం ద్వారా సొంత సంస్థలో ప్రతిభకు పట్టం కట్టే సంప్రదాయానికి బీజేపీ పక్కనపెట్టడం ఆందోళనకరమని తెలిపింది. బీజేపీ కార్యకర్తలకు విధాన నిర్ణయాలు తీసుకునే ప్రక్రియలో భాగస్వామ్యం కల్పించడం వల్లే ఇటీవల జరిగిన మధ్యప్రదేశ్ ఎన్నికల్లో ఆ పార్టీ 29 లోక్‌సభ స్థానాలు గెలుచుకున్న వైనాన్ని ఉదహరించింది.

## ముద్రగడ.. ముద్రగడే

ముద్రగడ అని ఆయన గుర్తు చేశారు. అందుకే ఆయన్ని అభినందించేందుకు తాను కిర్లంపూడి వచ్చినట్లు మాజీ మంత్రి వివరించారు. అలాగే ముద్రగడకు తనకు ఉన్న అనుబంధాన్ని ఈ సందర్భంగా అంబటి రాంబాబు వివరించారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో పిఠాపురం నుంచి ఎమ్మెల్యేగా జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ గెలిస్తే.. తన పేరు మార్చుకుంటానని ఎన్నికల ప్రచార వేళ ముద్రగడ పద్మనాభం ప్రకటించారు. అయితే ఆ ఎన్నికల్లో పిఠాపురం ప్రజలు పవన్ కల్యాణ్‌కు ఓటు వేసి గెలిపించారు. ఈ నేపథ్యంలో ప్రకటన ప్రకారం పేరు మార్చుకోవాలంటూ ముద్రగడపై సోషల్ మీడియాలో ఒత్తిడి పెరిగింది. దాంతో ఆయన అన్నట్లుగానే తన పేరును మార్చుకున్నారు. మరోవైపు పిఠాపురంలో పవన్ కల్యాణ్ ఓటమి కోసం ప్రత్యర్థి పార్టీ వైసీపీ తీవ్రంగా ప్రయత్నించింది. ఆ క్రమంలో ఆ నియోజకవర్గం నుంచి ఆ పార్టీ అభ్యర్థిగా వంగా గీతను బరిలో నిలిపింది. అంతేకాదు.. నాటి సీఎం వైయస్ జగన్ సైతం.. తన ఎన్నికల ప్రచారం చివరి రోజు పిఠాపురంలోనే నిర్వహించిన విషయం విదితమే.

## పరిశ్రమలు మూత పడుతున్నాయి

నేపథ్యంలో సిలికా శాండ్ సరఫరా పూర్తిగా నిలిపివేశారని సీఎం దృష్టికి మేయప్పన్ తీసుకొచ్చారు. వెంటనే సిలికా శాండ్ సరఫరా పునర్దుద్ధరించాలని సీఎం చంద్రబాబుకు విజ్ఞప్తి చేశారు. కాగా.. ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు ఢిల్లీ పర్యటన ముగిసింది. నిన్న సాయంత్రం ఆయన ఢిల్లీకి వెళ్లారు. రాత్రి కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో భేటీ అయ్యారు. ఇక ఇవాళ ఉదయం సీఎం అధికారిక నివాసం(1, జన్‌పథ్)లో పూజలు నిర్వహించారు. అనంతరం విజయవాడకు చంద్రబాబు తిరుగు ప్రయాణమయ్యారు. ఏపీ ఆర్థిక పరిస్థితి గురించి అమిత్ షాకు చంద్రబాబు వివరించారు. గత ఐదేళ్లలో రాష్ట్రం ఆర్థిక విధ్వంసానికి గురైందని వెల్లడించారు. అస్తవ్యస్థ నిర్వహణ, అవినీతి కారణంగా ఏపీ ఆర్థిక వ్యవస్థ గాడి తప్పిందని చంద్రబాబు తెలిపారు. 2019-24 ఆర్థిక సంవత్సరాల మధ్య మన రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అదుపు తప్పి, అస్థిరమైన అప్పులను వివరిస్తూ విడుదల చేసిన నాలుగు శ్వేతపత్రాలను అమిత్ షాకు వివరించానని చంద్రబాబు తెలిపారు. ప్రజలు ఏపీలో ఎన్డీఏకు అనుకూలంగా తీర్పునిచ్చారని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి రాష్ట్రాన్ని గాడిలో పెడతాయని చంద్రబాబు ట్వీట్ చేశారు. పర్యటనలో సీఎంతో పాటు రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, కేంద్ర మంత్రులు కే. రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, ఎంపీలు లావు శ్రీకృష్ణ దేవరాయలు, కేశినేని చిన్ని తదితరులు ఉన్నారు.

## ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్

ఇన్ఫర్మేషన్‌తో ఈ రోజు ఉదయం 10 గంటల నుంచి పోలీసులు గాలింపు చర్యలను ప్రారంభించారు. గడ్చిరోలి: పోలీసులు- మావోయిస్టుల మధ్య మహారాష్ట్రలో భీకర్ ఎన్‌కౌంటర్ జరిగింది. గడ్చిరోలి వందొలి గ్రామంలో 15 మంది మావోయిస్టులు ఉన్నారని పోలీసులకు సమాచారం వచ్చింది. వందొలి గ్రామం ఛత్తీస్ గఢ్ సరిహద్దులకు దగ్గరగా ఉంటుంది. ఇక్కడ మావోయిస్టులు తలదాచుకున్నారనే పక్కా ఇన్ఫర్మేషన్‌తో ఈ రోజు ఉదయం 10 గంటల నుంచి పోలీసులు గాలింపు చర్యలను ప్రారంభించారు. సీ 60 ఏడు పార్టీలతో డిప్యూటీ ఎస్పీ రంగంలోకి దిగారు. మావోయిస్టుల కోసం జల్లెడ పడుతుండగా వారు తారస పడ్డారు. దీంతో పోలీసులు- మావోయిస్టుల మధ్య ఎదురు కాల్పులు మొదలయ్యాయి. దాదాపు 6 గంటల పాటు ఏకధాటిగా ఫైరింగ్ జరిగింది. పోలీసుల కాల్పుల్లో 12 మంది మావోయిస్టులు మృతిచెందారు. మరికొందరు గాయపడ్డారు. మావోయిస్టుల కాల్పులు జరపడంతో సీ 60కి చెందిన ఎస్సై గాయపడ్డారు. అతనిని మెరుగైన వైద్యం కోసం నాగ్ పూర్ తరలించారు. ప్రాణపాయం తప్పిందని పోలీసు అధికారులు వివరించారు. పోలీసుల కాల్పుల్లో తిపగడ్ దళం ఇంచార్జీ డీవీసీఎం లక్ష్మణ్ ఆత్రం అలియాస్ విశాల్ ఆత్రం మృతిచెందాడు. మిగతా 11 మంది మావోయిస్టులను గుర్తించాల్సి ఉంది. ఘటనా స్థలంలో ఏడు ఆటోమెటిక్ ఆయుధాలు, 3 ఏకే 47 తుపాకులు, 2 ఇన్సాస్, ఒక కార్బన్, ఎస్ఎల్ఆర్ స్వాధీనం చేసుకున్నారు.

## మా రాష్ట్రానికి రండి

ఏఐ, డేటా సెంటర్ క్లస్టర్‌కు ఆహ్వానం పలుకుతున్నాం. మీకు అత్యుత్తమ సౌకర్యాలు, నిరంతరాయంగా విద్యుత్ సరఫరా, మౌలిక సదుపాయాలు కల్పిస్తాం. అలాగే మీ అవసరాలకు తగిన నిపుణులైన మానవ వనరులు ఇక్కడ ఉన్నాయి. ప్రభుత్వం వైపు నుంచి ఎలాంటి ఆంక్షలు ఉండవు. ఆంధ్రప్రదేశ్ మిమ్మల్ని ఆహ్వానించేందుకు సిద్ధంగా ఉంది' అని రీట్వీట్ చేశారు.

## లోటస్ పాండ్‌కి జగన్ దూరం ?

జగన్ తాజాగా జరిగిన ఎన్నికల్లో పార్టీ ఓడడంతో మాజీ సీఎం అయ్యారు. జగన్ తిరిగి లోటస్ పాండ్ కే వెళ్తారు అని అంతా అనుకున్నారు. కానీ జగన్ ఓడాక అడుగు పెట్టనిది అక్కడికే. జగన్ హైదరాబాద్ కూడా వెళ్లలేదు. జగన్ ఎన్నికలు ముగిసాక యూకే టూర్ ప్లాన్ చేశారు. అక్కడ నుంచి వచ్చారు. రిజల్ట్స్ తరువాత జగన్ విశ్రాంతి కోసం అని పులివెందుల మీదుగా బెంగళూరు వెళ్లారు. ఇపుడు సెకండ్ టైం ఆయన అక్కడికే వెళ్లారు. జగన్ హైదరాబాద్ వైపు చూడడం లేదు. అంతే కాదు తనకు పొలిటికల్ గా కలసి వచ్చిన లోటస్ పాండ్ ని కూడా కన్నెత్తి చూడడంలేదు. దానికి కారణాలు ఏంటి అని చూస్తే లోటస్ పాండ్ అన్నది వైఎస్సార్ హయాంలో నిర్మించినది అని అంటున్నారు. అది ఉమ్మడి ఆస్తిగా ఉంది. అందుకే అక్కడ షర్మిల ఉంటోంది. ఆమె జగన్ తాడేపల్లి షిఫ్ట్ అయిన దగ్గర నుంచి

## నడిరోడ్డుపై నరికేశాడు

**వినుకొండటౌన్ :** ఇద్దరూ మిత్రులే... మరో పేరుమోసిన రౌడీకి ప్రధాన అనుచరులే. రాజకీయ పార్టీ వైసీపీతో అంటకాగిన వారే. ఎన్నికల ముందు ఇద్దరి మధ్య తీవ్ర అభిప్రాయభేదాలు పొడసూపాయి. ఆ గొడవులు చివరికి బుధవారం రాత్రి నడిరోడ్డుపై, అందరూ చూస్తుండగా కత్తులతో నరుక్కునే వరకూ వెళ్లాయి. దాడిని అడ్డుకోవడానికి ఒక్కరంటే ఒక్కరుకూడా ముందుకురాలేదు. చేయి తెగి, రక్తం మడుగులో పడిపోయిన తరువాత దాడికి తెగబడిన వ్యక్తి అక్కడ నుంచి వెళ్లిపోయాడు. ఆ వెంటనే స్థానికుల్లో కదలిక వచ్చింది. హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే ఆ యువకుడు మృతి చెందాడు. బుధవారం రాత్రి పల్నాడు జిల్లా వినుకొండ పట్టణంలోని ముండ్లమూరు బస్టాండ్ వద్ద ఈ ఘటన చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... హతుడు షేక్ రషీద్(25) ముండ్లమూరు బస్టాండ్ సమీపంలోని ప్రభుత్వ మద్యం దుకాణం నుంచి బయటకు వస్తున్నాడు. అదే సమయంలో హతుని మాజీ మిత్రుడు, పట్టణానికి చెందిన షేక్ జిలానీ కత్తితో రషీద్‌పై విచక్షణారహితంగా దాడి చేశాడు. చేతులు, తల, మెడపై కత్తితో కొట్టాడు. రషీద్ చెయ్యి తెగి రోడ్డుపై పడిపోయింది. తీవ్రంగా గాయపడిన రషీద్‌ను స్థానికులు ఓ ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. నిందితుడు పోలీసులు అదుపులో ఉన్నట్లు సమాచారం. ఈ ఘటనలో హతుడు రషీద్, హత్యకు పాల్పడిన జిలానీ... ఇరువురూ వైసీపీకి చెందిన వారే. రెండేళ్ల క్రితం విభేదాలతో విడిపోయారు. వీరిద్దరూ వినుకొండలో రౌడీగా చెలామణి అవుతున్న పీఎస్ ఖాన్‌కు ప్రధాన అనుచరులని పోలీసులు తెలిపారు. ఎన్నికలకు ముందు జిలానీ ఇంటికి వెళ్లిన రషీద్ అతడి ద్విచక్ర వాహనాన్ని తగలబెట్టాడు. దీంతో కక్ష కట్టిన జిలానీ, రషీద్‌ను దారుణంగా హతమార్చాడు.

లోటస్ పాండ్ లో ఉంటోంది. ఆమె తన వైఎస్సార్టీపీ పార్టీని అక్కడే స్థాపించారు. రెండేళ్ల పాటు అక్కడే నడిపారు. ఇక ఆమె తన పార్టీని కాంగ్రెస్ లో విలీనం చేసి కాంగ్రెస్ కి ఏపీ ప్రెసిడెంట్ అయ్యారు. ఆమె హైదరాబాద్ లోని లోటస్ పాండ్ నుంచే తన మొత్తం రాజకీయాలను నిర్వహిస్తున్నారు. ఆమె పూర్తిగా లోటస్ పాండ్ ని తన ఆధీనంలోకి తెచ్చుకున్నారు అని అంటున్నారు. అందుకే జగన్ హైదరాబాద్ కానీ లోటస్ పాండ్ కానీ అసలు ఊసే తలవడం లేదు అని అంటున్నారు. అయితే బెంగళూరులో జగన్ ఏకంగా 27 ఎకరాలలో యెహలంక ప్యాలెస్ ని కట్టుకున్నారు. అది కట్టుకున్న తరువాత జగన్ పట్టుమని పది రోజులు కూడా ఉండలేదని అంటున్నారు. ఆయన ఎంపీ కావడం తండ్రి మరణం తరువాత రాజకీయంగా బిజీ కావడంతో ఎక్కడా గ్యాప్ రాలేదు. చివరికి ఏపీకి మాజీ సీఎం అయ్యాకనే జగన్ కి తీరుబాటు దొరికింది అని అంటున్నారు. అందుకే తాజాగా మరోసారి జగన్ బెంగళూరు వెళ్లారు అని అంటున్నారు. ఇదిలా ఉంటే జగన్ కి లోటస్ పాండ్ అచ్చి వచ్చింది. యెహలంక ప్యాలెస్ రాజకీయంగా కలసి వస్తుందా అన్న చర్చ కూడా ఉంది. అదే సమయంలో జగన్ లోటస్ పాండ్ లో ఇప్పట్లో అడుగు పెట్టరా అన్న చర్చ సైతం నడుస్తోంది. జగన్ ఉంటే తాడేపల్లి లేకపోతే యెహలంక వయా పులివెందుల అన్నట్లుగా 2024 ఎన్నికల తరువాత పాలిటిక్స్ మారింది. మరి లోటస్ పాండ్ లో జగన్ రాజకీయం దూకుడుగా సాగేది. ఎన్నో వ్యూహాలు అక్కడ నుంచే ఆయన రూపకల్పన చేశారు. మరో వైపు చూస్తే ఏపీకి చెందిన నేతలు అంతా హైదరాబాద్ చిరునామాగానే ఉంటున్నారు. ఒక్క జగన్ మాత్రం బెంగళూరు ని రాజకీయ విడిదిగా చేసుకున్నారు. ఆస్తి గొడవల వల్లనే షర్మిలకు జగన్ మధ్య విభేదాలు వచ్చాయని అంటున్నారు. ఇలాంటి సమయంలో షర్మిల ఉంటున్న లోటస్ పాండ్ ఉమ్మడి ఆస్తి అయినా జగన్ ఆ వైపు తొంగి చూడడానికి ఇష్టపడటం లేదని అంటున్నారు. సో లోటస్ పాండ్ జగన్ అని 2019 దాకా ప్రత్యర్థులు విమర్శలు చేశారు. ఇపుడు యెహలంక ప్యాలెస్ కి ముడిపెడతారేమో చూడాల్సి ఉంది.

## సర్వం భూకబ్జాలే !

లిఖితపూర్వకంగా తమ ఫిర్యాదులు సమర్పించగా కొందరు మౌఖికంగా మంత్రికి తమ గోడు విన్నవించుకొన్నారు. భూ సమస్యలు, పోలీస్ శాఖకు సంబంధించిన సమస్యలు వీటిలో ఎక్కువగా ఉన్నాయి. వైసీపీ ప్రభుత్వం హయాంలో తమ గోడును పోలీస్ అధికారులు పట్టించుకోలేదని, అక్రమ కేసులు పెట్టారని, తమపై దాడులు జరిగినా పోలీసుల నుంచి న్యాయం జరగలేదని ఎక్కువ ఫిర్యాదులు వచ్చాయి. తమ భూమి ఆక్రమణలకు గురైందని, తమ భూమిని ఆన్‌లైన్‌లో నమోదు చేయడం లేదని, రెవెన్యూ అధికారులు తమ సమస్య పట్టించుకోవడం లేదని కొందరు చెప్పారు. వారు ఏ ప్రాంతం నుంచి వచ్చారో మంత్రి అడిగి తెలుసుకొని అక్కడి పోలీస్, రెవెన్యూ అధికారులకు ఫోన్లు చేసి ఆ సమస్యను వివరించారు. ఆ సమస్యను పరిశీలించి పరిష్కరించి మళ్లీ తనకు తెలపాలని వారికి చెప్పారు. అధిక శాతం అధికారులు ఆ సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చారు. ఒక జిల్లా ఎస్పీతోపాటు కొందరు డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలు, ఎమ్మార్వోలు సహా సుమారు ఇరవై మంది అధికారులతో ఆమె మాట్లాడారు. కాకినాడ రూరల్ మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంత లక్ష్మి తమ ప్రాంతానికి చెందిన ఒక మహిళ సమస్యను తీసుకొని వచ్చారు. గంజాయికి అలవాటు పడిన వ్యక్తులు ఆ మహిళను వేధిస్తున్నారని, ఆ కుటుంబం ఈ సమస్యతో చాలా బాధపడుతోందని మాజీ ఎమ్మెల్యే చెప్పారు. మంత్రి సవిత వెంటనే హోం మంత్రి వంగలపూడి అనితకు ఫోన్ చేసి ఈ సమస్య గురించి చెప్పి అక్కడి పోలీస్ అధికారులకు తగిన ఆదేశాలు ఇవ్వాలని కోరారు. అనిత ఆ మేరకు హామీ ఇచ్చారు. తాడికొండ నియోజకవర్గం నుంచి వచ్చిన ఒక కార్యకర్త తనపై వైసీపీ ప్రభుత్వం హయాంలో అన్యాయంగా ఎస్సీ, ఎస్టీ చట్టం కింద అక్రమ కేసు మోపారని, దానిని తొలగించాలని విజ్ఞప్తి చేశారు. పార్టీ లీగల్ సెల్‌కు చెందిన న్యాయవాది రేవతిని మంత్రి పిలిపించి ఈ సమస్య పరిశీలించాలని కోరారు. ఆమె ఆ పత్రాలు పరిశీలించి దీనిపై తాము పనిచేస్తామని, అనేక మంది కార్యకర్తలు ఇదే సమస్యను ఎదుర్కొంటున్నారని... వీటికి పరిష్కారంపై చర్చిస్తున్నామని మంత్రికి చెప్పారు. మధ్యాహ్న భోజన విరామం తర్వాత కూడా మంత్రి కొంతసేపు ఉండి విజ్ఞప్తులు ఇచ్చేవారు ఎవరూ లేరని నిర్ధారించుకొన్న తర్వాత వెళ్లిపోయారు. తనకు వినతి పత్రాలు ఇచ్చిన వారందరి ఫోన్ నెంబర్లు తీసుకోవాలని తన సహాయకులను ఆమె ఆదేశించారు. ఎవరి సమస్య అయినా అపరిష్కృతంగా ఉంటే తాను మళ్లీ అధికారులతో మాట్లాడతానని ఆమె చెప్పారు. ఈ సందర్భంగా పార్టీ బీసీ విభాగం ప్రధాన కార్యదర్శి వీరంకి గురుమూర్తి ఆమెకు సహాయంగా పాల్గొన్నారు. పార్టీ కార్యాలయం నుంచి వెళ్ళిపోయే ముందు మీడియా ప్రతినిధులతో మంత్రి మాట్లాడారు. "రాష్ట్రాన్ని అంధకారంలోకి నెట్టిన వైసీపీ నేతలు మాట్లాడటానికి అనర్హులు. ప్రభుత్వం మారినా ఇప్పటికీ మా కార్యకర్తలపైనే దాడులు జరుగుతున్నాయి. కక్ష సాధింపు వద్దని మా నాయకుడు చెప్పడం వల్ల మేం సంయమనం పాటిస్తున్నాం. ప్రజల మన్ననలు పొందేలా మేం పనిచేస్తున్నాం" అని పేర్కొన్నారు. తెలుగుదేశం పార్టీ సాధికారిత కేంద్రంలో శిక్షణ పొందిన ముగ్గురు విద్యార్థులు గల్ఫ్‌లో ఉద్యోగాలు పొందారు. ఎలక్ట్రీషియన్ కోర్సులో ఉచిత శిక్షణ పొందడంతో పాటు టీడీపీ ఎంపవర్‌మెంట్ సహకారంతో ఉద్యోగాలు సాధించిన వీరికి మంత్రి సవిత టీడీపీ ప్రధాన కార్యాలయంలో బుధవారం జాబ్ ఆఫర్ లెటర్లు అందజేసి అభినందించారు. చంద్రబాబు పేరును నిలబెట్టాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ బ్రాహ్మణ సాధికారిత విభాగం రాష్ట్ర కోఆర్డినేటర్ బుచ్చిరాంప్రసాద్, బీసీ సంక్షేమ విభాగం కోఆర్డినేటర్ గురుమూర్తి, టీడీపీ ఎంపవర్‌మెంట్ సెంటర్ ట్రైనింగ్ కోఆర్డినేటర్ యామిని పాల్గొన్నారు.

## తవ్వకాలకు బ్రేక్

కోసం ఎవరు అనుమతులు ఇచ్చారని జేసీ ప్రశ్నించారు. దానికి సమాధానం చెప్పలేక అటు రెవెన్యూ, ఇటు జీవీఎంసీ అధికారులు తలలు దించుకున్నారు. అసలు లేఅవుట్‌కు దరఖాస్తు చేశారా? మట్టి తవ్వుతామని చెప్పారా?...అని కూడా జేసీ ప్రశ్నించారు. ఏ ప్రశ్నకూ స్థానిక అధికారుల నుంచి సమాధానం రాకపోవడంతో ఆయన అసహనం వ్యక్తంచేశారు. ప్రభుత్వం నుంచి తదుపరి ఆదేశాలు వచ్చేంతవరకు ఆ ప్రాంతంలోకి పొక్లెయినర్లు, లారీలు ప్రవేశిస్తే సీజ్ చేయాలని, పనులు జరిపించే వారిపై కేసులు పెట్టాలని ఆదేశించారు. సంజాయిషీ ఇవ్వాలంటూ నేరెళ్లవలస వీఆర్‌వోకు, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌కు భీమిలి ఆర్‌డీఓ ద్వారా నోటీసు ఇప్పించారు. తవ్వకాలపై నిర్లక్ష్యం వహించినట్టు తేలడంతో తోటవీధి సచివాలయం ప్లానింగ్ సెక్రటరీని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీచేశారు.

# ఎడిటర్ వాయిస్

## భద్రత లేని బతుకులు

నయా ఉదారవాద విధానాలు కార్మిక హక్కులపైనే కాదు, వారి భద్రతపైనా తీవ్ర దాడి చేస్తున్నాయి. నలుగురి ప్రాణాలను బలిగొని, ఇంకా అనేక మంది తీవ్ర గాయాల పాల్జేసిన అల్ట్రా టెక్ ప్రమాదమే ఇందుకు తాజా ఉదాహరణ. పార్లమెంటులో ఎలాంటి చర్చ లేకుండా మోడీ ప్రభుత్వం నిరుడు తీసుకొచ్చిన మూడు లేబర్ కోడ్‌లు కార్మికులకు ఉన్న అన్ని రక్షణలను తొలగించేశాయి. చివరికి వారి భద్రతను కూడా ప్రశ్నార్థకంగా మార్చేశాయి. ప్రైవేట్ రంగ పరిశ్రమలు అధిక లాభాల కోసం తక్కువ సిబ్బందితో ఎక్కువ గంటలు పనిచేయించడం, భద్రతా నిబంధనలను గాలికొదిలేసినా పట్టించుకునే నాథుడే లేకపోవడం వల్లే ఈ ప్రమాదాలు రోజు రోజుకీ పెరిగిపోతున్నాయి. ఫైనాన్స్ పెట్టుబడికి, బడా పెట్టుబడిదారులకు దాస్యం చేయడంపై ఉన్న శ్రద్ధ, కార్మికుల భద్రతపై పాలకులకు లేదని ఈ పారిశ్రామిక ప్రమాదాల పరంపర తెలియజేస్తోంది. ఎలాంటి రక్షణ చర్యలు, తనిఖీలు లేకపోవడంతో ఫార్మా, సిమెంట్, రసాయన పరిశ్రమల్లో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. అల్ట్రాటెక్ బాలాజీ సిమెంట్ ఫ్యాక్టరీలోని కిలన్ విభాగంలో లైమ్‌స్టోన్, ఐరన్ ఓర్, రెడ్ సాయిడ్‌ల మిశ్రమం లీకవుతోందని, రక్షణ చర్యలు చేపట్టాలని రెండు నెలలుగా కార్మికులు మొత్తుకుంటున్నా యాజమాన్యం పట్టించుకోలేదని కార్మిక సంఘాలు చెబుతున్నాయి. ప్రమాదం గురించి ముందస్తు హెచ్చరికలను సైతం యాజమాన్యం బేఖాతరు చేసిందంటే ఏమనుకోవాలి? బాయిలర్ పేలి, 1300 డిగ్రీల ఉష్ణాన్ని పుట్టించే కెమికల్ మిశ్రమం శరీరంపై పడి కార్మికులు పడుతున్న నరకయాతన మాటలకందనిది! తీవ్రంగా గాయపడిన 16 మందిలో ఇప్పటికే నలుగురు ప్రాణాలు కోల్పోయారు. మరో ఇద్దరు చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్నారు. ప్రమాదానికి గురైన కార్మికుల కుటుంబాలకు వెంటనే సమాచారం ఇవ్వడంలోనూ అదే నిర్లక్ష్యం. ఫ్యాక్టరీలో ప్రమాదం దగ్గర నుంచి తాళాలు వేసి యాజమాన్యం పరారయ్యే దాకా ఈ మొత్తం వ్యవహారంలో ప్రభుత్వం సరిగా వ్యవహరించలేదు. యాజమాన్యాన్ని విడిచిపెట్టి బాధితులపై తప్పుడు సెక్షన్లతో కేసులు పెడుతున్నారు. పారిశ్రామిక కేంద్రంగా పిలవబడే విశాఖ జిల్లాలోశా% గత ఐదేళ్లలో 119 ప్రమాదాల్లో 120 మంది కార్మికులు మరణించారు. 2022లోనే 20 మంది మరణించగా, 18 మంది క్షతగాత్రులై మంచంపట్టారు. అనకాపల్లి జిల్లాలో 2021-23 మధ్య 27 పారిశ్రామిక ప్రమాదాల్లో 28 మంది బలయ్యారు. పరవాడ ఫార్మాసిటీలోనే పదేళ్లలో 40 మంది మరణించగా, 152 మంది క్షతగాత్రులయ్యారు. 2020 నాటి ఎల్‌జి పాలిమర్స్ ప్రమాదం 12 మందిని బలిగొనగా, 600 మంది ఆసుపత్రుల పాలయ్యారు. అదే ఏడాది షిప్‌యార్డ్ క్రేన్ కూలి 11 మంది ప్రాణాలు కోల్పోయారు. 2023లో కాకినాడ జిల్లాలోని ఆయిల్ ప్యాకేజి పరిశ్రమలో 24 అడుగుల ఎత్తున్న నూనె ట్యాంకులో దిగిన ఏడుగురు కార్మికులు బలయ్యారు. అంతకుముందు ఏడాది ఏలూరు జిల్లా అక్కిరెడ్డిగూడెం పోరస్ కర్మాగారంలో ప్రమాదం ఏడుగురి ప్రాణాలు తీసింది. దేశంలో 2017-20 మధ్య జరిగిన ప్రమాదాల లెక్కల ప్రకారం.. ఏటా 1109 మంది మరణిస్తుండగా, నాలుగు వేల మందికిపైగా క్షతగాత్రులవుతున్నారు. రోజూ కనీసం ముగ్గురు కార్మికులు మరణిస్తున్నా కార్పొరేట్ల సేవలో తరిస్తున్న పాలకుల్లో చలనం లేదు. తనిఖీలను తగ్గించి, స్వీయ ధ్రువీకరణలను అనుమతించడం ద్వారా భద్రతాపరమైన నియంత్రణలను బలహీనపరచడం అన్ని అనర్థాలకూ కారణమని అంతర్జాతీయ కార్మిక సమాఖ్య పదేపదే హెచ్చరిస్తున్నా.పాలకుల చెవికెక్కడం లేదు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ పేరుతో కార్పొరేట్లకు కొమ్ముకాస్తూ, కార్మికుల భద్రతను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా గాలికొదిలేశాయి. పరిశ్రమల నుంచి వచ్చే వ్యర్థ రసాయనాల శుద్ధి, పర్యావరణ పరిరక్షణకు, వాతావరణంలో విషవాయువుల మోతాదు తగ్గించడానికి గ్రీన్‌బెల్ట్ ఏర్పాటు వంటి చర్యలు చేపట్టాల్సిన డెవలపర్ అది తన బాధ్యత కాదన్నట్టు వ్యవహరించారు.



ఎడిటర్ : కె. సునీల్‌కుమార్

### ఏలూరు రేంజ్ ఐజీని కలిసిన
# కాకినాడ జిల్లా ఎస్పీ



**కాకినాడసిటీ, విశ్వంవాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లా నూతన ఎస్పీగా విక్రాంత్ పాటిల్ పదవి భాద్యతలు స్వీకరించిన విక్రాంత్ పాటిల్ ఏలూరు రేంజ్ కార్యాలయం నందు ఇన్స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ జీవిజి అశోక్ కుమార్‌ని మర్యాద పూర్వకముగా కలిసారు.

### ఉపాధి కార్యాలయంలో
# పెత్తనమంతా ఆయనదే

**పేరుకే కంప్యూటర్ ఆపరేటర్**
**ఏపీడీ పేరు చెబుతూ సిబ్బంది దగ్గర అక్రమ వసూళ్లు ఇదీ మార్కాపురం**
**ఉపాధి కార్యాలయంలో జరుగుతున్న తీరు తెన్నూ**



**మార్కాపురం /విశ్వంవాయిస్ :** ఉపాధి హామీ పథకం ఏపీడీ కార్యాలయంలో నారాయణ చెప్పిందే వేదం. ఆయన మాటే శాసనం. ఆయన కన్నెర్ర చేస్తే సిబ్బంది వెన్నులో వనుకు పుట్టాల్సిందే. దీనిని బట్టి ఆయన ఓ పెద్ద అధికారి అనుకుంటున్నారా కాదు కాదు కేవలం ఒక కంప్యూటర్ ఆపరేటర్ మాత్రమే. వివరాల్లోకి వెళితే..మార్కాపురంలోకి మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కార్యాలయంలో ఏపీడీగా ఒక మహిళా ఉద్యోగి పని చేస్తున్నారు. ఆమె పరిధిలోని మండలాల్లో ఉపాధి పనులు తనిఖీ చేసేందుకు వెళ్లే సమయంలో కంప్యూటర్ ఆపరేటర్ నారాయణను తోడుగా తీసుకెళ్తుంటారు. ఒక్కో సంధర్భంలో ఆమె వెళ్లకుండానే నారాయణను ఫీల్డ్ విజిట్కు పంపించేవారు. దీనిని ఆసరాగా తీసుకున్న సదరు కంప్యూటర్ ఆపరేటర్ నారాయణ తానే ఏపీడీగా ఫీల్ అవుతూ కింది స్థాయి సిబ్బందిపై చిందులు వేస్తున్నాడు. నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నాడు. మహిళా సిబ్బంది అని కూడా చూడకుండా ఇష్టానుసారం మాట్లాడుతున్నాడు. తాను చెప్పినట్లు వినాలంటూ ఆదేశిస్తున్నాడు. మండల స్థాయి అధికారులను సైతం బ్లాక్ మెయిల్ చేస్తున్నాడు. ఇంత జరుగుతున్నా గత్యంతరం లేక మార్కాపురం ఉపాధి ఏపీడీ కార్యాలయం పరిధిలోని మండలాల ఉపాధి సిబ్బందితో పాటు కొందరు అధికారులు సైతం నారాయణకు ముడుపులు ముట్టజెబుతున్నారు. ఇదంతా ఏపీడీకి తెలియకుండానే జరుగుతున్నా సిబ్బంది మాత్రం తమపై ఏపీడీకి లేనిపోనివి చెప్పి ఇబ్బంది పెట్టిస్తాడేమోనని జంకుతున్నారు. నారాయణ చేసే ఆగడాలను నేరుగా ఏపీడీకి చెప్పే సాహసం చేయలేకపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని ఉపాధి సిబ్బందిపై పెత్తనం చెలాయిస్తున్న కంప్యూటర్ ఆపరేటర్ నారాయణ ఆగడాలకు కళ్లెం వేయాలని కోరుతున్నారు.

### ప్రకాశం జిల్లా నూతన ఎస్పీగా
# ఏ.ఆర్. దామోదర్ బాధ్యతలు



**ఒంగోలు/ విశ్వం వాయిస్ :** జిల్లా నూతన ఎస్పీగా ఏ. ఆర్. దామోదర్ బుధవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎస్పీని అడిషనల్ ఎస్పీ(అడ్మిన్) కె.నాగేశ్వరరావు, అడిషనల్ ఎస్పీ (క్రైమ్ )ఎస్ వి. శ్రీధర్ రావు, ఎ. ఆర్ అడిషనల్ ఎస్పీ అశోక్ బాబు, అన్ని సబ్ డివిజనల్ డిఎస్పీలు, సీఐలు, ఆర్ఐ లు, ఎస్సైలు మర్యాదపూర్వకంగా కలసి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ విధులు నిర్వహించేందుకు అవకాశం కల్పించిన రాష్ట్ర ప్రభుత్వానికి, రాష్ట్ర ముఖ్యమంత్రి, డిప్యూటీ సీ .ఎం. మరియు డీజీపీ కు కృతజ్ఞతలు తెలిపారు. ప్రకాశం జిల్లాతో మంచి అనుబంధం ఉందని, ఒంగోలులో ప్రొబేషనరీ డిఎస్పీ, విజయనగరం జిల్లా ఎస్పీమరియు ఒంగోలు పోలీస్ ట్రైనింగ్ కాలేజీ ఎస్పీ పనిచేశామన్నారు. జిల్లాలో శాంతి భద్రత పరిరక్షణ, నేరాల నియంత్రణ విషయంలో ఎటువంటి రాజీ పడేదిలేదని, రాష్ట్ర ప్రభుత్వం తీవ్రంగా భావిస్తున్న గంజాయి, మాదకద్రవ్యాల నిర్మూలనకు ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని, అదే విధంగా గంజాయి అరికట్టుటకు తల్లిదండ్రులు, కాలేజీ యాజమాన్యాలు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజలు పోలీసులకు సహకారం అందించాలని కోరారు. సైబర్ నేరాలపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. నేరాలు, చట్టవ్యతిరేక/ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా, ప్రోత్సహించినా శాంతి భద్రతలకు మరియు ప్రజాశాంతికి విఘాతం కలిగించే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారిస్తామని, ట్రాఫిక్ ను క్రమబద్ధీకరిస్తామని, సిబ్బంది సమస్యల పరిష్కారంలో ఎల్లవేళలా కృషి చేస్తానని, ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటామని, ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు అందుబాటులో ఉంటానన్నారు. అందరి సహకారంతో జిల్లాను నేర రహితంగా నిలిపేందుకు, పోలీసులు సేవాభావంతో ప్రజలకు మరింత చేరువ చేసేందుకు కృషి చేస్తామని జిల్లా ఎస్పీ తెలిపారు. జిల్లా ప్రజలు, నాయకులు, పాత్రికేయులు ప్రజాప్రతినిధులు అందరూ సమన్వయంతో సహాయ సహకారాలు అందించాలని జిల్లా ఎస్పీ కోరారు.

### 29న 'పైడిపుట్ట'లో జాతీయ అల్లూరి సంఘం ఆత్మీయ సమావేశం

**ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవికి అభినందన సత్కారం**



**రంపచోడవరం, విశ్వంవాయిస్ న్యూస్:** జాతీయ అల్లూరి సీతారామరాజు యువజన సంఘం 'ఆత్మీయ సమావేశం' ఈనెల 29వ తేదీ సోమవారం ఉదయం 10 గంటలకు అడ్డతీగల మండలం 'పైడిపుట్ట' గ్రామంలోని 'అల్లూరి సీతారామరాజు రచ్చబండ' వద్ద నిర్వహించడం జరుగుతుందని, ఈ సందర్భంగా రంపచోడవరం నియోజకవర్గ శాసన సభ్యురాలుగా ఎన్నికైన మిరియాల శిరీషాదేవికి అభినందన సత్కారం జరుపబడుతుందని రంపచోడవరం డివిజన్ అల్లూరి సీతారామరాజు యువజన సంఘం అధ్యక్షులు చోడిశెట్టి సుబ్బారావు, జాతీయ కార్యదర్శులు రామన శ్రీనివాసరావు (స్టార్ శ్రీను), వాడపల్లి శేషాచార్యులు తెలియజేశారు. బుధవారం రంపచోడవరంలో శాసనసభ్యురాలు మిరియాల శిరీషదేవి కార్యాలయంలో ఆమెను సంఘం జాతీయ కార్యదర్శులు రామన శ్రీనివాస్, వాడపల్లి శేషాచార్యులు మర్యాద పూర్వకంగా కలిసి కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొనాలని ఆహ్వానించగా ఆమె అంగీకరించినట్లు వారు తెలిపారు.

### విశాఖపట్నంలో బహుజన్ సమాజ్ పార్టీ సమావేశంలో కుల గణన చెయ్యాలి
# అనే నినాదంతో జోన్ -1 సమావేశం






**విశాఖపట్నం, విశ్వంవాయిస్ న్యూస్ :** బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో నేడు విశాఖపట్నంలో జోన్- 1 సమావేశం నిర్వహించడం జరిగింది ఈ సమావేశానికి జోన్ -1 లోని తొమ్మిది జిల్లాల నుంచి జిల్లా కమిటీలు నియోజకవర్గ కమిటీలు హాజరు కావడం జరిగింది ఈ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షులు బక్క పరంజ్యోతి మాట్లాడుతూ విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేటీకరణ చేయకుండా అడ్డుకోవాలని విశాఖ ఉక్కు కర్మాగారానికి గనులను కేటాయించి లాభాలలో నడిపించాలని మాట్లాడారు రాష్ట్ర కోఆర్డినేటర్ ఐపీఎస్ అధికారి పూర్ణచంద్రరావు మాట్లాడుతూ బీసీలు లెక్కలు తేల్చాలని బీసీలకు జనాభా ప్రాతిపదికన హక్కులు కల్పించాలని మాట్లాడారు చివరగా రాష్ట్ర కమిటీ అంతా కలిసి బహుజన్ సమాజ్ పార్టీతో కలిసి పోరాడండి కులాల లెక్కలు తేలుద్దాం అనే నినాదంతో సమావేశాన్ని ముగించడం జరిగింది. ఈ సమావేశానికి కాకినాడ జిల్లా నుంచి జిల్లా అధ్యక్షులు సుబ్బు భాయ్ ,జిల్లా జనరల్ సెక్రెటరీ ఖండవిల్లి లోవరాజు, కన్వీనర్ ప్రత్తిపాటి బుల్లి రాజు, పెద్దాపురం ఇంచార్జ్ అరుణ్ కుమార్, 9 జిల్లాల నుంచి జిల్లా అధ్యక్షులు జిల్లా కమిటీలు నియోజకవర్గ కమిటీలు పాల్గొనడం జరిగింది.

# క్రైస్తవ హక్కులు పరిరక్షణ కొరకే ఎఫ్ఎఫ్‌సిఐ

**జాతీయ అధ్యక్షులు పీటర్ పుట్ట**







అమలాపురం. విశ్వం వాయిస్ న్యూస్ : క్రైస్తవులు హక్కుల కోసం పోరాడాలని ఎఫ్ ఎఫ్ సి ఐ అని జాతీయ అధ్యక్షులు పీటర్ పుట్ట అన్నారు. బుధవారం అమలాపురంలో మెట్ల కాలనీలో గ్లోరియస్ టెంపుల్ లో జరిగిన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కార్యవర్గ సమావేశానికి పీటర్ పుట్ట ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి క్రైస్తవుడు , ప్రతి దైవజనుడు క్రైస్తవుల అభివృద్ధికి పాటుపడాలని అన్నారు. క్రైస్తవులకు , దైవజనులకు కులం ఉండకూడదని అన్నారు. ప్రతి ఒక్కరూ ప్రేమ ఆప్యాయలతో సోదర భావంతో ఉండాలని పేర్కొన్నారు. సమాజంలో క్రైస్తవుల పై జరుగుతున్న దాడులను అరికట్టాలని అన్నారు. క్రైస్తవ సంక్షేమము వివిధ క్రైస్తవ సామాజిక అంశాల కొరకు ఏర్పాటు చేయబడిన సమూహమే ఎఫ్ ఎఫ్ సి ఐ అని పీటర్ పుట్ట అన్నారు. అనంతరం అంబేద్కర్ కోనసీమ జిల్లాలో అన్ని మండలాల్లో మండల ఎఫ్ ఎఫ్ సి ఐ కోఆర్డినేటర్స్ ని ఎన్నుకున్నారు. క్రైస్తవులపై దాడులు జరిగితే వెంటనే స్పందించాలని తెలిపారు . ప్రతి చర్చి పాస్టరు రిజిస్ట్రేషన్ కలిగి ఉండాలని తెలిపారు. అంబేద్కర్ కోనసీమ జిల్లాలో ఉన్న అన్ని డినామినేషన్స్ , ఫెలోషిప్స్ ఎవరైనా సరే ఎఫ్ ఎఫ్ సి ఐ లో జాయిన్ సభ్యత్వం కలిగి ఉండాలని పిలుపునిచ్చారు. తెలియని వ్యక్తులు ఫోన్ కాల్స్ చేస్తున్నప్పుడు జాగ్రత్తగా స్పందించాలని తెలిపారు. ప్రతి చర్చి వద్ద సీసీ కెమెరాలు నిఘా పెట్టాలని తెలిపారు. ఎవరైనా కొత్త వ్యక్తులు చర్చికి వచ్చినప్పుడు వారి వివరాలు తీసుకోవాలని తెలిపారు. ఇటీవల అమెరికాలో దేవుని సువార్త పరిచ౼ర్యల నిమిత్తం వెళ్లి స్వదేశానికి తిరిగి వచ్చిన అంబాజీపేట మండలం పుల్లేటికుర్రు గ్రామానికి చెందిన పాస్టర్ బి. హోసన్నను ఎఫ్ఎఫ్‌సిఐ ఆధ్వర్యంలో దైవజనులందరూ ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రెవ జె సుదర్శన్ రాజు, రెవ యార్లగడ్డ పరంజ్యోతి బాబు, రెవ బొండాల ఎబినేజర్, రెవ ఎస్ ఇమ్మానియేల్, రేవ ఎస్ ఆనంద ప్రసాద్, రెవ బాబు సైమన్, రెవ పి ప్రసాద్, రెవ జాన్ మార్క్, రెవ ఎం యెహోషువ, డాక్టర్ జె విక్టర్ కుమార్, పాస్టర్ ఎన్ మధు, పాస్టర్ ప్రభు కుమార్, అంబేద్కర్ కోనసీమ జిల్లాలో ఉన్న దైవ సేవకుల సమైక్య ప్రెసిడెంట్, సెక్రటరీలు పాల్గొన్నారు.

### జిజిహెచ్ శస్త్రచికిత్స థియేటర్లో
# ఎల్ఈడి లైట్లు ప్రారంభం



**కాకినాడసిటీ, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రిలో బుధవారం,ఆంధ్రప్రదేశ్ వైద్య సంచాలకులు (డి.ఎం. ఈ) డా. డి.ఎస్.వి.ఎల్ నరసింహం క్యాన్సర్ శస్త్ర చికిత్స విభాగంలో ఆపరేషన్ థియేటర్ రూఫ్ టాప్ లైట్ కు ప్రారంభోత్సవం చేశారు. సుమారు 1,80,000రూ. విలువ గల ఈ అధునాతన ఎల్.ఇ.డీ దీపాలను అమెరికా, సాన్ జోస్ వాస్తవ్యులైన జొన్నలగడ్డ రవి శంకర్, శ్రీమతి గౌరీ లక్ష్మి విరాళంగా, శ్రీమతి%ఢ% శ్రీ ఇందిర, చాగంటి సూర్యనారాయణ పేరు మీద ఇచ్చి, తమ వదాన్యతను చాటుకున్నారు. కాకినాడ ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. లావణ్య కుమారి, డిప్యూటీ సూపరింటెండెంట్ డా. శ్రీనివాసన్, జనరల్ సర్జరీ శాఖామాత్యులు డా.రవి కమల్ కుమార్,అనస్తీషియా శాఖామాత్యులు డా. విష్ణు వర్ధన్, పిల్లల విభాగ శాఖామాత్యులు డా. మాణిక్యాంబ, సిఎస్ఆర్ఎమ్ఓ డా.అనిత, డా శైలజ, శైలజారాణి, సత్యవాణి క్యాన్సర్ శాస్త్ర చికిత్స నిపుణులు సమంత కుమార్, ఆపరేషన్ థియేటర్ నర్సింగ్ స్టాఫ్, తదితర సిబ్బంది ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిఎంఈ డా. నరసింహం మాట్లాడుతూ ఈ ఏడాది మార్చి నెల నుండి క్యాన్సర్ శస్త్ర చికిత్స కోసం ప్రత్యేక విభాగాన్ని కాకినాడ ఆసుపత్రి నందు ప్రారంభించామని, కాకినాడ జిల్లా పరిసర ప్రాంతాల్లో క్యాన్సర్ రోగులకు అత్యున్నత శస్త్ర చికిత్స సేవలు అందించడంలో ఈ విభాగం కృషి చేస్తోందని చెప్పారు. సూపరింటెండెంట్ డా. లావణ్య కుమారి మాట్లాడుతూ కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలో క్యాన్సర్ నివారణ,నిర్ధారణ, చికిత్సకై 'సమగ్ర క్యాన్సర్ చికిత్సా విధానం' అందుబాటులో కలదు అని తెలిపారు.

# భూసేకరణ ప్రక్రియ పూర్తిస్థాయిలో అమలు చేయాలి జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియ



ఒంగోలు, విశ్వం వాయిస్ : జిల్లాలో వివిధ జాతీయ రహదారులు మరియు రైల్వే ,ప్రాజెక్ట్స్ కు సంబంధించి , భూసేకరణ ప్రక్రియను త్వరితగతిన పూర్తిచేయుటకు సంబంధిత రెవెన్యూ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ ఏ. తమీమ్ అన్సారియా, రెవెన్యూ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ ఛాంబర్ లో జాయింట్ కలెక్టర్ ఆర్. గోపాల్ క్రిష్ణ తో కలసి రెవెన్యూ డివిజనల్ అధికారులు, ఎస్.డి.సి లు, అటవీ శాఖ అధికారులు, ఐటిడిఏ, సర్వే అండ్ లాండ్ రికార్డ్స్ అధికారులతో సమావేశమై , జాతీయ రహదారులు మరియు రైల్వే ప్రాజెక్ట్స్ కు సంబంధించి చేపట్టిన భూసేకరణ ప్రక్రియ పురోగతి, 22 ఏ డిలీషన్స్, సిసిఆర్సి కార్డ్స్ జారీ , మీకోసం అర్జీల పరిష్కారం, మీ సేవ మరియు సచివాలయాల సర్వీసెస్, ఆర్.ఓ.ఎఫ్.ఆర్. క్లయిమ్స్ పెండింగ్, కోర్టు కేసులు తదితర అంశాలపై సమీక్షించి పలు సూచనలు, ఆదేశాలుజారీచేశారు. , క్షేత్ర స్థాయిలో మ్యుటేషన్, రీ సర్వే, వెబ్ లాండ్ లో పేరు నమోదు తదితర భూ సమస్యలపై ప్రజల నుండి వచ్చే అర్జీలపై రెవెన్యూ అధికారులు ప్రత్యేక దృష్టి సారించి పరిష్కరించదగిన సమస్యలను సత్వరం పరిష్కరించాలని, చేయలేనివి ఏ కారణం వలన పరిష్కారం చేయడం లేదో నిర్థిష్టమైన కారణాలు సంబంధిత అర్జీదారులకు తెలియ చేయాలన్నారు. నిర్ధిష్టమైన కారణం లేకుండా ఏ ఒక్క ధరఖాస్తును తిరస్కరించరాదని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. రెవెన్యూ అంశాలకు సంబంధించి ప్రజల వద్ద నుండి వచ్చే అర్జీలను మండల స్థాయిలో ఏ విధంగా



పరిష్కరించబడుచున్నవో సంబంధిత రెవెన్యూ డివిజనల్ అధికారులు పూర్తి స్థాయిలో పర్యవేక్షణ చేయాలని జిల్లా కలెక్టర్, రెవెన్యూ డివిజనల్ అధికారులను ఆదేశించారు. ఎక్కడైతే భూ సేకరణ ప్రక్రియ పూర్తి కాబడిందో అక్కడ డ్రైవ్ మోడ్ లో మ్యూటేషన్ ప్రక్రియను చేపట్టాలని కలెక్టర్ సూచించారు. 22 ఏ డిలీషన్స్ ప్రక్రియలను నిర్ధేశించిన గడువు లోపు పరిష్కరించేలా చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలో నిర్ధేశించిన లక్ష్యం మేరకు సిసిఆర్సి కార్డ్స్ ను జారీచేసేలా రెవెన్యూ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఆర్ఓఎఫ్ఆర్ క్లెయిమ్స్ రీవెరిఫికేషన్ ప్రక్రియను రెవెన్యూ, అటవీ, ఐటిడిఏ అధికారులు సమన్వయంతో పనిచేసి త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కోర్టు కేసులపై సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని, పెండింగ్లో వున్న కోర్టు కేసులపై డివిజన్ స్థాయిలో సమావేశం ఏర్పాటు చేసుకొని కోర్టు ఉత్తర్వులను అమలు చేసేలా రెవెన్యూ డివిజన్ అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో మార్కాపురం సబ్ కలెక్టర్ రాహుల్ మీన, జిల్లా రెవెన్యూ అధికారి విశ్వేశ్వర రావు, ఒంగోలు, కనిగిరి ఆర్డిఓ లు సుబ్బారెడ్డి, జాన్ ఇర్విన్, ఎస్డిసి లు ఝాన్సి లక్ష్మి, వరకుమార్, లోకేశ్వర రావు, డి.ఎఫ్.ఓ శ్రీనివాసులు, డి.టి.డబ్ల్యూ.ఓ జగన్నాథ రావు, సర్వే ల్యాండ్ రికార్డ్స్ ఎ.డి . కిశోర్ బాబు, కలెక్టరేట్ భూసేకరణ విభాగం అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# విశ్వ వాయిస్
అవినీతిపై- అక్షరసమరం...



కాకినాడ తూర్పు గోదావరి
డా బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ

గురువారం/ జూలై/18/2024

04

www.viswamvoice.com


## భక్తి శ్రద్ధలతో
# తొలి ఏకాదశి పూజలు
### శాకంబరీ దేవిగా వాసవి మాత



**మండపేట రూరల్, విశ్వం వాయిస్ :** మండపేట నియోజకవర్గ వ్యాప్తంగా భక్తిశ్రద్ధలతో తొలి ఏకాదశి పర్వదిన సందర్భంలో విశేష పూజలు నిర్వహించారు. ఆల యాలకు భక్తులు పోటెత్తారు. మండపేట మండలంలోని ద్వారపూడి గ్రామంలో వాసవి వీధిలో వేంచేసి ఉన్న శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో ఆషాడ మాసం తొలి ఏకాదశి మహా పర్వదినాన్ని పురస్కరించుకుని అమ్మ వారు శాఖంబరిగా దర్శనమిచ్చారు. సుమారు 66 రకాల కాయగూరలతో శాకంబరీ అలంకారం చేశారు. అర్చకులు శ్రీహరి ఆధ్వర్యంలో విశేష పూజలు అర్చనలు అభిషేకాలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పూజాదికాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో వాసవి యూత్, ఆర్యవైశ్య సంక్షేమ సంఘం , వాసవి క్లబ్ వనితా క్లబ్ అధ్యక్షులు, సభ్యులు పాల్గొన్నారు.



## అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎస్పీగా
# బి.కృష్ణారావు బాధ్యతలు

అమలాపురం టౌన్, విశ్వంవాయిస్ న్యూస్: అంబేద్కర్ కోనసీమ జిల్లా నూతన ఎస్పిగా బి కృష్ణారావు బాధ్యతలు తీసుకున్నారు. బుధవారం జిల్లా పోలీసు కార్యాలయం, డా.బి. ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా, అమలాపురం. బుధవారం డా.బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎస్పి గా బి. కృష్ణారావు బాద్యతలు స్వీకరించారు. ముందుగా జిల్లా అదనపు ఎస్పి ఎస్. ఖాదర్ బాషా పుష్పగుచ్చం ఇచ్చి స్వాగతం పలికి తదుపరి పోలీస్ గౌరవవందనం స్వీకరించి ఎస్పి గా బాద్యతలు స్వీకరించారు. అనంతరం పాత్రికేయ మిత్రులతో సమావేశం ఏర్పాటు చేసారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ సొంత జిల్లా శ్రీకాకుళం అని, మొదటిసారిగా ఏలూరు రేంజ్ లో విధులను చేపట్టాను... జిల్లాలో క్రైమ్ శాతం తగ్గించేందుకు కృషి చేస్తాను అన్నారు. జిల్లాలో సుమారు 200 మందికి పైగా సిబ్బంది కొరత ఉందని పూర్తిస్థాయిలో సిబ్బందిని నియమించేందుకు చర్యలు చెప్పడతామన్నారు. నూతన సాంకేతిక టెక్నాలజీ ఉపయోగించి సిబ్బందిపై ఎక్కువ భారం పడకుండా చర్యలు తీసుకుంటామని ఎస్పీ తెలిపారు. జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని అన్నారు. శాంతి భద్రతల పరిరక్షణ కోసం మంచి పోలీసింగ్ విధానాన్ని అమలు చేసి, పోలీస్ శాఖ ప్రతిష్టను పెంపొందించే విధంగా పని చేస్తామని అన్నారు. శాంతిభద్రతల పరిరక్షణ విషయంలో ప్రజలు, మీడియా వారు, ప్రజాప్రతినిధులు తమ వంతు సహాయ సహకారాలు అందించాలని కోరారు. అనంతరం ఛాంబర్ నందు జిల్లా పోలీసు అధికారులతో ఇంట్రాక్ట్ అయినారు.

## పేకాట రాయుళ్లుపై
# పోలీసులు దాడులు
### జిల్లా ఎస్పిఎస్ శ్రీధర్



**అమలాపురం టౌన్, విశ్వంవాయిస్ న్యూస్:** వివిధ కేసులలో పలువురును అరెస్టు చేసినట్లు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎస్పీ ఎస్ శ్రీధర్ బుధ వారం స్థానిక విలేకరులకు తెలిపారు. ఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం అమలాపురం ఎస్పీ యస్. శ్రీధర్, స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో అదనపు ఎస్పి ఎస్.ఖాదర్ బాషా ఆదేశాల మేరకు మంగళవారం రామచంద్రాపురం సబ్-డివిజన్ ద్రాక్షారామ పోలీసు స్టేషన్ పరిధిలో ఎన్ఫోర్స్మెంట్లో భాగంగా విస్తృత దాడులు జరిపి, ఒక వ్యక్తిని అరెస్ట్ చేసి అతని వద్ద నున్న 23 డ్యూటీ పెయిడ్ లిక్కర్ బాటిల్స్ (ఖరీదు రూ. 3,118/ను స్వాధీన పరుచుకొని ఒక కేసు నమోదు చేసినారు. అదేవిధంగా, ఎన్ఫోర్స్మెంట్లో భాగంగా మండపేట రూరల్ పోలీసు స్టేషన్ పరిధిలో వేములపల్లి వద్ద పేకాట ఆడుతున్న తొమ్మిది మంది (09) వ్యక్తులను అరెస్ట్ చేసి వారివద్ద ఉన్న నగదు రూ.7,580/-లను స్వాధీన పరుచుకొని ఒక కేసు నమోదు చేసినారు.

# తూర్పుగోదావరి జిల్లా ఎస్పీగా డి.నరసింహ కిషోర్ బాధ్యతలు స్వీకరణ



- జిల్లాలో క్లీన్ అండ్ ట్రాన్స్పరెంట్ పోలీస్సింగ్ అమలు చేసి, జిల్లా ప్రతిష్టతను పెంపొందింప చేస్తాం
- గంజాయి, డ్రగ్స్, నాటు సారా మొదలగు అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపుతాం
- పాత నేరస్తులు రౌడీ షీటర్లపై ప్రత్యేక నిఘా ఉంచుతాం
- చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే ఎంతటి వారినైనా సరే ఉపేక్షించేది లేదు : జిల్లా ఎస్పీ డి.నరసింహ కిషోర్



**రాజమహేంద్రవరం, విశ్వంవాయిస్ న్యూస్ :** జిల్లా ప్రజల, పాత్రికేయుల మరియు జిల్లా పోలీస్ యంత్రాంగం సహకారంతో శాంతి భద్రతలు పరిరక్షిస్తూ ప్రభుత్వానికి మంచి పేరు తీసుకొస్తాం అని తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ డి. నరసింహకిషోర్ పాత్రికేయుల సమావేశంలో ఆయన తెలిపారు. బుదవారం ఉదయం తూర్పుగోదావరి జిల్లా నూతన ఎస్పీగా డి.నరసింహ కిషోర్ బాధ్యతలు స్వీకరించారు. ముందుగా జిల్లా ఏ.ఆర్ గార్డ్స్ నుండి గౌరవ వందనం స్వీకరించిన అనంతరం, ఎస్పీ కి జిల్లా అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) ఎస్. ఆర్. రాజశేఖర రాజు,పలువురు డీఎస్పీలు ఆయనకి పుష్పగుచ్చాలు అందజేసి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ... తూర్పుగోదావరి జిల్లా ఒక ప్రతిష్టాత్మకమైన జిల్లా అని, ఈ జిల్లాలో పోస్టింగ్ ఇచ్చినందుకుగాను రాష్ట్ర ముఖ్యమంత్రికి, ఉపముఖ్య మంత్రికి రాష్ట్ర డిజిపికి, హెూమ్ మంత్రికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు తన వంతు కృషి చేస్తానని అన్నారు. శాంతి భద్రతల పరిరక్షణ కోసం మంచి పోలీసింగ్ విధానాన్ని అమలు చేసి, పోలీస్ శాఖ ప్రతిష్టను పెంపొందించే విధంగా పని చేస్తామని అన్నారు. శాంతిభద్రతల పరిరక్షణ విషయంలో ప్రజలు, మీడియా వారు, ప్రజాప్రతినిధులు తమ వంతు సహాయ సహకారాలు అందించాలని కోరారు.అనంతరం జిల్లా పోలీసు అధికారులతో కాన్ఫరెన్స్ హాల్ నందు ఇంట్రాక్ట్ అయినారు. ఈ కార్యక్రమంలో జిల్లా అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) ఎస్. ఆర్. రాజశేఖర్ రాజు, అడిషనల్ ఎస్పీ (ఎస్ ఈ బి) పి. సోమశేఖర్, డి.ఎస్.పి( ఎస్.బి) డి. ప్రభాకర్ , ఇన్స్పెక్టర్ (ఎస్.బి) సూరి అప్పారావు, జోనల్ డిఎస్పీలు,ఇన్స్పెక్టర్లు, సబ్ ఇన్స్పెక్టర్లు, పోలీస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఆర్. రఘురాం,వైస్ ప్రెసిడెంట్ సాయి మహేష్, ఇతర అసోసియేషన్ సభ్యులు సిబ్బంది పాల్గొన్నారు.

## అనుమతులు లేకుండా అక్రమ మైనింగ్ కార్యకలాపాలకు
# పాల్పడితే కఠిన చర్యలు తప్పవు



**కాకినాడ సిటీ, విశ్వంవాయిస్ న్యూస్ :** అనుమతులు లేకుండా అక్రమంగా మైనింగ్ కార్యకలాపాలు నిర్వహించే వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ సగిలి హెచ్చరించారు. బుధవారం గండేపల్లి మండలం, సూరంపాలెం దగ్గర ఉన్న రామేశంపేట గుండ్లమెట్ట ప్రాంతాన్ని జిల్లా కలెక్టర్ షాన్ మోహన్.. రెవిన్యూ, గనులు, విజిలెన్స్, పోలిస్ శాఖల అధికారులతో కలిసి పరిశీలించారు. గుండ్లమెట్ట ప్రాంతంలో క్వారీలో ఎంతవరకు తవ్వకాలు జరిగినాయి, అసైన్డ్, జిరాయితీ భూముల వివరాలు, గతంలో ప్రభుత్వం ఇచ్చిన అనుమతులు, అక్రమంగా తరలిస్తున్న మైనింగ్ వంటి వివారాలను జిల్లా కలెక్టర్..అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ మాట్లాడుతూ జిల్లాలో గండేపల్లి, ప్రత్తిపాడు, రౌతులపూడి మండలాల్లో అనుమతులు ఉన్న క్వారీలతో పాటు అనుమతులు లేని క్వారీలలో కూడా అక్రమ మైనింగ్ తవ్వకాలు జరుగుతున్నట్టు తమ దృష్టికి వచ్చిందన్నారు. దినికి సంబంధించి గత రెండు రోజులుగా కొన్ని వాహనాలను సీజ్ చేశామని ఆయన తెలిపారు. ఇసుక కోసం పగడ్బందీగా ఎలా వ్యవహరిస్తున్నామో గ్రావెల్ తవ్వకాలపై కూడా ప్రత్యేక దృష్టి పెట్టడం జరుగుతుందన్నారు. గండేపల్లి మండలానికి సంబంధించి గుండ్లమెట్ట ప్రాంతంలో 234 ఎకరాలకు గాను 216 ఎకారాలు అసైన్డ్ భూములు, మిగిలింది జిరాయితీ భూములుగా ఉన్నాయన్నారు. 2021-22 సంవత్సర వరకు 3.45 లక్షల క్యూబిక్ మీటర్ల గ్రావెల్ తవ్వకాలకు అనుమతి ఇచ్చినట్లు కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వ పనులకు మినహా ఇతర పనులకు గ్రావెల్ తవ్వకాలను తాత్కాలికంగా రద్దు చేయడం జరిగిందన్నారు. ప్రభుత్వం నుంచి అనుమతులు వచ్చేంతవరకు ఎటువంటి మైనింగ్ కార్యకలాపాలు నిర్వహించడానికి వీలులేదని, అక్రమంగా గ్రావిల్ తవ్వకాలను నిర్వహించే వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ ఈ సందర్భంగా హెచ్చరించారు. రెవిన్యూ, గనులు, విజిలెన్స్, పోలీస్ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి, పటిష్ట నిఘా ఏర్పాటు చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఈ పరిశీలనలో జిల్లా కలెక్టర్ వెంట జిల్లా గనుల శాఖ డీడీ ఈ. నరసింహారెడ్డి, జిల్లా విజిలెన్స్ నిఘా విభాగాం సురేష్ రెడ్డి, గండేపల్లి, పెద్దాపురం తహసీల్దార్లు జె.చిరంజీవి, ఎస్.శ్రీనివాస రెడ్డి ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# డ్రైనేజీలను ఆక్రమిస్తే ఎలా?

**తక్షణమే ఆక్రమణలు తొలగించండి కమిషనర్ ఆదేశం**





**కాకినాడ సిటీ, విశ్వంవాయిస్ న్యూస్ :** డ్రైనేజీల పై సిమెంట్ స్లాబ్ లు వేసి ఆక్రమిస్తున్న తీరుపై కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ జే.వెంకటరావు అసహనం వ్యక్తం చేశారు. బుధవారం ఆయన మిలిటరీ రోడ్డులోని చీడిలపోర డ్రైన్ , డి-మార్ట్ ప్రాంతంలోని డ్రైనేజీల వద్ద జరుగుతున్న పూడిక తీత పనులను పర్యవేక్షించారు. చీడిలపోర వద్ద ప్రధాన డ్రైనేజీలో గుర్రపు డెక్క పేరుకు పోవడాన్ని గుర్తించి రెండు మూడు రోజుల్లో తొలగింపునకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే డి-మార్ట్ ప్రాంతంలో కొంతమంది డ్రైనేజీలపై సిమెంట్ స్లాబ్ లు వేయడం పై ఆయన మండిపడ్డారు. చేసిన ఆక్రమణలు, వాటిపై ఏర్పాటు చేసిన సిమెంట్ స్లాబ్ లను ఒకటి రెండు రోజుల్లో స్వచ్ఛందంగా తొలగించుకోవాలని స్పష్టం చేశారు. లేనిపక్షంలో నగరపాలక సంస్థ తరఫున తొలగించి అందుకు అయ్యే ఛార్జీలు వసూలు చేస్తామని కమిషనర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా పూడిక తీత పనుల ప్రగతిని ఆయన పర్యవేక్షించారు.

**నమ్మ టాయ్ లెట్స్ పరిశీలన :** సర్పవరం జంక్షన్ లోని నమ్మ టాయ్ లెట్స్ ను నగరపాలక సంస్థ కమిషనర్ జై. వెంకటరావు బుధవారం పరిశీలించారు. వీటి నిర్వహణను మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకోవాలని ఆయన ప్రజారోగ్య విభాగాన్ని ఆదేశించారు. ప్రైవేట్ వ్యక్తుల నిర్వహణలో ఉన్న నమ్మ టాయిలెట్స్ ను ప్రజలు వినియోగించుకునేలా అవసరమైన వసతులు, సౌకర్యాలు కల్పించాలని కమిషనర్ పేర్కొన్నారు. ఆయన వెంట డీసీపీ హరిదాస్, ఎం.హెచ్.ఓ డాక్టర్ పృథ్వీ చరణ్, శానిటరీ సూపర్వైజర్ రాంబాబు శానిటరీ ఇన్స్పెక్టర్ సత్తెప్ప నాయుడు, ఇతర సిబ్బంది ఉన్నారు.

## ఆర్వినాయుడు పుట్టిన రోజు సందర్భంగా
# బిజెపి నాయకులు సన్మానం



**అమలాపురం టౌన్, విశ్వంవాయిస్ న్యూస్ :** బిజెపి సీనియర్ నాయకులు ది చాంబర్ ఆఫ్ కామర్స్ ఉపాధ్యక్షులు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో బిజెపి ఎదుగు దలకు ముఖ్య కారకులు వారణాసి సూర్యనారాయణ ప్రధమ శిష్యులు పెద్దలు మా గురువులు అర్.వి. నాయుడు జన్మదిన సందర్భంగా వారిని బిజెపి జిల్లా కార్యాలయంలో ఘనంగా సన్మానించిన బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి మోకా వెంకట సుబ్బారావు బిజెపి అమలాపురం టౌన్ అధ్యక్షులు వెంబరాల భాస్కర్ శాస్త్రి వినియోగదారులు సంఘం జిల్లా అధ్యక్షులు ఆరిగల వెంకట రామారావు బిజెపి జిల్లా ఉపాధ్యక్షుడు దూరి రాజేష్ యువ మోర్చా జిల్లా అధ్యక్షులు కొండేటి ఈశ్వర్ గౌడ్ యువ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి బొంతు శివాజీ యువమోర్చా నాయకులు పాల్గొన్నారు.

## ఘనంగా ఏకలవ్యుడు
# జయంతి వేడుకలు
### విలువిద్యలో ఏకలవ్యుడుని మించిన ప్రతిభాశాలి లేరు ఎమ్మెల్యే వేగుళ్ల



**మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్ :** మండపేట స్థానిక 26వ వార్డులో గల షాదీఖాన వద్ద మరియు కాలువ గట్టు వద్ద జరిగిన ఏకలవ్యుడు జయంతి వేడుకల్లో శాసన సభ్యులు వేగుళ్ళ జోగేశ్వరరావు ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈ సంధర్భంగా ఎకలవ్యుడు చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాలులు అర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి అందరికీ పంచారు. ఈ సంధర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విలువిద్యలో ఏకలవ్యుడుని మించిన ప్రతిభాశాలి లేరని అన్నారు. గురువు విగ్రహాన్ని ఎదురుగా పెట్టుకొని విలువిద్యను నేర్చుకున్న ధీశాలి ఏకలవ్యుడు అన్నారు. అంత గొప్ప విద్య నేర్చుకున్న ఏకలవ్యుడు గురుదక్షిణగా తన బొటన వేలు నరికి ఇచ్చి గురువు ఆజ్ఞను శిరసా వహించిన గొప్ప వ్యక్తి ఏకలవ్యుడు అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎరుకుల సంక్షేమ సంఘం వైస్ ప్రెసిడెంట్ అమలదాసు రుద్రమూర్తి, ఎమ్మార్పీఎస్ నాయకులు ధూళి జయరాజు, కాటా గోపి, యలమంచిలి శ్రీను, మందపల్లి చంద్రశేఖర్, ముమ్మిడివరపు నారాయణ, గుండు వీరతాత రాజు, ఎం.డి.కరీం, లంకలపల్లి రాంబా బు, కోనా సత్యనారాయణ, కోటిపల్లి సాయిరాం, పిల్లా గణపతిరావు, టేకి వెంకటేష్, పాలచర్ల శిరీష్, తదితర్లు పాల్గొన్నారు.



# వైభవంగా శ్రీ రమా సత్యనారాయణ స్వామి సామూహిక వ్రతాలు



**మండపేట టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** మండపేట శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయం లో బుదవారం శ్రీ సత్యనారాయణ స్వామి వారి సామూహిక వ్రతాలు వైభవంగా నిర్వహించారు. మండపేట శ్రీ రమాసత్యనారాయణ స్వామి వారి శాశ్వత అన్న సమరాధన కమిటీ 6 వ వార్షికోత్సవం ,తొలి ఏకాదశి పర్వదిన సందర్భంలో శ్రీ రమా సత్యనారాయణ స్వామి కమిటీ, మండపేట ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో సామూహిక వ్రతాలు పూజలు నిర్వహించారు. 150 మంది దంపతులు వ్రతాన్ని ఆచరించి పూజాదికాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 1000 మందికి అన్న సమారాధన నిర్వహించారు. ఏర్పాటు 51 మంది కమిటీ సభ్యులు నిర్వహించారు.ఈ కార్యక్రమం లో కాళ్ళకూరి శ్రీ రామ నాగేశ్వరరావు (నాగబాబు), గ్రంధి ఓమ్ నమశ్శివాయ,చెన్నా రాంబాబు,బోనగిరి సతీష్,చక్కా రాంబాబు, చెన్నా వీరపండు, కూరపాటి ప్రసాద్, గ్రంధి పండు, రంగడు, మోటుముర్రి భవాని శంకర్, మన్యం ప్రసాద్, మన్యం మహేష్, కాళ్ళకూరి పెద్దరామ,బోడ వీర్రాజు, బోనగిరి రామకృష్ణ, బలబద్రపు భద్రరావు, తదితరులు పాల్గొన్నారు.

# నేటి నుంచే "కుష్టువ్యాధి గుర్తింపు సర్వే"



**18 నుంచి ఆగస్టు 2 వరకూ ఇంటింటి సర్వే**
**సర్వే కార్యకర్తకు రూ. 75 పారితోషికం**
**గత సర్వే పారితోషికాలకు ఎగనామం**
**ఇప్పుడు ముఖం చాటేసిన వాలంటీర్లు**



శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్ : కుష్టువ్యాధి "మైకోబాక్టీరియం లెప్రే" అనేది బ్యాక్టీరియా వల్ల కలిగే దీర్ఘకాలిక అంటు వ్యాధి. ఈ వ్యాధికి గురై చికిత్స పొందని రోగుల రోగి ముక్కు, నోటి నుండి తరచుగా వెలువడే దగ్గు, తుమ్ముల బిందువుల ద్వారా కుష్టువ్యాధి కారక మైకోబాక్టీరియం లెప్రే బ్యాక్టీరియా వెలువడుతూ ఉంటుంది. ఇలా బ్యాక్టీరియా వెలువడే రోగులకు ఇతరులు ఎవరైనా సన్నిహితంగా ఉన్నప్పుడు, తరచుగా సంప్రదిస్తున్న సందర్భాల్లోనూ ఇది మరింత మందికి అంటువ్యాధిలా వ్యాపిస్తుంది. ఎవరైనా పౌరుల్లో హైపోపిగ్మెంటెడ్, ఎరిథెమాటస్ మచ్చల అంత్య భాగాలపై ఖచ్చిత అనుభూతిని కోల్పోడం, నరాల సంచలనాన్ని కోల్పోవడం, కండరాలు, నరాల బలహీనత, లేత రంగు, ఎరుపు రంగు మచ్చలు, శరీరంలో ఏదైనా భాగంలో స్పర్శను కోల్పోవడం, చర్మంపై వాపు, అరచేతులు, అరికాళ్లపై పుండ్లు, చేతులు, కాళ్ళు, కళ్ల వైకల్యం వంటి లక్షణాలు గనుక కనిపిస్తే వారిని కుష్టు వ్యాధికి గురైనట్టు ప్రాధమిక దశలో అనుమానిస్తారు. ఆ తదుపరి వారికి పూర్తి స్థాయి పరీక్షలను నిర్వహించిన అనంతరం వ్యాధిని నిర్ధారిస్తారు. ఈ వ్యాధి నిర్ధారణకే ఈ లెప్రసీ కేస్ డిటెక్షన్ క్యాంపెయిన్ (ఎల్.సి.డి.సి) సర్వేను ఈ రోజు నుంచి ప్రారంభిస్తున్నారు. ఇది సమాజంలోని పౌరులకు ప్రారంభ దశలో ఉండగానే కుష్టు వ్యాధిని గుర్తించడానికి ఒక ప్రత్యేక చొరవ కలిగిన ప్రభుత్వ సర్వే కార్యక్రమం. ఇది జాతీయ కుష్టువ్యాధి నివారణా పథకం (నేషనల్ లెప్రసీ ఎరాడికేషన్ ప్రోగ్రాం - ఎన్.ఎల్.ఇ.పి)లో అంతర్భాగంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అంతటా రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో 18 జూలై నుంచి 2 ఆగష్టు వరకూ జరుగుతుంది. ఒక ఎఎన్ఎమ్, ఒక ఆశ (అక్రిడిటెడ్ సోషల్ హెల్త్ ఏక్టివిస్ట్), ఒక మేల్ వాలంటీరూ ఒక బృందంగా, అలా పలు బృందాలు ఏర్పడి గ్రామాలు, పట్టణాలు, నగరాల్లోని ఇంటింటినీ, అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థల వసతి గృహాలనూ సందర్శించి కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తించే సర్వేను సమర్థవంతంగా నిర్వహిస్తారు. గ్రామీణ ప్రాంతాల్లోనైతే ఆశ, మేల్ వాలంటీర్ కలిసి రోజుకు 15-20 ఇళ్ళను, అదే పట్టణ ప్రాంతాల్లోనైతే ఒక్కో బృందానికి 25-30 ఇళ్ళు చొప్పున సర్వే చేసి వ్యక్తుల వ్యాధి లక్షణాలను గుర్తించి నమోదు చేస్తారు. గతంలో ఈ వ్యాధికి చికిత్స పొందిన రోగుల వైకల్యం, పుండు వంటి వివరాలను సేకరించి, వైకల్య నివారణ, వైద్య పునరావాస ప్రయోజనం కోసం ఇంటింటి సర్వే శోధన కార్యకలాపాలను సర్వే సమయంలో టాలీ షీట్‌లో, ప్రత్యేక అనువర్తనంలో ఎఎన్ఎం, ఆశ, మేల్ వాలంటీర్లు నమోదు చేయాలి. సందర్శించిన అన్ని ఇళ్లలో ఏ ఇంటిలో ఐతే వ్యాధి అనుమానితులను గుర్తిస్తారో ఆ ఇంటిపై సుద్ద ముక్కతో రాసి(హౌస్ మార్కింగ్)ను గుర్తించాలి.

ఆశా కార్యకర్తలు స్త్రీలను, మగ వాలంటీర్లు మగ వారిని వారి గోప్యతను కాపాడుతూ బాగా వెలుతురు ఉన్న గదిలోనూ, బహిరంగ ప్రదేశాల్లోనూ పరీక్షిస్తారు. ఈ విధంగా ఆశాలకు ముందుగా కేటాయించిన గృహాలను మొత్తం 14 రోజుల్లోనూ సర్వేను పూర్తి చేస్తారు. ఈ ఎల్.సి.డి.సి. సర్వే బృందాలపై సర్వే సమయంలో ప్రభుత్వ వైద్యుల మార్గదర్శకత్వంలో ఆశాలు అందరూ సందర్శించి, సర్వే చేసిన ఇళ్ళలో ప్రతి రోజూ కనీసం 5 ఇళ్లను గుర్తించి యాదృచ్ఛికంగా ప్రభుత్వ వైద్యులు, సూపర్‌వైజర్లు, మేల్, ఫిమేల్ ఎంపీహెచ్ఎలు, సీహెచ్ఓ, పీహెచ్ఎన్ లు కూడా శోధన బృందంగా సందర్శించి పరిశీలిస్తారు. అంతే కాకుండా అనుబంధ దస్త్రాలను పూరించడం ద్వారా తనిఖీ చేస్తారు. సర్వే పూర్తయిన తర్వాత పురుష వాలంటీర్‌కు గౌరవ వేతనంగా రోజుకు రూ. 75 లను ప్రభుత్వం చెల్లిస్తుంది. ఐతే గతంలో సర్వే చేసిన పురుష వాలంటీర్లకు చెల్లించాల్సిన పారితోషికాలను చెల్లించకుండా ప్రభుత్వం ఎగనామం పెట్టింది. దీంతో ఈ దఫా సర్వేకు వాలంటీర్లు సుముఖంగా లేరు. దీంతో ఆశల ఇంట్లోని స్వంత పురుషులనే వాలంటీర్లుగా నిర్మించుకోవాలని వైద్యులు సూచించారు. ఇస్తామన్న పారితోషికం ఇవ్వనప్పుడు ఎవరైనా ఎందుకు ముందుకు వస్తారో మరి.!?

## మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం అందించిన సిపిఐ ఎంఎల్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి పలివెల వీరబాబు



**సీతానగరం విశ్వం వాయిస్ న్యూస్ :** సీతానగరం మండలం చిన్నకొండేపూడి గ్రామం దళితవాడలో నిరుపేద కుటుంబానికి చెందిన ఒరిగేటి రమేష్ అనే వ్యక్తి ఇటీవల కాలంలో గుండె సంబంధిత వ్యాధితో భాదపడుతూ మరణించడంతో సిపిఐ ఎంఎల్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి పలివెల వీరబాబు మృతుని కుటుంబ సభ్యులకు 5000 రూపాయల ఆర్థిక సాయాన్ని అందించి ధాతృత్వాన్ని చాటుకున్నారు. మృతుని కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని సంతాపాన్ని తెలిపారు. ఈ సందర్భంగా పలివెల వీరబాబు మాట్లాడుతూ పార్టీలకతీతంగా నిరుపేద కుటుంబాలకు ఏ చిన్న ఆపద వచ్చినా, అనారోగ్యంతో, ప్రమాదవశాత్తు స్వర్గస్తులైన వారికి సిపిఐ ఎంఎల్ పార్టీ తగిన ఆర్థిక సహకారాన్ని అందించడం జరుగుతుందని అన్నారు. మృతిని భార్య ఒరిగేటి ఝాన్సీకి ఇద్దరు చిన్న వయసు గల మగ పిల్లలు కలిగి ఉన్నారని ఈ నిరుపేద కుటుంబం ఆర్థిక సహాయం కోసం ఎదురు చూస్తుందనీ సహృదయంతో కలిగిన ప్రతి ఒక్కరూ తోచినంత సహాయం చేయగలరని పిలుపునిచ్చారు. అంకితభావంతో పార్టీలకతీతంగా రమేష్ కుటుంబాన్ని ఆదుకోవాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. కూలి పనిచేసుకొని కుటుంబాన్ని పోషించే రమేష్ ఈ రోజున లేకపోవడం వలన ఆ కుటుంబం రోడ్డున పడిందని పలివెల అన్నారు. రాజానగరం నియోజకవర్గ ఎన్డీఏ కూటమి ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ ఏ పదవి ఆశించకుండానే గతంలో ఇప్పటికే ఎన్నో సేవా కార్యక్రమాలు చేశారని ఇప్పుడు మంచి మనసుతో ఒరిగేటి రమేష్ కుటుంబ సభ్యులను ఆదుకుని పిల్లల భవిష్యత్తు కోసం తగిన ఏర్పాట్లను చేయాలని కోరుతున్నానని వీరబాబు అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ పార్టీ రాజానగరం నియోజకవర్గ మహిళా సభ్యురాలు పలివెల జ్యోతి,సీతానగరం మండల అధ్యక్షుడు సిద్దే నాగరాజు,జిల్లా కమిటీ సభ్యుడు నందమూరి చిట్టి స్వామి,మండల కమిటీ సభ్యుడు సిద్ధే రామకృష్ణ,చిన్న కొండేపూడి గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## కరాటే పోటీల్లో ఎంపిక

**మండపేట ఆశ్రం స్కూల్ విద్యార్థులు ప్రతిభ**



**మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్ :** ఇంటర్నేషనల్ కరాటే టైక్వాండో పోటీలకు ఆశ్రమ్ స్కూలు విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ నెల 21 తేదీన హైదరాబాద్ కోట్ల విజయభాస్కర్ రెడ్డి ఇండోర్ స్టేడియం లో కరాటే గ్రాండ్ మాస్టర్ కన్నన గౌడ్ ఆధ్వర్యంలో ఇంటర్నేషనల్ కరాటే టైక్వాండో కుంగ్ ఫు పోటీలకు మండపేట ఆశ్రమ్ స్కూల్ విద్యార్థులు ఎంపికయ్యారు. సబ్ జూనియర్స్ వెయిట్ కేటగిరి 32 కేజీల విభాగంలో తరుణ్ ప్రకాశ్ రెడ్డి, 34 కేజీల విభాగంలో షేక్ లాల్ సాహిధ్ ఎంపికయ్యారు. 36 కేజీల విభాగంలో కోణాల తేజ రెడ్డి ఎంపియయ్యారు. జూనియర్స్ గర్ల్స్40 విభాగంలో తేతల నేహ శ్రీ రెడ్డి, సీనియర్స్ 60 కేజీల విభాగంలో ద్వారంపూడి జాగృతి , షేక్ ఖలీద్ హుస్సేన్ లు ఎంపికయ్యారు. మదర్ తెరిసా స్పోర్ట్స్ అండ్ సెల్ఫ్ డిఫెన్స్ అకాడమీ ఫౌండర్ టి అబ్బులు ఎంపిక చేసినట్లు ఆశ్రమ్ స్కూల్ ప్రిన్సిపాల్ ఎంట్రు శ్రీ సాయి వీర వెంకట అవినాష్ తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యానికి ఆత్మ రక్షణకు ఎంతగానో ఉపయోగపడే టైక్వాండో కరాటే మార్షల్ ఆర్ట్స్ ను గత సంవత్సరం నుండి ఆ స్కూల్ లో విద్యార్థినులకు ఉపయోగపడే సెల్ఫ్ డిఫెన్స్ టెక్నిక్స్ నేర్పిస్తున్నట్లు తెలిపారు. ఈ మార్షల్ ఆర్ట్స్ ద్వారా ఆరోగ్యానికి ఆత్మరక్షణకు ఉపయోగంతో పాటు స్పోర్ట్స్ క్రీడ రంగాలలో కళాలకు ఎంతో గుర్తింపు ఉందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంట్రు శ్రీ భాస్కర పద్మావతి విద్యార్థులు పాల్గొన్నారు.

## పట్టుదలతో సాధించాలి!



**మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్ :** పట్టుదలతో విజయాన్ని సాధించాలని మండపేట ఛైర్ పర్సన్ పతివాడ నూక దుర్గా రాణి పేర్కొన్నారు. మండపేట పట్టణంలోని ఎరుకల సంక్షేమ సంఘం వైస్ ప్రెసిడెంట్ అమలదాసు రుద్ర మూర్తి ఆధ్వర్యంలో ఏకలవ్య జయంతి వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. స్థానిక 26వ వార్డు లో గల షాదీఖాన వద్ద నిర్వహించిన కార్యక్రమానికి మున్సిపల్ చైర్ పర్సన్ పతివాడ నూక దుర్గారాణి ముఖ్య అతిథిగా హాజర య్యారు. ఏకలవ్యుని చిత్రపటా నికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏకాగ్రతతో విలు విద్యను అభ్యసించి ఆ విద్యలో రాణించిన గొప్ప వ్యక్తి ఏకలవ్యుడని అన్నారు. పట్టుదలతో దేని నైనా సాధించవచ్చనడానికి నిదర్శనం ఏకల వ్యుడు అని అన్నారు. గురుదక్షిణగా తన బొటన వేలు నరికి ఇచ్చి గొప్ప గురుభక్తిని చాటిన వ్యక్తి ఏకలవ్యుడు అని కొనియాడారు. అందరూ ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ అమల దాసు లక్ష్మీ,దాసరి నూకరాజు, సింగం రాంబాబు, మనుపూడి సహదేవుడు, అమలదాసు పోసయ్య, అమలదాసు చిన్నయ్య, అమలదాసు దుర్గాప్రసాద్, ఎరుకుల సంఘం పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## లయన్స్ క్లబ్ నూతన అధ్యక్షులుగా రవణం వేణు గోపాలరావు



**అమలాపురం టౌన్, విశ్వంవాయిస్ న్యూస్ :** డాక్టర్ బి అర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం సర్ సి.వి రామన్ పాఠశాల ప్రాంగణం నందు 2024-25 అమలాపురం లయన్స్ క్లబ్ నూతన అధ్యక్షులు గా లయన్ రవణం వేణు గోపాలరావు కార్యవర్గం ప్రమాణ స్వీకారం కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా జిల్లా రవాణా అధికారి (అర్. టి. ఒ), ఇన్సలేషన్ ఆపిసర్ లయన్ జి . ఎల్.టి కోఆర్డినేటర్ డి . వి.ఎస్ రాజు (రమేష్) విశిష్ట అతిధులగా లయన్ వేలూరి సూర్యనారాయణ, లయన్ డాక్టర్ పి . ఎస్ శర్మ, బి.శ్రీనువాసరెడ్డి హజరూ అయ్యారు . ఈ కార్యవర్గాన్ని లయన్ డి . వి.ఎస్.రాజు ప్రమాణస్వీకారం చెయించారు. . ప్రమాణస్వీకర అనంతరం లయన్ రవణం వేణు గోపాలరావు మాట్లాడుతూ తన పదవి కాలంలో లయన్స్ క్లబ్ ద్వారా పలు సేవా కార్యక్రమాలు నిర్వహించి లయన్స్ క్లబ్ అభ్యున్నతికి కృషి చెస్తానన్నారు. లయన్స్ క్లబ్ కార్యదర్శి గా మద్దెల వెంకటేశ్వరరావు, ట్రెజరర్ గా పొత్తూరి వెంకటపతిరాజు నియమితులైనారు. ఈ కార్యక్రమానికి వ్యాఖ్యాతగా లయన్ గుర్రం రామకృష్ణ వ్యవహరించారు. ఈ కార్యక్రమం అనంతరం లయన్ జంపన వర్మ వందన సమర్పణ చేశారు. అమలాపురం లయన్స్ క్లబ్ సభ్యులు రవణం వేణు మిత్ర బృందం. సర్ సి వి రామన్ సంస్థల ఉద్యోగులు,తదితరులు పాల్గొన్నారు.

## ఎన్.డి.ఏ కూటమి బలపరచిన మా ప్యానెల్‌ను గెలిపించండి

**కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు ఛైర్మన్ అభ్యర్థి చల్లా శంకరరావు అభ్యర్థన**



**రాజమహేంద్రవరం, విశ్వంవాయిస్ న్యూస్ :** ఎన్.డి.ఏ కూటమి బలపరచిన మా ప్యానెల్ కి ఓటు వేసి గెలిపించండి అని ఆర్యాపురం కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు ఛైర్మన్ అభ్యర్థి చల్లా శంకర రావు కోరారు. స్థానిక ప్రెస్ క్లబ్ లో బుధవారం జరిగిన విలేఖరుల సమావేశంలో చల్లా మాట్లాడుతూ నా పదవీ కాలం 5 సంవత్సరాల కాలంలో బ్యాంకు వ్యాపారం 594 కోట్ల నుండి 1030 కోట్లకు పెంచడం జరిగిందని, బ్యాంకు సొంత నిధులు 53 కోట్ల నుండి 86 కోట్లకు పెంచడం జరిగిందని, దాని వల్ల గ్రాస్ లాభాలు 12.68 కోట్ల నుండి 25.10 కోట్లకు, నెట్ లాభాలు 2.24 కోట్ల నుండి 5.30 కోట్లకు పెరగడం జరిగిందని వివరించారు. అలాగే ఆ అయిదు సంవత్సరాలూ మెంబర్లకు డివిడెండు 15% చొప్పున చెల్లించడం జరిగిందన్నారు. మా హయాంలో నిరర్థక ఆస్తులు 7% లోపే ఉండేదని, ఇప్పటి నామినేటెడ్ బోర్డు, సెక్రటరీ ఇంచార్జ్ ల నిర్వాకం వల్ల, 20%కి పైగా ఉన్నందున, ఆర్‌బి ఐ నిబంధనల ప్రకారం, గత 4సంవత్సరాలుగా మెంబర్లకు డివిడెండు యిచ్చే పరిస్థితిల్లో లేదని,మా హయాంలో, ఆర్‌బిఐ రేటింగ్ ఏ గానే వచ్చేదని, ఇప్పుడు సి గ్రేడ్ కు పడిపోయిందని అన్నారు. ఎన్ డి ఏ కూటమి బలపరిచిన మా ప్యానెల్ ని గెలిపించండి. బ్యాంకు ను మళ్ళీ అభివృద్ధి పథంలో నడిపించడానికి, అందరూ మాకు ఓటు వేసి గెలిపించవలసిందిగా కోరారు. గత అయిదేళ్ల కాలంలో,పాలక వర్గం,జగన్ రాష్ట్రాన్ని ఎంతగా భ్రష్టు పట్టించాడో, అంతకు మించిబ్యాంకు ను నిర్వీర్యం చేసేశారని అన్నారు. నాకు ఐదేళ్ల కాలంలో వచ్చిన హానరోరియమ్ ను మొత్తం పేద విద్యార్థుల చదువు కోసం, వైద్య ఖర్చుల నిమిత్తం ఖర్చు చేయడం జరిగిందన్నారు. వైసీపీ ప్రభుత్వం నా పై కక్ష కట్టి, నాపై కావాలని 51ఎంక్వయిరీ వేయించారని, అతి త్వరలోనే, నా నిజాయతీని నిరూపించుకొంటానని అన్నారు. ఆర్యాపురం బ్యాంక్ చల్లా శంకర్రావు ఛైర్మన్ అభ్యర్థిగా అయన ప్యానెల్ లో డైరెక్టర్లుగా పోటీచేస్తున్న సభ్యులను అయన పరిచయం చేసారు.

## కొంతమూరులో దేవి గ్రీన్ మోటార్స్ బ్రాంచి ద్వారా ఈ బైక్స్ రావడం సంతోషం

**దేవి గ్రీన్ మోటార్స్ బ్రాంచి ప్రారంబోత్యవ కార్యక్రమంలో ఎమ్మెల్యే వాసు,గూడా ఛైర్మన్ గన్నికృష్ణ**



**రాజమహేంద్రవరం రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ :** మధ్యతరగతి కుటుంబానికి పెట్రోల్ భారంగా మారిన తరుణంలో ఎస్ ఎస్ ఏ ఎకో మోటార్స్ కంపెనీ బైకులు లభిస్తుండడం కొంతమూరులో దేవి గ్రీన్ మోటార్స్ బ్రాంచి ద్వారా అందించడం అది కూడా వారు 90,000/- రూపాయలకే ఎలక్ట్రిక్ స్కూటీ అందివ్వడం సంతోషంగా ఉందని రాజమహేంద్రవరం అర్బన్ శాసనసభ్యులు ఆదిరెడ్డి శ్రీనివాస్, గూడా మాజీ ఛైర్మన్ గన్ని కృష్ణలు పేర్కొన్నారు. బుధవారం రాజమండ్రి రూరల్ కొంతమూరు,అవుట్ పోలీస్ స్టేషన్ ఎదురుగా దేవి గ్రీన్ మోటార్స్ సేల్స్ షాప్ ప్రారంభమైంది. ఈ షాప్ ను రాజమహేంద్రవరం అర్బన్ శాసనసభ్యులు ఆదిరెడ్డి శ్రీనివాస్, గూడా మాజీ ఛైర్మన్ గన్ని కృష్ణలు రిబ్బన్ కత్తిరించి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్ ఎస్ ఇక మోటార్స్ కంపెనీ బైకులు కొంతమూరులో దేవి గ్రీన్ మోటార్స్ బ్రాంచి అందుబాటులో మన మధ్యకు బ్రాంచి అధినేత పెయ్యల బాల సుబ్రహ్మణ్యం తీసుకురావడం సంతోషంగా ఉందని అన్నారు. సామాన్యులకు తక్కువ ధరలో కాలుష్య రహిత వాహనాలను తీసుకురావడం సంతోషదాయక మన్నారు. దేవి గ్రీన్ మోటార్స్ బ్రాంచి అధినేత పెయ్యల బాల సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ మధ్యతరగతి ప్రజలకు ఈ ఎలక్ట్రికల్ బైక్స్ తక్కువ ధరకు, ఎక్కువ మైలేజితో వాహనాలు లభిస్తున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్యాపురం బ్యాంక్ మాజీ ఛైర్మన్ చల్లా శంకరరావు, సీసీసీ ఛానల్ మేనేజింగ్ పార్ట్ నర్ పంతం కొండలరావు, కొంతమూరు గ్రామ అధ్యక్షులు దండమూడి సత్యసాయి ప్రసాద్, తెలుగు దేశం పార్టీ ఐటీడీపీ యూనిట్ ఇంచార్జి తాడేపల్లి నాగరాజు, 49వ డివిజన్ ఇంచార్జి దుత్తరపు గంగాధర్, పంచాయితి కార్యదర్శి రెడ్డి, కొంతమూరు లయన్స్ క్లబ్ షణ్ముఖ అధ్యక్షులు పామర్తి నాగరాజు, ఉమర్, తెలుగుదేశం పార్టీ నాయకులు రామ్ కిషోర్, బి జె పి నాయకులు యెనుముల రంగబాబు, స్థానిక నాయకులు ప్రసాద్, వి. వీరబాబు, నటరాజ్, శ్రీను, రత్నరాజు, శ్రీహరి, వేమగిరి రాజు, ఉఅంకుల శివ, కంటిపూడి పట్టాభి, సుదీర్, తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ సీతారామ క్షేత్రంలో తొలి ఏకాదశి పర్వదిన పూజలు



మండపేట టౌన్, **విశ్వంవాయిస్ న్యూస్ :** మండపేట సీతారామ క్షేత్రంలో వేంచేసియున్న శ్రీ సీతా రామ చంద్రుల ఆలయంలో తొలిఏకాదశి పూజలు నిర్వహించారు. బుధవారం తొలి ఏకాదశి పర్వదిన సంద ర్భంగా శ్రీసీతారామ చంద్రుల వారికి విశేష పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వరదాచార్యులు ఆధ్వర్యంలో అభిషేకాలు నిర్వహించారు. మల్లిపూడి గణేష్ మల్లిపూడి కొండయ్య కుటుంబ సభ్యుల నేతృత్వంలో భక్తుల గోత్రనామాలతో శ్రీ స్వామివారికి పూజాభిషేకాలు చేసారు. తీర్థ ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు.

## తొలి ఏకాదశి పూజల్లో పాల్గొన్న ఛైర్ పర్సన్ రాణి



మండపేట టౌన్, **విశ్వంవాయిస్ న్యూస్ :** తొలి ఏకాదశి సంద ర్భంగా మండపేట పట్ట ణంలోని ప్రసిద్ధ దేవాల యాలను మున్సిపల్ చైర్ పర్సన్ పతివాడ నూక దుర్గారాణి సందర్శిం చారు. విశేష పూజలు నిర్వహించారు. మండపేట శ్రీ అగస్తేశ్వర జనార్ధన స్వామి రథం ఆలయం లో అర్చనలు అభిషేకాలు నిర్వహించారు. కలువ పువ్వు సెంటర్ వద్ద ఉన్న శ్రీ వేంకటేశ్వర స్వామి వారి ఆలయం లో స్వామి వారిని దర్శించుకున్నారు. అలాగే పలు ఆలయాల్లో ఆమె తొలి ఏకాదశి పూజలు నిర్వహించారు.

## శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఏకాదశి పూజలు

**బారులు తీరిన భక్తులు**



**మండపేట టౌన్, విశ్వంవాయిస్ :** మండపేటలో ప్రసిద్ధి చెందిన శ్రీ వేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో ఆషాఢ మాసం పవిత్ర తొలి ఏకాదశి పర్వదిన సందర్భంగా విశేష పూజలు నిర్వహించారు. స్వామి వారిని దర్శించేందుకు భక్తులు తెల్లవారుజామునే ఆలయానికి చేరుకున్నారు. కేపి రోడ్ లో భక్తులు బారులు తీరి స్వామి వారిని దర్శించుకున్నారు. క్యూ లైన్ లు దాదాపు కిలోమీటరు పొడవు వున్నాయి. ఆలయ అర్చకులు స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. స్వామి వారిని పులతో అలంకరించారు. ఆలయంలో ఆధ్యాత్మిక కార్యక్రమం నిర్వహించారు. భక్తులు కోలాహలంతో కలువ పువ్వు సెంటర్ సందడిగా మారింది.

## విజయ్‌సాయి రెడ్డిపై
# కేసు నమోదు చేయాలి
### ఏపీయుడబ్ల్యూ జె ఫిర్యాదు



**మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్ :** ప్రెస్ మీట్‌లో జర్నలిస్ట్ లపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎంపి విజయ సాయి రెడ్డి పై కేసు నమోదు చేయాలని ఏపీయుడబ్ల్యూ జె మండపేట శాఖ సభ్యులు టౌన్ పోలీస్ స్టేషన్ లో బుదవారం ఫిర్యాదు చేశారు. ఎపి జర్నలిస్ట్ లను దుర్భాషలాడారని ఫిర్యాదులో పేర్కొన్నారు. జర్నలిస్ట్ వృత్తి నీ కించపరిచారని పేర్కొన్నారు. బెదిరించారని పేర్కొన్నారు.దీనిపై కేసు నమోదు చేయాలని కోరుతూ టౌన్ ఎస్ ఐ నాంచరయ్య కు ఫిర్యాదు అందజేశారు. ఈ కార్యమంలో రామచంద్రపురం డివిజన్ ఏపీయుడబ్ల్యూ జె నాయకులు టపా రామకృష్ణ (ఏ సి టి న్యూస్ ఎడిటర్), యార్లగడ్డ ప్రసాద్ (టివి 5),మండపేట నియోజక వర్గ యూనియన్ అధ్యక్షులు సతీష్ ( టివి 9), అప్పారావు( మహాన్యూస్), వినోద్ (ప్రైమ్ న్యూస్) యు ప్రసాద్,(రాజ్ న్యూస్), రాజు,(స్వతంత్ర టివి)సత్య (బిగ్ టీవీ ) యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

## అమలాపురంలో ఏకలవ్య
# జయంతి వేడుకలు



**అమలాపురం టౌన్, విశ్వంవాయిస్ న్యూస్ :** ఏకలవ్య జయంతి వేడుకలు కోనసీమ జిల్లా అమలాపురం పట్నం 27వ వార్డులోని బుధవారం ఏకలవ్య విగ్రహం వద్ద ఘనంగా నిర్వహించుకున్నారు. ఏపీ ఏరుకుల గౌరవ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షులు మద్దెల రామకృష్ణ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బిజెపి కిసాన్ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యులు నల్లా పవన్ కుమార్ హాజరై కేక్ కట్ చేసి. ఏకలవ్య చిత్రపటానికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజనుల, కోయ, లంబాడా కులాల హక్కుల కోసం పోరాడిన వ్యక్తులలో మహోన్నతమైన వారిని అన్నారు. ఈ కార్యక్రమంలో బండి తేజస్విని సేలం ఏడు కొండలు సజ్జ సూరిబాబు శిలం ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## పలువురికి ఎమ్మెల్యే
# వేగుళ్ళ పరామర్శ





**మండపేట టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** మండపేట పట్టణంలో ఇటీవలె మరణించిన పలువురి కుటుంబ సభ్యులను ఈరోజున శాసన సభ్యులు వేగుళ్ళ జోగేశ్వ రరావు పరామర్శించారు. ఇటీవలె మరణించిన 8వ వార్డులో ముమ్మిడివరపు లక్ష్మయ్య, 27వ వార్డులో కొర్లపాటి శ్రీను, ఆకుల లక్ష్మి వార్ల కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే పరామర్శించి వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ పరామర్శలలో ఎమ్మెల్యే వెంట ఎం.డి.కరీం, లంకలపల్లి రాంబాబు, వసాది చాణ్యక్య, జొన్నపల్లి శివ, మందపల్లి చంద్రశేఖర్, ముమ్మిడివరపు నారాయణ, ముమ్మిడివరపు సురేష్, పైడిమళ్ళ సతీష్, తదితర్లు ఉన్నారు.

## నేడు నాటుసారా ఇతర నేరాల్లో
# పట్టుబడిన వాహనాలు వేలం

**ఏలేశ్వరం, విశ్వంవాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లాలో స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో ప్రత్తిపాడు స్టేషన్ పరిధిలో నాటు సారాయి మరియు ఇతర నేరములలో పట్టుబడిన వాహనములు వేలం వేయుటకు డిస్ట్రిక్ట్ స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ అధికారి కాకినాడ వారు తెలియజేశారు. వాటి వివరములను ఈ క్రింద తెలిపిన విధముగా ఉన్నాయి. ద్విచక్ర వాహనాలు - 04 , ది.18.07.2024 స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో కాకినాడ జిల్లా, ప్రత్తిపాడు స్టేషన్ నందు ఉదయం 08.00 గంటలకు వేలంపాట ప్రారంభించబడును వేలంలో పాల్గొనువారు వారి యొక్క ఆధార్ కార్డ్ నకలు తీసుకొని రావలెను అని తెలిపారు. మరియు ధరావత్తు సొమ్మును జమచేసి వేలములో పాల్గొనవలసియున్నది. వేలము నందు వాహనము దక్కించుకున్న వారు పాడిన మొత్తమును వెంటనే అచ్చటనే చెల్లించవలిసి వుంటుంది.

ముఖ్య గమనిక : వేలములో వాహనము దక్కించుకొను వారు 18 శాతము లేదా 12 శాతము జి ఎస్ టి సొమ్మును కూడా జమ చేయవలసి ఉంటుంది అన్నారు. వాహన వివరముల కొరకు సంప్రదించాలిసిన ఫోన్ నెంబర్లు: 9441748547, 9989566535

# ఆంధ్రప్రదేశ్ మహిళలకు శుభవార్త
### ఉచిత బస్ ప్రయాణానికి ఫిక్స్.. టీడీపి జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు పెనుముచ్చి సురేష్



**రాజమహేంద్రవరం, విశ్వంవాయిస్ న్యూస్ :** ఏపీ ప్రభుత్వం మహిళలకు శుభవార్త చెప్పింది ఆగస్టు 15 నుండి మహిళలందరికీ ఆర్టీసీ బస్సు ఉచిత ప్రయాణం కల్పించినట్టు ప్రభుత్వం ప్రకటించింది ఈ మేరకు రాష్ట్ర రెవెన్యూ రిజిస్ట్రేషన్ల మంత్రి అనగాని సత్య ప్రసాద్ అధికారికంగా వెల్లడించారు. ఏపీలో టిడిపి,జనసేన,బిజెపి కూటమి అధికారం వస్తే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తానని హామీ ఇచ్చిన సంగతి తెలిసిందే అలాగే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పేన్షన్లను పెంచుతూ నిర్ణయం తీసుకుంది ఆ తర్వాత సూపర్ ఫిక్స్ పథకాలు అమలు కోసం ప్రయత్నిస్తుంది ఇందులో భాగంగా ఉచిత బస్సు పథకం పై కీలక ప్రకటన వెల్లడించింది.. దీంతో ఎప్పుడు అమల్లోకి వస్తుందా అని ఎదురుచూస్తున్న మహిళలకు రానే వచ్చింది ఇప్పటికే తెలంగాణ కర్ణాటక రాష్ట్రాల్లో ఉచిత బస్సు ప్రయాణం అమల్లో ఉంది,దీంతో ఏపీ అధికారులు ఈ రెండు రాష్ట్రాల్లో పర్యటించే ..పథకం అవుతున్న తీరును పరిశీలించారు ప్రధానంగా జీరో టికెట్ విధానం పై రెండు రాష్ట్రాల్లో అధ్యాయనం చేశారు ఇందులో భాగంగానే రాష్ట్రాల్లో ఉన్న పరిస్థితులు గేట్లకు అనుకూలంగా ఈ పథకాన్ని అమలు చేయాలని అంశంపై అధికారులు ఫోకస్. పెట్టారు ఇప్పటికే ఓ నివేదిక సిద్ధం చేసినట్లు తెలుస్తుంది.

## మీడియాపై అనుచిత వ్యాఖ్యలు చేసిన విజయసాయి రెడ్డిపై
# చట్టపరమైన చర్యలు తీసుకోవాలి



**చింతూరు డివిజన్ విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాపై విశాఖపట్నంలో మీడియా సమావేశంలో జర్నలిస్టులపై చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ... కార్యక్రమం.ఫోర్త్ ఎస్టేట్ గా పిలవబడే జర్నలిస్టును దుర్భాషలాడుతూ దూషించిన విజయసాయి రెడ్డి పై తక్షణమే కేసు నమోదు చేయాలని ,జర్నలిస్టు సంఘాలకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని అధికారులు నాయకులు జర్నలిస్టులపై భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృత్తం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని తక్షణమే విజయసాయి రెడ్డి పై కేసు నమోదు చేయాలని చింతూరు అడిషనల్ ఎస్పీ రాహుల్ మీనా కు ఫిర్యాదు చేశారు. చింతూరు డివిజన్ కేంద్రంలో ప్రధాన రహదారి కూడలి వద్ద ముందుగా నిరసన ర్యాలీ నిర్వహించారు. జర్నలిస్టుల ఐక్యత వర్ధిల్లాలి, జర్నలిస్టులకు రక్షణ కల్పించాలి, విజయసాయి రెడ్డిపై కేసు నమోదు చేయాలి జర్నలిస్టు సంఘాలకు క్షమాపణ చెప్పాలి అంటూ నినాదాలు చేశారు. మీడియాపై అనుచిత వ్యాఖ్యలు గాని, బెదిరించడం గాని దాడులు గాని జరగకుండా కఠినమైన చట్టాలు తీసుకురావాలి అని అన్నారు. ఈ కార్యక్రమంలో చింతూరు మండల చెందిన ప్రింట్ మీడియా రిపోర్టర్లు సీనియర్ పాత్రికేయులు విజయ్, జాని, సత్యనారాయణ, షాజహాన్, చంటి, నరేష్ నరసింహారావు, ఆసీఫ్, రామారావు, పిన్ను ఎలక్ట్రానిక్ మీడియా నుండి శ్రీనివాస చారి, ఈశ్వర చారి, రియాజ్, జీవన్, ఫిరోజ్, సత్య తదితరులు పాల్గొన్నారు.

# పీఎంపీలకు నూతన వైద్య విధానాలపై అవగాహన




**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** గ్రామాల్లో ప్రజల ఆరోగ్య పరిరక్షణలో కీలకమైన పీఎంపీలు నూతన వైద్య విధానాలపై అవగాహన కలిగి ఉండాలని రాజమండ్రి కి చెందిన రాజు న్యూరో-మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ న్యూరో వైద్య నిపుణులు డాక్టర్ బలభద్ర వెంకట రాజు అన్నారు.బుధవారం కమ్యూనిటీ పారామెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్(ది పీఎంపీ అసోసియేషన్) నల్లజర్ల శాఖ ఆధ్వర్యంలో నల్లజర్ల ఏకేఆర్జీ కళాశాల ఆవరణలో వైద్య విజ్ఞాన అవగాహన సదస్సు మండల శాఖ అధ్యక్షులు బి సీతారామ్ అధ్యక్షతన నిర్వహించారు.ఈ సదస్సులో న్యూరాలజిస్ట్ డాక్టర్ బలభద్ర వెంకట రాజు మాట్లాడుతూ నేటి సమాజంలో మానసిక ఒత్తిడి, వ్యాయామం లేకపోవడం, దూమపానం, మద్యపానం,అధిక రక్తపోటు, మధుమేహం వలన మెదడు సంబంధిత వ్యాధులకు గురవుతు న్నారని, ఈ వ్యాధులను ప్రాథమిక స్థాయిలో గుర్తించగల్గితే చికిత్స అందించడం సులభమని,బ్రెయిన్ స్ట్రోక్ లో తొలి మూడు గంటల సమయంలో ఈ గోల్డెన్ హవర్ లో చికిత్స అందించగల్గితే పక్ష వాతం బారిన పడకుండా కాపాడవచ్చని అన్నారు. గ్యాస్ట్రోఎంట రాలజిస్ట్ డాక్టర్ బలభద్ర రఘువీర్ మాట్లాడుతూ జీర్ణాశయ వ్యాధులు, కాలేయ వ్యాధుల గురించి వివరించారు. గ్రామాల్లో ప్రథమ చికిత్సలందించే పీఎంపీలు హెపటైటీస్ బి వ్యాక్సిన్ తప్పనిసరిగా వేసుకోవాలని సూచించారు.కార్డియోలజిస్ట్ డాక్టర్ ఎన్ వినోద్ కుమార్ మాట్లాడుతూ నేటి కాలంలో యువత కూడా హార్ట్ ఎటాక్ లకు గురవ్వడానికి కారణం ఆరోగ్యం పై అశ్రద్ధ,నేటి ఆహారపు అలవాట్లేనని అన్నారు,ప్రతి ఒక్కరూ మెడికల్ హెల్త్ చెకప్ చేయించుకోవడం ద్వారా ముందుగానే వ్యాధులను గుర్తించినట్లు అవుతుందని అన్నారు.రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీబీటీ రాజు మాట్లాడుతూ ప్రజలకు క్యాన్సర్ పై మన అసోసియేషన్ ద్వారా రాష్ట్ర స్థాయిలో నిర్వహించే అవగాహన కార్యక్రమాలలో మన పీఎంపీలు తప్పనిసరి గా పాల్గొనాలని అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు బళ్ళా శ్రీనివాసరావు, జిల్లా కోశాధికారి పీ చిన్ని, ఏలూరు జిల్లా కోశాధికారి ఎమ్ ధర్మేంద్ర,మండల కార్యదర్శి ఏ ధనుంజయ రావు, కోశాధికారి వెంకటరమణ మూర్తి, దేవరపల్లి ప్రతినిధులు ఎమ్ వెంకటరావు, డి సత్య భాస్కర్,నాగేశ్వరరావు లతో పాటు సభ్యులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. అనంతరం వైద్యనిపుణులను సభ్యులు ఘనంగా సత్కరించారు.

## విశ్రాంత ఉద్యోగుల సంఘం
# కార్యాలయ భవనం నిర్మాణమే ధ్యేయం



- విశ్రాంత ఉద్యోగుల రాజమండ్రి నగర కమిటీ అధ్యక్షుడుగా కేకే సంజీవరావు ప్రమాణ స్వీకారం
- ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం 49వ వార్షిక సర్వసభ్య సమావేశం
- విశ్రాంత ఉద్యోగుల రాజమండ్రి నగర నూతన కమిటీ ప్రమాణ స్వీకారోత్సవం
- విశ్రాంతి ఉద్యోగుల భవన నిర్మాణానికి తన వంతు లక్ష రూపాయలు విరాళం ప్రకటించిన డా. కే.కే సంజీవరావు వెల్లడి

**రాజమహేంద్రవరం, విశ్వంవాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం ప్రతిష్టానికి కృషి చేయాలని విశ్రాంత ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం రాజమండ్రి ప్రకాష్ నగర్ లోని ధర్మం చర కమిటీ హాల్ లో విశ్రాంతి ఉద్యోగుల 49 వ వార్షిక సర్వసభ్య సమావేశం కే.జి.కే మూర్తి అధ్యక్షతన, రాజమండ్రి శాఖ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా విశ్రాంత ఉద్యోగుల రాజమండ్రి నగర నూతన కమిటీ ప్రమాణ స్వీకారోత్సవం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు వెంకటేశ్వర్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజమండ్రి నగరంలో సుమారు 6 వేల మంది వరకు పెన్షనర్స్ ఉన్నారని తెలిపారు. ప్రస్తుతం సంఘాలు 3100 మంది చేరారని తెలిపారు. సంఘ సభ్యులు సంఖ్య కనీసం నాలుగు నుంచి ఐదు వేల మంది వరకు చేర్చుకునేలా నూతన కార్యవర్గం కృషి చేయాలని సూచించారు. జిల్లాలో పెన్షనర్స్ హోం లేదని స్థలం గుర్తించి పెన్షనర్స్ హోం నిర్మాణానికి కృషి చేయాలని అన్నారు. అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభుదాస్ మాట్లాడుతూ పెన్షనర్స్ గత ప్రభుత్వం లో నష్టపోయారని అన్నారు. నష్టపోయిన వాటిని తిరిగి సంపాదించేందుకు సంఘ సభ్యులు కృషి చేయాలన్నారు. నూతన ప్రభుత్వం పై ఎన్నో ఆశలు ఉన్నాయని అయితే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పెన్షనర్స్ అసోసియేషన్ సమస్యలు పూర్తిగా తెలుసని వాటిని స్టడీ చేసి పరిష్కరించే సత్తా ఉన్న నాయకుడు చంద్రబాబు అని తెలిపారు. విశ్రాంత ఉద్యోగుల రాజమండ్రి నగర కమిటీ అధ్యక్షుడు కేకే సంజీవరావు మాట్లాడుతూ నూతన కార్యవర్గం జేపీసీ కమిటీ విశ్రాంత ఉద్యోగుల సంఘం భవన నిర్మాణానికి కృషి చేస్తామని తెలిపారు. పెన్షనర్స్ అసోసియేషన్ కు భవనం లేదని గతంలో పనిచేసిన కలెక్టర్ దృష్టికి తీసుకు వెళ్ళమని ఆమె వెంటనే ట్రెజరీ కార్యాలయం వద్ద 166 గజాల స్థలాన్ని కేటాయించారని తెలిపారు. ఈ స్థలం కేటాయింపులో రాజమండ్రి మున్సిపల్ కమిషనర్ దినేష్ కుమార్ కృషి కూడా ఉందని వివరించారు. రాబోయే రోజులలో ప్రభుత్వం కేటాయించిన స్థలంలో కోటి రూపాయల వ్యయంతో మూడు అంతస్తుల భవనాన్ని నిర్మించేందుకు కృషి చేస్తామని అన్నారు. సంఘాల కృషి వల్ల అనేక రాయితీలు పొందామని రాజమండ్రిలో నిర్మించబోయే విశ్రాంత ఉద్యోగుల సంఘం భవన నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.విశ్రాంతి ఉద్యోగుల సంఘం భవన నిర్మాణానికి తన వంతు లక్ష రూపాయలు విరాళం ప్రకటించారు. ఈ భవన నిర్మాణానికి విరాళాలు ప్రకటించిన వారి కి సముచిత స్థానం కల్పిస్తామని తెలిపారు. రూ 2 లక్షలు, 1, లక్ష, 50వేలు, రూ 25 వేలు ప్రకటించిన వారి భార్యాభర్తల ఫోటోలు భవనంలో ఉంచుతామని అన్నారు. అలాగే రూ10 వేలు, రూ 5 వేలు విరాళాలు ప్రకటించిన దాతల పేర్లను శిలాఫలకంపై వేస్తామని తెలిపారు. దాతలు ముందుకు వచ్చి తమకు తోచిన విరాళం ప్రకటించాలని కోరారు. సంఘం కార్యదర్శి గెద్దాడ హరిబాబు మాట్లాడుతూ తాను గతంలో ఎన్జీవో హోం అధ్యక్షుడిగా ఉన్న సమయంలో ఎన్జీవో హోం భవన నిర్మాణానికి కృషి చేశానని అదే మాదిరి ఉత్సాహంతో విశ్రాంత ఉద్యోగుల నూతన భవనం నిర్మాణానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ భవన నిర్మాణానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం కోశాధికారి టి.ఐ.ఎస్. ఎస్. ఆర్. ఏ. శర్మ, రాష్ట్ర ఉపాధ్యక్షులు సిహెచ్ మల్లికార్జున భాను, దాట్ల బుచ్చి వెంకటపతి రాజు, ఎన్. సత్యనారాయణ, కె .పూజా విహారి, వై వి ఎస్ సుబ్బారావు, ఎన్ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## సత్యదేవుని ఆలయంలో
# తొలి ఏకాదశి వేడుకలు



**ఏలేశ్వరం, విశ్వంవాయిస్ న్యూస్ :** ఏలేరు నది ఒడ్డు వద్ద వేయించేసి ఉన్న అన్నవరం అనుబంధ ఆలయం శ్రీ అనంత లక్ష్మి సమేత శ్రీ సత్యనారాయణ స్వామి వారి ఆలయ ప్రాంగణంలో విశ్వహిందూ పరిషత్ మాతృ శక్తి, దుర్గ వాహిని సభ్యులు తొలి ఏకాదశి సందర్భంగా విష్ణు లక్ష సహస్ర నామార్చన,తదనంతరం భక్తి గీతాలాపన అత్యంత భక్తి శ్రద్ధలతో ఆలపించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్ష, కార్యదర్శి లు పి మల్లేశ్వరి, ఎం ఎస్ కుమారి, ఇందిరా, గిరిజ కుమారి మాట్లాడుతూ సమాజంలో భక్తి భావన పెంపొందించేందుకు విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో కృషి చేస్తున్నామన్నారు. అనంతరం ఆ సంఘం సభ్యులు అయిన మహాలక్ష్మి దంపతులు స్వామి వారికీ వింజమరా వి హెచ్. పి. తరపున సమర్పించారు. ఈ కార్యక్రమం లో మాతృ శక్తి అధ్యక్షులు సి. మల్లేశ్వరి., దుర్గా వాహిని అధ్యక్షులు ఏం. ఎస్. కుమారి, కార్యదర్సులు ఇందిర, గిరిజ కుమారి,మంగమని, సత్య వాణి, ఆర్. వర లక్ష్మి, బేబీ,రమణమ్మ లు భక్తి గీతాలు ఆలపించారు.ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ కార్యదర్శి కటకం కిరిటి,అలమండ దుర్గా వెంకట ప్రసాద్. టీ గురయ్యా తదితరులు విహెచ్పి సభ్యులను అభినందించిన వారిలో ఉన్నారు.

## ఎమ్మెల్యే ఆదేశాలతో రోడ్డు మరమ్మత్తు పనులను చేయిస్తున్న
# మండల కన్వీనర్ విజయ శంకర్



**సీతానగరం, విశ్వంవాయిస్ న్యూస్:** తూర్పుగోదావరి జిల్లా సీతానగరం నుండి పురుషోత్త పట్నం గ్రామం వెళ్లాలంటే ప్రజలు పడుతున్న ఇబ్బందులను రాజానగరం నియోజకవర్గ ఎన్డీఏ కూటమి ఎమ్మెల్యే బత్తుల బలరా మకృష్ణ దృష్టిలో పెట్టడంతో తక్షణమే స్పందించి పోలవరం ప్రాజెక్ట్ పనులను నిరహిస్తున్న మెగా సంస్థ సహకారంతో రోడ్డు పనులను పూర్తి చేయడం జరుగుతుందని సీతానగరం మండల జనసేనా పార్టీ కన్వీనర్ కారిచర్ల విజయశంకర్ విలేకరులకు తెలిపారు. గత వైకాపా ప్రభుత్వం నిర్లక్ష్యం వల్లనే రోడ్డు అస్తవ్యస్తంగా తయారైందని ఆయన అన్నారు. వాహనదారులు ఇబ్బందులు పడకుండా పెద్ద పెద్ద గుంతలను పూడ్చి చిప్స్ వేయిస్తున్నామని రహదారి రోడ్డు మార్గాన్ని పార్టీ నాయకుల పర్యవేక్షణలో జరుగుతుందని కారిచర్ల అన్నారు. అతి తక్కువ కాలంలోనే ఈ రోడ్డు రహదారి పనులు పూర్తిస్థాయిలో ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణతోనే సాధ్యమవుతుందని విజయ శంకర్ విలేకరులకు తెలిపారు.

## కూటమి అభ్యర్థులను
# బలపరుద్దాం గెలిపిద్దాం
### రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ



**రాజానగరం, విశ్వం వాయిస్ న్యూస్**

ఈ నెల 20న జరగబోయే ది ఆర్యాపురం కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు పాలకవర్గం ఎన్నికలలో భాగంగా నేడు రాజానగరం మండలం దివాన్ చెరువు గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని తెలుగుదేశం జనసేన బీజేపీ పార్టీల కూటమి తరపున చైర్మన్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న చల్లా శంకర్రావుని, దివాన్ చెరువు బ్రాంచ్ డైరెక్టర్ అభ్యర్థిగా నీలపాల సూర్య సత్యనారాయణ (పండు)ని అఖండ మెజారిటీతో గెలిపించాలని రాజానగరం నియోజకవర్గం శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ కోరారు. ఈ కార్యక్రమంలో రాజానగరం నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ బొడ్డు వెంకటరమణచౌదరీ, జనసేన పార్టీ నాయకులు వై. శ్రీను ,ఎన్ డి ఎ కూటమి నాయకులు, కార్యకర్తలు భారీగా పాల్గొన్నారు.

## అధికారులు నరసన్న ఆలయం
# అభివృద్ధికి చర్యలు చేపట్టాలి
### కోరుకొండను పర్యాటకంగా అభివృద్ధి చేయాలి



**కోరుకొండ, విశ్వంవాయిస్ న్యూస్ :** కోరుకున్న కోరికలు తీర్చే కోరుకొండ శ్రీ లక్ష్మీ నరసింహస్వామి కేంద్రంలోను రాష్ట్రంలో డబల్ ఇంజన్ సర్కార్ అధికారం రావాలని కోరుకున్న తన కోరిక నెరవేర్చినందుకు శ్రీ లక్ష్మీ నరసింహ స్వామికి ఎన్డీఏ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి తన మ్రొక్కు చెల్లించుకున్నట్లు భారతీయ జనతా పార్టీ రాజానగరం నియోజకవర్గ కన్వీనర్ నీరుకొండ వీరన్న చౌదరి తెలిపారు. బుధవారం నరసన్న దర్శనం అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అధికారులు ప్రజాప్రతినిధులు నరసన్న ఆలయ అభివృద్ధికి తక్షణ చర్యలు చేపట్టాలన్నారు. వర్షాకాలంలో కొండపైన ఆలయంలోకి వర్షం నీరు రావడంతో భక్తుల మనోభావాలు దెబ్బతింటున్నాయన్నారు. అదేవిధంగా పర్యాటకశాఖ మాత్యులు, అన్నవరం దేవస్థానం అధికారులు కోరుకొండ నరసన్న క్షేత్రాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్ది నరసన్న ఖ్యాతిని మరింత ఇనుముడింపజేయాలన్నారు. తాను ఆలయ అభివృద్ధికి శక్తివంతన్న మేరకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో భాజపా, జనసేన, తెదేపా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# కాకినాడ జిల్లా ఎస్పీగా విక్రాంత్ పాటిల్

## మహిళా సమస్యలపై అధిక ప్రాధాన్యత



**కాకినాడసిటీ, విశ్వంవాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లా పోలీస్ అధికారిగా విక్రాంత్ పాటిల్ నియతులయ్యారు. ఈ మేరకు పాటిల్ బుధవారం కాకినాడలోని జిల్లా పోలీసు కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. అనంతరం విలేకరులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ విక్రాంత్ పాటిల్ మాట్లాడుతూ తాను ఎస్పీగా పార్వతీపురం మన్యం జిల్లా నుంచి బదిలీపై కాకినాడకు వచ్చానన్నారు. మహిళల సమస్యలను తన దృష్టికి వస్తే వాటిని పరిష్కరించేందుకు తన వంతు ప్రయత్నం చేస్తానన్నారు. అలాగే బెట్టింగులు అక్రమాలకు పాల్పడితే సహించేది లేదంటూ హెచ్చరించారు. కాకినాడ జిల్లా ప్రజల నుంచి పోలీసులకు ఎటువంటి సలహాలు ఇచ్చిన వాటిలో మెండుగా ఉంటే స్వీకరిస్తామని చెప్పారు. కింది స్థాయి సిబ్బంది నిరంతరం ప్రజారక్షణ గురించి పని చేయాలని సూచించారు. డ్రగ్స్, గంజాయి వంటి వాటిని అరికట్టడానికి ప్రజలు సహకరించాలని ఎస్పి విక్రాంత్ కోరారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు ఎస్పి ఎంవి భాస్కరరావు, ఏఆర్ డిఎస్పి సత్యనారాయణ, ఎస్ఇబి శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

### పార్లమెంటు వంటి చట్టసభల్లో విజయసాయి రెడ్డి లాంటి

# వ్యక్తి కూర్చోవడానికి అనర్హుడు



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట జర్నలిస్టులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన విజయసాయిరెడ్డి పై చర్యలు తీసుకోవాలంటూ నిరసన పోలీసులకు ఫిర్యాదు సంఘీభావం తెలిపిన పలు పార్టీల నాయకులు పలువురు జర్నలిస్టులు కొత్తపేట పంచాయతీ కార్యాలయం వద్ద నుండి పోలీస్ స్టేషన్ వరకు మీడియాపై అనుచిత వ్యాఖ్యలు చేసిన రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి పై చర్యలు తీసుకోవాలంటూ నినాదాలు చేస్తూ కొత్తపేట పోలీస్ స్టేషన్ వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు అనంతరం విజయసాయి రెడ్డి పై చర్యలు తీసుకోవాలని కొత్తపేట పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు ఈ సందర్భంగా సీనియర్ జర్నలిస్ట్ ముత్యాల బాబ్జి మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో మీడియా పాత్ర ఎంతో కీలకం ప్రభుత్వ వ్యవస్థ న్యాయవ్యవస్థ కార్యనిర్వాహక వ్యవస్థ తో పాటు మీడియా వ్యవస్థ నాలుగు స్తంభంగా ఏర్పడి ప్రజాస్వామ్య పరిరక్షణలో ముందుంటుంది అటువంటి మీడియా వ్యవస్థ అందులో పని చేసే జర్నలిస్టులు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.పలు సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంలో వాటి పరిష్కారంలో మీడియా పాత్ర ఎనలేనిది స్వాతంత్రం రాకముందు వచ్చిన తర్వాత ఈ భారతదేశ ప్రగతిలో మీడియా పాత్ర అద్భుతం అటువంటి మీడియా వ్యవస్థపై వ్యక్తిగతంగా తమకు ఏదో నష్టం జరిగిందని వ్యక్తిగత కక్షలతో కొంతమంది రాజకీయ నాయకులు వ్యవస్థలను జర్నలిస్టులను దూషించడం పరిపాటిగా మారింది ప్రత్యేకంగా ఒక వార్త ఎవరైనా ఇస్తే దానిలో విషయాలను ప్రచురించడం లేదా ఎలక్ట్రానిక్ మీడియా ద్వారా ప్రజలకు చేరవేయడం మీడియా బాధ్యత ఆ బాధ్యత నిర్వహణలో వారు వెళుతుంటే దాన్ని వ్యక్తిగతంగా తీసుకుని తను చేసిన పనికి వారే బాధ్యులంటూ మీడియా సంస్థలపై ప్రతినిధులపై రాజ్యసభ సభ్యులు విజయసాయిరెడ్డి దూషించడం కోట్లాదిమంది తెలుగు ప్రజలు టీవీ చానల్స్ ద్వారా చూస్తున్నారని ఇటువంటి నీతి బాహ్యమైన చర్యలను ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరూ ఖండించాలని మీడియాపట్ల విజయసాయిరెడ్డి వ్యవహరించిన తీరు రాజ్యసభ సభ్యత్వానికి భంగం కలిగించే విధంగా ఉందని విజయసాయి రెడ్డి లాంటి వ్యక్తి పార్లమెంటు వంటి చట్టసభల్లో కూర్చోవడానికి అనర్హుడని రాజ్యసభ సభ్యుడు విజయసాయి రెడ్డి పై ప్రభుత్వం తను ఉన్న రాజకీయ పార్టీ చర్యలు తీసుకోవాలని పార్టీ నుంచి బహిష్కరించడం కాకుండా రాజ్యసభ సభ్యత్వాన్ని కూడా రద్దు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులతో పాటు రాజకీయ నాయకులు ప్రజా సంఘ నాయకులు పాల్గొన్నారు.

### నియోజకవర్గ వైసిపి నేత మాత్రం ఎదుటివారిపై

# బురద జల్లడమే పనిగా పెట్టుకున్నారు

## ముత్యాల బాబ్జి జిల్లా టీడీపీ అధికార ప్రతినిధి



**కొత్తపేట, విశ్వంవాయిస్ న్యూస్ :** దోపిడీలకు అడ్డుకట్ట పడిందని దోపిడీదారులు గగ్గోలు పెడుతున్నారు ప్రజా సమస్యలను ఏనాడు పట్టించుకోని మాజీ ఎమ్మెల్యే కి ఒక్కసారిగా సమస్యలన్నీ గుర్తుకొచ్చేస్తున్నాయి రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 34 రోజులు అయినది రాష్ట్రంలో ప్రతి చోట వైసీపీ నేతలు దోపిడీకి ప్రభుత్వం అడ్డుకట్టేవేస్తుంది ఒక్కొక్కటిగా ప్రజా సమస్యలను పరిష్కరిస్తూ ముందుకెళ్తోంది రాష్ట్రాన్ని అస్తవ్యస్తత్వం చేసిన జగన్మోహన్ రెడ్డి పాలనలో అవినీతి,అరాచకాలను ప్రజల ముందుకు శ్వేతపత్రం రూపంలో ప్రభుత్వం విడుదల చేయడాన్ని వైసిపి నేతలు తట్టుకోలేక పోతున్నారు. పెంచిన పెన్షన్ తో పాటు మాటిచ్చిన మేరకు మూడు నెలల పెంచిన సొమ్మును ఒకేసారి ఇచ్చి ఈ ప్రభుత్వం సత్తా చాటుకుంది టెట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. రైతు భరోసా, రైతులకు రబీ సీజన్లో ధాన్యం డబ్బులు,తల్లికి వందనం,నిరుద్యోగ భృతి, ఉద్యోగాలు కల్పన,ఉచిత సిలిండర్లు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకాలన్నీ ఒక్కొక్కటిగా ప్రభుత్వం నెరవేర్చడానికి చర్యలు చేపడుతుండటంతో తట్టుకోలేక దమ్ము ధైర్యాల గురించి వైసిపి నేతలు మాట్లాడుతున్నారు. అభివృద్ధి చేసి సంపద సృష్టించి సంక్షేమాన్ని ప్రజలకు అందించడానికి చంద్రబాబు నాయుడు పని చేస్తున్నారు ఆయన సత్తాను గుర్తించే రాష్ట్ర ప్రజలు చరిత్రలో ఎన్నడూ లేని విధంగా కూటమికి విజయాన్ని చేకూర్చారు. కొత్తపేట నియోజకవర్గంలో ఇసుక గుట్టలును కొండలుగా పేర్చి నోట్ల కట్టలుగా మార్చుకుని, అవినీతి సొమ్ముతో మేడలు కట్టిన నేతలకు,ఒక్కసారిగా తమ అక్రమ సంపాదన ఆగిపోవ డంతో అవినీతి, అవినీతి అంటూ గగ్గోలు పెడుతున్నారు నియోజకవర్గంలో ఎక్కడికక్కడ నిల్వ చేసిన ఇసుక గుట్టలు ఎవరివి ముందుగా మాజీ ఎమ్మెల్యే స్పష్టం చేయాలి అవి అక్రమమా,సక్రమమా అన్నది ప్రభుత్వ అధికారులు తేల్చాలి. ప్రభుత్వం ఉచిత ఇసుక విధానాన్ని అమల్లోకి తెస్తుండడంతో ఇసుకాసురులు ఆందోళన చెందుతున్నారు రీచ్లు ప్రారంభించలేదు గుట్టలుగా నిలువ చేసిన ఇసుకను ప్రభుత్వం నిర్ణయించిన ధరకే విక్రయిస్తుంటే తట్టుకోలేక అనవసర ఆరోపణలు చేస్తున్నారు దోపిడీదారులకు తమ కళ్ళ ఎదుట జరుగుతుంది అంతా దోపిడీగానే కనిపిస్తుండటం సహజం.వారు చేసిన దోపిడీ విధానాల్ని ఇతరులకు అన్వయిస్తూ వారి బుద్ధిని బయట పెట్టుకుంటున్నారు. మాయమాటలతో ఐదేళ్లు పబ్బం గడుపుకున్న ఇసుకాసురులు అవినీతి, అవినీతి అంటూ ఆక్రోసిస్తున్నారు. ఓటమి కొందరికి గుణపాఠం నేర్పుతుంది లోపాలను సవరించుకునే అవకాశం ఇస్తుంది నియోజకవర్గ వైసిపి నేత మాత్రం ఎదుటివారిపై బురద జల్లడమే పనిగా పెట్టుకున్నారు అని ఆయన అన్నారు.

### దళితులను రాజకీయంగా ప్రోత్సహించింది

# తెలుగుదేశం పార్టీ

## జిల్లా తెలుగుదేశం పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షులు పెనుముచ్చి సురేష్



**రాజమహేంద్రవరం, విశ్వంవాయిస్ న్యూస్:** తెలుగుదేశం పార్టీ ప్రభుత్వ హయాంలో దళితుల సంక్షేమం కోసం ఎన్నో పథకాలు ప్రవేశపెట్టి జీవన ప్రమాణాలు మెరుగుపరచడమే కాకుండా రాజకీయ ప్రాధాన్యతను కల్పించి ప్రోత్సహించిందని జిల్లా తెలుగుదేశం పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షులు పెనుముచ్చి సురేష్ అన్నారు. జస్టిస్ పున్నయ్య కమిషన్ సిఫార్సులకనుగుణంగా 18 జీవోలు విడుదల చేసిన ఘనత చంద్రబాబుదని తెలిపారు. రాజకీయంగా ప్రాముఖ్యత కలిగిన రాజమహేంద్రవరం నియోజకవర్గం లో కూడా తెలుగుదేశం పార్టీ అనేకమంది దళిత నాయకులకు కీలకమైన రాజకీయ పదవులనిచ్చిందని గుర్తు చేశారు. ప్రస్తుతం జరుగుతున్న ఆర్యాపురం కోపరేటివ్ బ్యాంక్ ఎన్నికల తరువాత ఎస్.సి సామాజిక వర్గానికి చెందిన నాయకులకు కో ఆప్షన్ సభ్యులుగా నియమించేందుకు కూటమి పార్టీల నాయకులంతా ముందుగానే నిర్ణయించారన్నారు.ప్యానెల్ లో ఎస్సీ అభ్యర్థులు లేనంత మాత్రాన ఎస్సీలకు ప్రాధాన్యత ఇవ్వలేదనే ఆరోపణల్లో వాస్తవం లేదని ఖండించారు. జగన్ ప్రభుత్వంలో ఎమ్మెల్సీ అనంతబాబు దళిత యువకుడు సుబ్రహ్మణ్యం ను దారుణంగా చంపి డెలివరీ చేస్తే వైసిపి దళిత నాయకులెవరు నోరు మెదపలేదని విమర్శించారు. ఎస్సీ కార్పొరేషన్ నిర్వీర్యం చేసి 27 దళిత పథకాలను రద్దు చేసిన వైసీపీ పాలనలో దళితులను కేవలం తోలుబొమ్మలను చేసి జగన్ ఆడించారని మండిపడ్డారు. ప్రజలు ఎన్నుకున్న కూటమి ప్రభుత్వంలో ఖచ్చితంగా దళితులకు రాజకీయ సామాజిక ప్రాధాన్యత లభిస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

### బీసీల అభ్యున్నతికి

# కృషి చేయాలి

## మంత్రి సవితమ్మ ను మర్యాద పూర్వకంగా కలసిన "పిల్లి" దంపతులు



**కాకినాడ రూరల్, విశ్వంవాయిస్ న్యూస్ :** రాష్ట్ర బీసీ సంక్షేమ,ఆర్థికంగా వెనుకబడిన వర్గాల సంక్షేమం,చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్. సవితమ్మ ను మంగళగిరి లోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయం లో కాకినాడ రూరల్ నియోజక వర్గ కో ఆర్డినేటర్,టీడీపి రాష్ట్ర కార్యదర్శి పిల్లి సత్యనారాయణ మూర్తి,మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంత లక్ష్మి దంపతులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందించి దుశాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ..దేశంలో ఎక్కడా లేని విధంగా బీసీలను గుర్తించి మంత్రి పదవులు, చట్టసభల్లో ప్రాధాన్యత కల్పించిన ఏకైక పార్టీ తెలుగుదేశం పార్టీ అని,బీసీలకు అధిక ప్రాధాన్యతనిచ్చి బీసీల అభ్యున్నతికి కృషి చేయాలని మంత్రి సవితమ్మను పిల్లి దంపతులు కోరారు. ఈ సందర్భంగా బీసీ లు ఎదుర్కొంటున్న పలు సమస్యలను ఆమె దృష్టికి తీసుకెళ్ళారు.మంత్రి సవితమ్మ ను కలిసిన వారిలో పెరికి సాధికార సమితి జిల్లా కన్వీనర్ కొమిరిశెట్టి నరసింగరావు, తెలుగుదేశం పార్టీ అరట్లకట్ట గ్రామ కమిటీ అధ్యక్షులు కంటే సత్యనారాయణ (సత్తిబాబు) , రెడ్డి రూపేష్ కుమార్ తదితరులు ఉన్నారు.

### సాయి రెడ్డి అభ్యంతరకర వ్యాఖ్యల పట్ల

# జర్నలిస్ట్‌ల నిరసన



**కాకినాడ కలెక్టరేట్, విశ్వంవాయిస్ న్యూస్ :** రాజ్యసభ సభ్యుడు విజయసాయి రెడ్డి అలియాస్ వీసా రెడ్డి జర్నలిస్టులను అసభ్య పదజాలంతో దూషించడాన్ని ఖండిస్తూ కాకినాడ జర్నలిస్టులు కాకినాడ జిల్లా కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు.ఈ సందర్భంగా పలువురు సీనియర్ పాత్రికేయులు మాట్లాడుతూ విజయసాయిరెడ్డిపై వచ్చిన ఆరోపణలపై వివరణ ఇచ్చేందుకు ప్రెస్ మీట్ ఏర్పాటుచేసి అందులో విజయసాయి రెడ్డి మాట్లాడిన తీరు తీవ్ర అభ్యంతరకర మన్నారు. మీడియా ప్రతినిధులను అసభ్య పదజాలంతో దూషించడాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. తక్షణమే మీడియా యాజమాన్యానికి,ప్రతినిధులకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.లేనిచో రాసలీలల రెడ్డిని ఉతికి ఆరేస్తామని హెచ్చరించారు. ఖబడ్దార్ వీసా రెడ్డి...ఖబడ్దార్ ఖబడ్దార్ అంటూ నినాదాలు చేశారు.ఈ కార్యక్రమంలో సీనియర్ పాత్రికేయులు స్వాతి ప్రసాద్,నవీన్ రాజ్, కృష్ణం రాజు, దుర్గారావు, రాజేష్ వర్మ,మహా టివి ప్రతినిధులు, ప్రింట్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

### ప్రజా సమస్యల పరిష్కారమే

# ధ్యేయంగా పని చేస్తా



**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్:** రాజానగరం నియోజకవర్గంలో ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులతో చర్చించి సమస్యలు పరిష్కారమే ధ్యేయంగా పని చేస్తానని రాజానగరం శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ అన్నారు. బుధవారం రాజానగరం శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ కోరుకొండ తన కార్యాలయంలో వివిధ గ్రామాల నుంచి విచ్చేసిన ప్రజా సమస్యలను తెలుసుకొని వాటి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కోరుకొండ మండలం కాపవరం గణేష్ నగర్ లోని సమస్యలను సిపిఐ (ఎంఎల్) నాయకులు ప్రదీప్ నాయుడు ఆధ్వర్యంలో శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణకు సమస్యల వినతిపత్రం అందజేస్తారు. గణేష్ నగర్ కు సరైన రోడ్ లేక చాలా ఇబ్బందులు పడుతున్నామని, గత తెదేపా హయాంలో శంకుస్థాపన చేసిన రోడ్డును వైసిపి ప్రభుత్వం నిలిపివేసిందని రోడ్డు పునరుద్ధరణతో పాటు మంచినీటి వసతి, ఆర్టీసీ స్టాప్ ఏర్పాటు చేయాలన్నారు. నియోజకవర్గం నుండి ప్రజలు పెద్ద ఎత్తున వచ్చి పలు వినతులు అందజేశారు. కార్యక్రమంలో ఎన్డీఏ నాయకులు, పలు గ్రామా ప్రజలు పాల్గొన్నారు.

### జనసేన పార్టీ కార్యకర్తలకు అన్ని విధాల,

# అన్ని వేళలా అందుబాటులో ఉంటా

## సిటీ ప్రెసిడెంట్ తోట సుధీర్



**కాకినాడసిటీ, విశ్వంవాయిస్ న్యూస్ :** జనసేన పార్టీ సిటీ ప్రెసిడెంట్ తోట సుధీర్ జన్మదిన వేడుకలు ఆయన నివాసంలో విశాల మైన ప్రదేశం లో అత్యంత కోలాహలంగా నిర్వహించ్చారు. నగరానికి చెందిన 50 డివిజన్ ల నుండి జనసేన పార్టీ వార్డు ఇన్ చార్జులు, కార్యకర్తలు, అభిమానులు వేల సంఖ్యలో తరలి వచ్చి ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.భారీ ఎత్తున గజమాలలు, పుష్ప గుచ్చాలు, శాలువాలు కప్పి తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా జనసేన పార్టీ సిటీ అధ్యక్షులు తోట సుధీర్ మాట్లాడుతూ క్రమశిక్షణకు, అంకిత భావానికి, సిద్ధాంత పరమైన పోరాటానికి ముందుకు వచ్చిన జనసేన పార్టీ కార్యకర్తలకు అన్ని వేళలా అందుబాటులో ఉంటూ నమ్ముకున్న పార్టీ కోసం శ్రమించి కష్టపడుతున్న వారందరికి ప్రాధాన్యతానుసారం పదవులు చేపట్టే విధంగా కృషి చేస్తానని అన్నారు.ప్రతీ కార్యకర్త ఆర్థికంగా ఎదిగేందుకు తనవంతు సహకారం అందిస్తానని తెలిపారు. జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ అందించిన ఈ గుర్తుంపు కారణంగానే తనకు ఇన్నివేల మంది అభిమానాన్ని సంపాదించడానికి అవకాశం కలిగిందన్నారు.తన పై ఇంతటి అభిమానం చూపిస్తున్న ప్రతీ కార్యకర్తకి, నాయకులకు, అభిమానులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమం లో జన సేన పార్టీ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రధాన కార్యదర్శి తలాటం సత్య మాట్లాడుతూ కాకినాడ నగరానికి అధ్యక్షులుగా తోట సుధీర్ బాధ్యతలు స్వీకరించిన నాటినుండి జనసేన పార్టీకి అపుర్వమైన ఆదరణ లభించిందని తెలిపారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయానికి జనసేన ప్రభంజనం సృష్టించిందన్నారు. కార్యకర్తలను ఆదరించడం, అక్కున చేర్చుకోవడంలో తోట సుధీర్ ను మించిన నాయకుడు మరొకరు ఉండరన్నారు. నేడు ఆయన జన్మదిన వేడుకల జరిగిన తీరు చూస్తుంటే పదవిలో ఉన్నవారికి కూడా ఇంతమంది అభిమానులు ఉండరేమో అనిపిస్తుందన్నారు. జన సేన పార్టీ కార్యకర్తలకు తోట సుధీర్ అంటే పెద్ద భరోసా, నమ్మకం అన్నారు. ఈ కార్యక్రమం లో లారీ యూనియన్ మాజీ అధ్యక్షులు దుగ్గన బాబ్జి, ఆకులు శ్రీనివాస్, అడబాల సత్యనారాయణ, బడే కృష్ణ, తుమ్మల పల్లి రమేష్, వాడ్రెవు లోవరాజు, ఆట్ల సత్యనారాయణ, చోడిశెట్టి శ్రీమన్నారాయణ, మనోహర్ లాల్ గుప్తా, డాక్టర్ బాబు, వీర మహిళలు మిరియాల హైమావతి, బోడపాటి మరియా, బొట్టు లీలా, దిప్తి, బండి సుజాత తదితరులు ఉన్నారు.

# అవినీతి అధికారుల, అక్రమాలపై విచారణ జరపాలి

## పేదలకు జీవనాధారమైన ఆ భూములను పేదలకు పంచాలి

## నూతన ప్రభుత్వానికి బర్రే ఆనంద్‌కుమార్ ఫిర్యాదు



**రాజమహేంద్రవరం, విశ్వంవాయిస్ న్యూస్ :** "నూతన జిల్లాలు ఆవిర్భవించిన తర్వాత కొత్తగా ఏర్పడిన తూర్పుగోదావరి జిల్లాకు మొట్టమొదటి కలెక్టర్‌గా వచ్చిన గత కలెక్టర్ ఒక జిల్లా అడ్మినిస్ట్రేటివ్ అధికారిగా, మేజిస్ట్రేట్ గా కాకుండా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తగా పని చేసారని స్వతంత్ర జనతా పార్టీ (రిపబ్లిక్) ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు బర్రే ఆనంద్ కుమార్ ఆరోపించారు. జిల్లా మొత్తం అవినీతి, అక్రమాలకు తోడుగా నిలుస్తూ, కొండలు, మెట్టలు, చెరువుల్లో మట్టి, ఇసుక వంటి సహజ సంపదను దోచి పెట్టడమే కాకుండా ప్రభుత్వ భూములను చాలావరకు అన్యాక్రాంతం చేసేసారని మండిపడ్డారు. బుధవారం రాజమండ్రి ప్రెస్ క్లబ్‌లో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ నూతనంగా ప్రభుత్వం బాధ్యతలు చేపట్టిన తరువాత ముఖ్యమంత్రి చంద్రబాబు అవినీతి అధికారులపై ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామని ప్రకటించడం జరిగిందని దాన్ని దృష్టిలో పెట్టుకుని జిల్లాలో కలెక్టర్‌గా పనిచేసిన గత కలెక్టర్ చేసిన అవినీతి, అక్రమాలపై ఆయనకు ఫిర్యాదు చేస్తున్నట్టు తెలిపారు. రాజానగరం మండలం, శ్రీకృష్ణపట్నం గ్రామంలో సుమారు 80 ఎకరాల సీలింగ్ భూమి ఉంది. అది నిరుపేదలకు చెందాల్సిన భూమి అని సుప్రీంకోర్టు సైతం తీర్పు ఇచ్చిందని అయినప్పటికీ ఆ సర్వే నంబర్లను బ్లాక్‌లో పెట్టడం తప్ప అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని, తక్షణమే ఆ భూమిని ప్రభుత్వం తమ చేతుల్లోకి తీసుకొని, పేదలకు జీవనాధారమైన ఆ భూములను పేదలకు పంచాలని 2022 జూన్ 6వ తేదీన కలెక్టర్ గ్రీవెన్స్ సెల్ కి వెళ్లి, ఆధారాలతో సహా ఫిర్యాదు చేశాను. ఆ ఫిర్యాదు ఫైలును ప్రత్యేకంగా తన టేబుల్ పైన పెట్టాలని సి.సి ని పిలిచి చెప్పిన కలెక్టర్ ప్రత్యేక శ్రద్ధ తీసుకొని ప్రభుత్వ సీలింగ్ భూములను, కేవలం వారం రోజులకే ప్రైవేటు వ్యక్తికి ధారాదత్తం చేసే విధంగా మొత్తం సర్వే నెంబర్లను బ్లాక్‌లో నుంచి తీయించేశారని ఆరోపించారు. ఈ విషయమై విజయవాడలో సిసిఎల్ఏకి వెళ్లి స్పెషల్ చీఫ్ సెక్రటరీకి స్వయంగా ఫిర్యాదు చేయగా, ఐటీ సెల్ విభాగంలో వాటి వివరాలను పరిశీలించాల్సిందిగా, అసిస్టెంట్ సెక్రటరీ ఆదేశాలు జారీ చేశారని, వారు మా సమక్షంలోనే దాదాపు రెండు గంటల పాటు ఆ భూములు వివరాలను పరిశీలించినప్పటికీ, వాటి వివరాలు కనబడకుండా తీసేసారని దీనిపైన విచారణ చేస్తామని అధికారులు చెప్పారన్నారు.. కానీ ఆ తర్వాత రోజునే రాజానగరం మాజీ ఎమ్మెల్యే రెవిన్యూ మినిస్టర్‌ని, సీసీఎల్ఏ అధికారులను కలిసినట్లు పేపర్లో వచ్చిందని, దాంతో విచారణ ఆగిపోయిందన్నారు. ఈ విధంగా మూడుసార్లు సీసీఎల్ఏకి వెళ్లి ఫిర్యాదులు చేస్తున్న ఎలాంటి చర్యలు తీసుకోకపోగా, సిసిఎల్ఏ నుంచి తేజ్ భరత్‌ని ఇక్కడ జాయింట్ కలెక్టర్‌గా నియమించి, ఇక్కడ జాయింట్ కలెక్టర్‌ని సీసీఎల్ఏకు పంపించారు. ఇప్పుడు ఆ సీలింగ్ భూములను కొద్దికొద్దిగా ప్రైవేట్ వ్యక్తులకు అమ్ముకుంటున్నట్లుగా మా దృష్టికి వచ్చిందన్నారు. రాజానగరం నియోజకవర్గంలోని మునగాల కొండ, రఘుదేవపురం కొండ, నాగంపల్లి కొండ, నల్గొండ కొండ, రామచంద్రాపురం కొండ, కాటవరం కొండ, కోటి కేశవరం కొండ, ముగ్గుల్ల నుంచి కూనవరం వెళ్లే దారిలో మెట్ట, జీ.యర్రం పాలెం వద్ద ఉన్న కొండ ఇలా దాదాపుగా తూర్పుగోదావరి జిల్లాలో ఉన్నా ఏ కొండను, మెట్టను వదిలిపెట్టలేదని, ప్రకృతి సంపదను మొత్తం వైసిపి నాయకులు తో కలిసి దోచేశారని ధ్వజమెత్తారు. మైన్స్ డిపార్ట్మెంట్ వాళ్లకి ఆర్టిఐ ద్వారా సమాచారం అడగగా, కొండ తవ్వకాలకు ఎలాంటి అనుమతులు లేవని వారు సమాచారం ఇచ్చారు.ఈ విషయమై నేను ఎన్నిసార్లు గత జిల్లా కలెక్టర్ కి ఫిర్యాదులు చేసినా, కనీసం పట్టించుకోలేదు సరిగదా పగలు రాత్రి విచ్చలవిడిగా కొండ తవ్వకాలను యధేచ్ఛగా చేసేవారని పేర్కొన్నారు. నిబంధనలకు విరుద్ధంగా 30 నుంచి 60 అడుగుల లోతులో చెరువులు తవ్వడంతో పాటు మునగాల గ్రామం ఎస్సీ పేటలో ఉన్న సోషల్ వెల్ఫేర్ భూమిని సైతం వైసిపి నాయకులకు అన్యాక్రాంతం చేసేలా సహకరించారని ఆరోపించారు. అన్ని గ్రామాల్లోనూ రికార్డులను తారుమూరు చేసి విచ్చలవిడిగా భూ దందా చేసినా పట్టించుకునే నాధుడే కరువయ్యాడన్నారు. ఇళ్ల స్థలాల కోసం భూసేకరణ" పేరుతో మన జిల్లాలో జరిగిన అవినీతి గురించి ప్రత్యేకంగా చెప్పనవసరం లేదని, కలెక్టర్ మురళీధర్ రెడ్డితో ఈ అవినీతి ఆరంభమైతే గత జిల్లా కలెక్టర్ తో తారాస్థాయికి చేరిందని ఆందోళన వ్యక్తం చేసారు. ఐఎస్ స్థాయి అధికారులు కూడా ఇంత నిస్సిగ్గుగా, చట్టాలకు భయపడకుండా వ్యవహరించడంపై జిల్లా ప్రజలందరూ ఆందోళన వ్యక్తం చేస్తున్నారని బర్రే ఆనంద్‌కుమార్ పేర్కొన్నారు. నూతన ప్రభుత్వం సమగ్ర విచారణ చేయడానికి కమిటీ వేస్తే అన్ని ఆధారాలు సమర్పించడానికి సిద్ధంగా ఉన్నట్టు ప్రకటించారు. సమావేశంలో విస్సాకోటి శ్రీను, విజ్జిన వీర్రాజు,కొత్తపల్లి మహేష్, విజ్జిన రాంబాబు, దేగపాటి ప్రశాంత్ కుమార్, వేమవరపు రాజు, కాకి హనుమంతు, వందే లక్ష్మణరావు పాల్గొన్నారు.

# మీనాక్షి సినిమాను ఆదరించండి

**మంచి సందేశాత్మకమైన లేడీ ఓరియెంటెడ్ ఈ చిత్రం కొత్త వారవడితో ఉంటుందని నగర ప్రముఖులు ఆకాంక్ష**



**రాజమహేంద్రవరం, విశ్వంవాయిస్ న్యూస్ :**
నూతన నటీనటులతో నిర్మించిన మీనాక్షి సినిమాను ప్రేక్షకులు ఆదరించాలని సినిమా హీరో ఫేమస్ ప్రసాద్,(వద్దిపర్తి ప్రసాద్) పేర్కొన్నారు. మంగళవారం రాత్రి రాజమండ్రి వై జంక్షన్ లోని ఆనం రోటరీ హాల్లో మీనాక్షి చిత్రం ఫ్రీ రిలీజ్ షో కార్యక్రమం నిర్వహించారు. నూతనంగా పరిచయం చేస్తూ విజయ్ పేరాపు దర్శకత్వంలో నటించిన మీనాక్షి సినిమాకు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అనుశ్రీ సత్యనారాయణ, ధన్వంతరి నాయిబ్రాహ్మణ సమాఖ్య, ఏ.పి.ఛైర్మన్, బహుజన ఐక్యవేదిక అధ్యక్షులు రాష్ట్ర కళాకారుల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు సుందరపల్లి వి.వి.యస్. గోపాలకృష్ణ పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన నటీనటులతో నిర్మిస్తున్న మీనాక్షి చిత్రాన్ని ప్రేక్షకులు ఆదరించాలని పిలుపు నిచ్చారు. విశిష్ట అతిథులు తుమ్మిడి సంస్థల అధినేత, తుమ్మిడి ఛారిటబుల్ సొసైటీ తుమ్మిడి విజయకుమార్ మాట్లాడుతూ మీనాక్షి చిత్రం హీరో హీరోయిన్లతో పాటు యూనిట్ సభ్యులను అభినందించారు. యువకులతో తీస్తున్న చిత్రం కొత్త వారవడితో ఉంటుందని ఆకాంక్షించారు. చిత్రంలో నటించిన నటీనటులతో పాటు ఇతర సాంకేతి వర్గం కూడా ఉన్నత స్థాయికి చేరుకోవాలని కోరారు. మీనాక్షి షార్ట్ ఫిల్మ్ యువ దర్శకులు విజయ పేరాపు మాట్లాడుతూ మీనాక్షి ఫ్యూచర్ ఫిల్మ్ రాజమండ్రి, దోసకాయలపల్లి, అనపర్తి తదితర ప్రాంతాల్లో నెల రోజులు షూటింగ్ జరిగిందని తెలిపారు ప్రతి ఒక్కరూ చూసి ఈ చిత్రంలో విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. చిత్రంలో కద బాగుంటుందని హర్రర్ చిత్రంగా తెలిపారు. చిత్ర హీరో ఫేమస్ ప్రసాద్ (వద్దిపర్తి ప్రసాద్)మాట్లాడుతూ కష్టపడి తీసిన సినిమాలు ప్రేక్షకులు పెద్ద మనసు ఆదరించాలని కోరారు. విజయ్ పేరపు 20 సినిమాలు వరకు తీసారని తెలిపారు మీనాక్షి చిత్రంలో హీరోయిన్ గా మంజలి, హీరోగా ఫేమస్ ప్రసాద్, అసిస్టెంట్ డైరెక్టర్ గా సుగుణ మరెళ్ల ,యాక్టర్స్ వద్దిపర్తి సతీష్ .దాసరి రాము,శ్యాం,శ్రీనివాస్ చావలి,రావణమ్మ ,సుగుణ బేబీ యక్క, ఆంజనేయులు, హరికృష్ణ,భూషణం, తదితరులు నటించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కురగంటి సతీష్, ఏడిద బాబి, రొంగలి గోపిశ్రీనివాస్, యానాపు యేసు,ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నాయి బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షులు చిట్టాబత్తుల నాగబాబు , రాజమహేంద్రవరం పట్టణ నాయి బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షులు కందికొండ అనంత్, ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా నాయి బ్రాహ్మణ సంఘం సభ్యులు వెన్నేటి సత్యనారాయణమూర్తి ,గుండాల భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.



సినీ వాయిస్ CINEMA

# పీపుల్స్ స్టార్ ఆర్.నారాయణమూర్తికి అస్వస్థత



తెలుగు చలనచిత్ర రంగ ప్రముఖ నటుడు, దర్శకుడు, సంగీత దర్శకుడు, అభ్యుదయ చిత్రాల నిర్మాత, పీపుల్స్ స్టార్ ఆర్.నారాయణ మూర్తి బుధవారం తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. హైదరా బాద్‌లోని పంజాగుట్ట నిమ్స్ ఆస్పత్రిలో చేరి చికిత్స పొందుతున్నారు. డాక్టర్ బీరప్ప ఆధ్వర్యంలో ఆర్.నారాయణ మూర్తికి ఇంకా చికిత్స కొనసాగుతోంది. ఆయన క్రమంగా కోలుకుంటున్నట్టు డాక్టర్లు వెల్లడించారు. ఆర్. నారాయణ మూర్తి తనయుడు ఆర్.కార్తికేయ హాస్పిటల్ కి వెళ్లి మూర్తి ఆరోగ్యం గురించి తెలుసు కున్నారు. అనంతరం కార్తికేయ మాట్లాడుతూ బాబాయ్ కి స్టమక్ ఇన్ఫెక్షన్ వల్ల ఆస్పత్రిలో చేరారని, ఆయన ఆరోగ్యం ప్రస్తుతం నిలకడగానే ఉందని, అభిమానులు ఆందోళన చెందొద్దంటూ వెల్లడించారు. తన ఆరోగ్యం గురించి ఆందోళన చెందుతున్న అభిమానులను ఉద్దేశించి ఆర్.నారాయణమూర్తి ఒక ప్రకటన విడుదల చేశారు. నా ఆరోగ్యం గురించి అభిమానులు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని చెప్పారు. నిమ్స్ హాస్పిటల్ లో చికిత్స తీసుకుంటున్నాను. దేవుడి దయవల్ల బాగానే కోలుకుంటున్నాను. నేను కోలుకున్న తర్వాత నా ఆరోగ్యం గురించి అన్ని వివరాలు చెబుతాను అని ఆయన ప్రకటనలో పేర్కొన్నారు. ఆర్. నారాయణ మూర్తి గారి ఆరోగ్య పరిస్థితి పై నిమ్స్ ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ బీరప్పతో రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజ నర్సింహ చర్చించారు.



# క్యూట్‌గా కాటేసిన విదేశీ భామ

విదేశీ భామ లరిస్సా బొనేసీ సుపరిచితమే. తిక్క, నెక్ట్స్ ఏంటి లాంటి చిత్రాల్లో ఆడిపాడిన అమ్మడికి అటుపై అవకాశాలు రాలేదు. ముంబైలో ఉండి ప్రయత్నాలు చేస్తోందిగానీ అమ్మడికి ఛాన్సులిచ్చేవారే లేరు. అందం..అభినయం గల భామే అయినా అదృష్టం కలిసి రాలేదు. ఇక అమ్మడు సోషల్ మీడియాలో మాత్రం యాక్టివ్ గానే ఉంటుంది. రేర్ గా హాట్ ఫోటోలతో దర్శనమిస్తుంది. స్విమ్ షూట్...బీచ్ షూట్ అంటూ ఇప్పటికే ఇబ్బడి ముబ్బడిగా ఎన్నోసార్లు వైరల్ అయింది. తాజాగా సొగసరి మరోసారి డిజైనర్ ఔట్ ఫిట్ లో మెరిసింది. వైట్ కలర్ డిజైనర్ అమ్మడిని మరింత అందంగా హైలైట్ చేస్తుంది. లరిస్సా శరీర సౌష్టవానికి ఔట్ ఫిట్ పర్ఫెక్ట్ గా సూటయింది. అమ్మడి స్కిన్ టోన్..హెయిర్ స్టైల్..మ్యాకప్ ప్రతీది లరిస్సాని అందంగా ప్రొజెక్ట్ చేస్తుంది. ప్రస్తుతం ఈ ఫోటో నెట్టింట వైరల్ గా మారింది. లరిస్సా బ్యూటీని నెటి జనులు ఫిదా అవుతున్నారు. అమ్మడిని ప్రపోజల్స్ తో ముంచేస్తున్నారు. లుక్స్ గార్జియస్..బ్యూటీఫుల్ లేడీ అంటూ పొగిడేస్తున్నారు. నటిగా కంటే లరిస్సా ఇటీవల షారుక్ ఖాన్ తనయుడు ఆర్యన్ ఖాన్ తో డేటింగ్ చేస్తోంది! అన్న వార్త ఎంత సంచలనమైందో తెలిసిందే. ఇద్దరు పబ్ లో చిక్కినట్లు ప్రచారం సాగింది.

క్రైం వాయిస్

## జాతీయ రహదారిపై
# శవంతో నిరసన



**శంఖవరం, విశ్వంవాయిస్ న్యూస్ :**
కొన్ని ఏళ్ల క్రితమే అమ్మేసిన భూమి యజమాని మరణించగా కొనుగోలుదారుల నుంచి తమకు న్యాయం చేయాలని కోరుతూ మృతుని వారసులు మృతదేహంతో జాతీయ రహదారిపై నిరసన వ్యక్తం చేసిన వైనమిది. విశాఖపట్నంనకు ఒకప్పటి స్థానికుడు, స్టీల్ ప్లాంట్ విశ్రాంత ఉద్యోగి, పిఠాపురం స్థానికుడు, కత్తిపూడిలో రేస్ ఆఫ్ క్రాస్ మినిస్ట్రీస్ ఫౌండర్ డైరెక్టర్, లారెల్ పబ్లిక్ వ్యవస్థాపకులు రెవరెండ్ ఎం.జి.రాయ్ గా ప్రసిద్ధి చెందిన మోర్త గవరయ్య ఆస్తుల నిర్వహణా వ్యవహారం కాస్తా నడి రోడ్డుకు ఎక్కింది. మృతదేహంతో జాతీయ రహదారిపై నిరసన వ్యక్తం చేయడానికి దారి తీసింది. కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం శంఖవరం మండలం కత్తిపూడి శివారులో గవరయ్యకు ఉన్న భూమికి పది సంవత్సరాల క్రితమే ఒక ఫైనాన్స్ కంపెనీకి, ఆ తదుపరి మరొకరికీ అమ్మకపు ఒప్పందం చేసుకుని గవరయ్య డబ్బులు తీసుకున్నాడు. అప్పటి నుంచి ఆ భూమి తాగాదాల్లో ఉంది. భూముల ధరలు విపరీతంగా పెరిగాయి. ఈ క్రమంలో గవరయ్య (75) బుధవారం మరణించారు. ఐతే ఈ భూ తగాదాకు న్యాయస్థానంలో పరిష్కారం పొందడానికి బదులు ఆయన వారసులు మృతదేహాన్ని కత్తిపూడి – పిఠాపురం జాతీయ రహదారిలోని స్థలం వద్దకు సాయంత్రం తీసుకుని వచ్చి తమకు న్యాయం జరగాలని కోరుతూ జాతీయ రహదారిపై కొంత సమయం పాటు నిరసన వ్యక్తం చేశారు. దీనికి ఎమ్మార్పీఎస్ నేతలు మద్దతు తెలిపారు. దీంతో రవాణాకు అంతరాయం కలిగింది. ప్రత్తిపాడు సి.ఐ. శేఖర్ బాబు, అన్నవరం ఎస్సై కిశోర్ కుమార్ అక్కడికి చేరుకుని ఈ విషయమై పూర్తి దర్యాప్తు చేస్తామని హామీని ఇవ్వండతో నిరసన విరమించారు. మృతదేహాన్ని వివాదాస్పద స్థలంలోనే ఖననం చేసారు. మృతిని బంధువులు తమకు న్యాయం చేయాలని కోరారని, భూమి తగాదా బెంగతోనే గవరయ్య మృతి చెందారని బంధువులు తెలిపారని, ఈ ఘటనపై మృతుని బంధువులు ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తామని పోలీసులు మీడియాకు వెల్లడించారు.

# పూరి జగన్నాథ్ ఆలయంలో ఆదిత్య ఎన్.ఎస్.ఎస్. వాలంటీర్ల సేవలు




**రాజమహేంద్రవరం, విశ్వంవాయిస్ న్యూస్ :** రాజమహేంద్రవరం స్థానిక ఆదిత్య డిగ్రీ కళాశాల మరియు మహిళా డిగ్రీ కళాశాలల ఎన్.ఎస్.ఎస్ మరియు యూత్ రెడ్ క్రాస్ కు చెందిన 98 మంది వాలంటీర్లు పూరి జగన్నాథ స్వామి దేవాలయంలో భక్తులను వరుసక్రమంలో పంపించటం, తీర్థప్రసాదాలు పంచడం, వృద్ధులను జాగ్రత్తగా తీసుకు వెళ్ళడం ,పసిపిల్లలను ఎత్తుకుని సహాయం చేయడం, వంటి కార్యక్రమాల్లో ఉదయం 6:30 నుండి మధ్యాహ్నం 1:00.వరకూ కొంతమంది మధ్యా హ్నం రెండు గంటల నుండి రాత్రి 8:30 వరకు కొంతమంది ఆదిత్య డైరెక్టర్ ఎస్పీ గంగిరెడ్డి నేతృత్వంలో ఈ సేవలు చేయడం జరుగు తుంది. ఆదిత్య డైరెక్టర్ ఎస్పీ గంగిరెడ్డి మాట్లాడుతూ దేవి చౌక్ వద్ద గల 150 సంవత్స రాల నుండి ఉన్న పురాతన ఆలయం అని ఎం. జగన్నాథ్ దాసు సొంత ఆలయమని, నాలుగు తరాల నుండి ఈ ఆలయానికి తొలి ఏకాదశి రోజున పూజలు విశేషంగా జరుగుతాయని, భక్తులు అత్యధిక సంఖ్యలో తరలివస్తారని, ఆ రోజునే ప్రజలందరూ దర్శించుకునే వీలుంటుం దని ఇది సంవత్సరానికి ఒకసారి మాత్రమే జరుగుతుందని చెప్పారు. ఆదిత్య వాలంటీర్లు రెండు బ్యాచ్‌లుగా ఈ సేవలు అందిస్తారని ఆధ్యాత్మిక సామాజిక సేవా రంగా ల్లో ముందుండే తమ వాలంటీర్లు ఈ కార్యక్రమంలో ఈ సేవలు అందించడం తనకు ఎంతో ఆనందదాయకమని చెప్పారు. ఆదిత్య ప్రిన్సిపాల్స్ సిహెచ్ ఫణి కుమార్, ఎస్. కె .ఎన్ రెహమాన్, కంప్యూటర్ ఉపన్యాసకులు పి. సాయి ఆర్ట్ ఆఫ్ లివింగ్ పి.వి.యస్. కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు. ఎన్ఎస్ఎస్ లీడర్ యు. చరణ్ మౌళి, ఆదర్శ్ ,యజ్ఞశ్రీ,, లక్ష్మీ సుమ,బి.స్కూల్ కు చెందిన జి .హర్షిణి , ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ మరియు ఆదిత్య విద్యాసంస్థల ఎన్.ఎస్.ఎస్. కోఆర్డినేటర్ డాక్టర్ జి.వి.ఎస్ నాగేశ్వరరావు, ఎన్.ఎస్. ఎస్. పి. ఓలు మహేశ్వరి, డాక్టర్ బి హెచ్.వి రమాదేవి ఈ కార్యక్రమానికి సహకరించారు.

## జర్నలిస్టు పై విజయసాయి రెడ్డి అభ్యంతరకర
# వ్యాఖ్యలపై నిరసన సెగలు



**రాజమహేంద్రవరం, విశ్వంవాయిస్ న్యూస్ :**
జర్నలిస్టుల పై విజయ్ సాయిరెడ్డి చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ రాజమండ్రిలో సీనియర్ జర్నలిస్టులు మరియు జర్నలిస్టుల సంఘాలు భగ్గుమన్నాయి. ది రాజమండ్రి ప్రెస్ క్లబ్ వద్ద వందమంది జర్నలిస్టులు విజయసాయిరెడ్డి వ్యాఖ్యలపై ధర్నా చేపట్టారు, వెంటనే జర్నలిస్టులకు క్షమాపణ చెప్పాలని ఇటువంటి వ్యాఖ్యలు మరొకసారి చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. జర్నలిస్టులతో విచక్షణకోల్పోయి మాట్లాడుతున్న విజయ సాయిరెడ్డి ఒరేయ్ ఏరా..అని సంబోధించడం పై జర్నలిస్టులు అసహనం వ్యక్తం చేశారు. పాత్రికేయులు మాట్లాడుతూ విజయసాయిరెడ్డి పై వచ్చిన ఆరోపణలపై వివరణ ఇచ్చేందుకు ప్రెస్ మీట్ ఏర్పాటుచేసి అందులో విజయసాయి రెడ్డి మాట్లాడిన తీరు తీవ్ర అభ్యంతరకర మన్నారు. మీడియా ప్రతినిధులను అసభ్య పదజాలంతో దూషించడాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నట్లు జర్నలిస్టులు తెలిపారు. తక్షణమే మీడియా యాజమాన్యానికి, ప్రతినిధులకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేస్తూ నగరంలో ప్రధాన రహదారుల్లో నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ పాత్రికేయులు, ప్రతినిధులు, ప్రింట్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఘనంగా సునీల్
# పుట్టినరోజు వేడుకలు

**జితేంద్ర సేవా ఫౌండేషన్,మనం ట్రస్ట్ ఆధ్వర్యంలో**



**కొత్తపేట విశ్వం వాయిస్ న్యూస్** జితేంద్ర సేవా ఫౌండేషన్ జాయింట్ సెక్రటరీ సంసాని సునీల్ కుమార్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని ఆయన స్వగృహం నందు పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. జితేంద్ర సేవా ఫౌండేషన్ మరియు మనం ట్రస్ట్ ఆధ్వర్యంలో కుటుంబ సభ్యుల సమక్షంలో పుట్టినరోజు వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా సునీల్ కుమార్ చేత కేక్ కటింగ్ చేయించి బొకేలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో జితేంద్ర సేవా ఫౌండేషన్ ఛైర్మన్ ఎం.జితేంద్ర కుమార్,మనం ట్రస్ట్ ఛైర్మన్ కట్టా వీరబాబు, కోనసీమ బాలోత్సవం అధ్యక్షులు కర్రి కాశీ విశ్వనాథం, మనం ట్రస్ట్ కొత్తపేట అధ్యక్షుడు యండూరి పవన్ కుమార్, సభ్యులు గంగుమల్ల రాజు తదితరులు పాల్గొన్నారు.




VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by KHANDAVELLI SUNIL KUMAR, H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: KHANDAVELLI SUNIL KUMAR. RNI No: APTEL 2017/73603, viswamvoice@gmail.com